TARAJYOTHI TELUGU DAILY

తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

శనివారం, అక్టోబర్ 31, 2026 | సంపుటి - 21 | సంచిక 19 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

కాంగ్రెస్ ప్రభుత్వానికి మందు చూపు తప్ప ముందు చూపు లేదు

శుక్రవారం ఏబీఎన్‌తో రఘునందన్ రావు

సిద్దిపేట : వ్యవసాయం అనేది రాష్ట్ర ప్రభుత్వ అంశమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. శుక్రవారం ఏబీఎన్‌తో మాట్లాడుతూ.. ఢిల్లీకి ఎన్నిసార్లు తిరిగారో అన్ని సార్లు రైతుల వద్దకు తిరిగి ఉంటే.. వారికి నీళ్లు, కరెంట్ ఎంత అవసరం ఉంటుందో తెలిసేదన్నారు. ఈ ప్రభుత్వానికి ఏ ఆలోచనా లేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి అయితే ఏకంగా రబీ సాగు చేయొద్దని రైతులకు మిగతా 2లో

ఎన్డీఏ కూటమిలోనే గ్రామాల్లో అభివృద్ధి

హోం మంత్రి వంగలపూడి అనిత

అనకాపల్లి జిల్లా, అక్టోబరు 30 : ఎన్డీఏ కూటమిలోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ఆయా గ్రామాల్లో రోడ్లు వేశామని.. అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామని పేర్కొన్నారు. శుక్రవారం అనకాపల్లి జిల్లాలోని పాయకరావు పేట నియోజకవర్గంలో హోం మంత్రి అనిత సుడిగాలి పర్యటన చేశారు. యస్ రాయవరం, పాయకరావుపేట మండలాల్లో పలు గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని 2లో

తుఫాన్ నష్టంపై సమగ్ర అంచనా

ప్రతి బాధితుడికి న్యాయం: సీఎం చంద్రబాబు

పశ్చిమగోదావరి : అర్నబ్ తుఫాన్ బాధితులకు ఆదుకోవడమే తమ మొదటి ప్రాధాన్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తుఫాన్ బాధితులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎన్నికల కంటే బాధితుల సంక్షేమమే తమకు చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు మండలంలో ముఖ్యమంత్రి పర్యటించారు. క్షేత్రస్థాయిలో తుఫాన్ ప్రభావాన్ని పరిశీలించారు. మొగల్తూరు మండలం మెట్రేవు గ్రామంలో తుఫాన్ బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. తుఫాన్ మొదలైన దగ్గర నుంచి తాను ఎప్పటికప్పుడు పరిశీలించానని తెలిపారు. రాబోయే రబీ పంటకు సాగునీరు ఇబ్బంది ఉండదని వ్యాఖ్యానించారు. తుఫాన్ వర్షాలతో అన్ని రిజర్వాయర్లు నిండాయని పేర్కొన్నారు. ఆస్తినష్టం, ప్రాణనష్టం నివారణకు తాము చర్యలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. తుఫాన్ నష్ట నివారణకు 2లో

మియాపూర్‌లోని 550 ఎకరాలను కొట్టేసేందుకు కేసీఆర్ ప్రయత్నం

ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్

హైదరాబాద్ :

మియాపూర్‌లోని 550 ఎకరాల భూములను కొల్లగొట్టేందుకు కేసీఆర్, ఆయన బంధువులు అనేక రకాలుగా ప్రయత్నించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూములను కొట్టేసేందుకు గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు ప్రయత్నించారన్న ఆయన ఈ భూముల విషయంలోనే బీఆర్?ఎస్ రాజ్యసభ ఎంపీ దామోదరరావుకు ప్రసాదరావు ఖరీదైన కారు బహుమతిగా ఇచ్చారని అన్నారు. కొందరు అధికారులను అడ్డంపెట్టుకుని భూములు కొట్టేయాలని బీఆర్?ఎస్? నేతలు చూశారన్న సీఎం రేవంత్ రెడ్డి ఈ వివాదంలో ఆ అధికారులు కూడా అరెస్టయ్యారని తెలిపారు. మియాపూర్‌లోని 550 ఎకరాలను కాపాడేందుకు కేసీఆర్ సర్కారు ఏ ప్రయత్నం చేయలేదని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించి రూ.50 వేల కోట్ల ఆస్తిని కాపాడుకోగలిగామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాగానే ఈ భూములు స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. అవసరమైతే ఈ భూములను వేలం వేసి దళిత, బహుజనుల కోసం ఖర్చు చేస్తామని ప్రకటించారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు భూ కబ్జా వ్యవహారాలపై పోరాడితే, జైలుకు పంపారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. భూములను విక్రయించి నీటిపారుదల, విద్యా, వైద్యం వంటి తదితర రంగాలకు కేటాయిస్తామన్నారు. ఈ అంశంపై క్యాబినెట్ లో చర్చిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 1.50 లక్షల కోట్ల విలువైన భూములు రక్షించినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగిస్తే బీఆర్ఎస్ నాయకులు కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూములను కొట్టేసేందుకు ప్రయత్నిస్తే న్యాయ పోరాటంలో గెలిచామని సీఎం అన్నారు. గుర్రంగూడలో అటవీ భూములను కేటీఆర్ అనుచరులు కబ్జాకు ప్రయత్నిస్తే సుప్రీం కోర్టుకు వెళ్లి కాపాడినట్లు తెలిపారు. మంచిరేవులలో 143 ఎకరాల భూమిని కేటీఆర్ రాయలసీమ బిల్డర్స్?తో కలిసి కబ్జాకు ప్రయత్నిస్తే దానిని రక్షించామన్నారు. అందులో ప్రస్తుతం పోలీసుల పిల్లల కోసం స్కూల్ నిర్మించినట్లు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగిస్తే స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగతా 2లో

ఆదిలాబాద్‌కు ఏ ముఖం పెట్టుకుని వస్తారు

కేటీఆర్‌పై కవిత ధ్వజం

ఆదిలాబాద్ : బీఆర్ఎస్, మాజీ మంత్రి కేటీఆర్‌పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లుండి ఆదిలాబాద్‌లో జరిగే బీఆర్ఎస్ గర్జనపై కవిత హాట్ కామెంట్స్ చేశారు. అది గర్జన కాదు... తర్జన భర్జన అని ఎద్దేవా చేశారు. అది సిద్దిపేట బాబు- సిరిసిల్ల బాబు మధ్య జరుగుతున్న తర్జన భర్జన అని వ్యంగ్యంగా మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమను ఎందుకు తెరిపించలేదని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆ పరిశ్రమను ఎందుకు కాపాడలేక పోయారని నిలదీశారు. కాగజ్ నగర్ ప్రైవేటు కాగితపు పరిశ్రమను తెరిపించిన కేటీఆర్.. ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ రంగ పరిశ్రమను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఏ ముఖం పెట్టుకుని ఆదిలాబాద్‌లో రైతు గర్జన పెడుతున్నారో కేటీఆర్ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. చనాఖా- కొరాటా బ్యారేజీకి అదనంగా పెట్టిన రూ. 1700కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో కేటీఆర్ చెప్పాలని పట్టుబట్టారు. నాటి జిల్లా మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జోగు రామన్న తిన్నారా... మిగతా 2లో

ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించం

ప్రభుత్వ భూములను కాపాడుతాం : మంత్రి పొంగులేటి

హైదరాబాద్ : ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ పడేది లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కంచె గచ్చిబౌలి నుంచి మియాపూర్ వరకు ప్రభుత్వానికి దక్కిన వరుస న్యాయ విజయాలని పేర్కొన్నారు. కంచె గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి అనుకూల తీర్పు వచ్చిందని వెల్లడించారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు. 2లో

రేవంత్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తిరుగుతా

ఈటల సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ : జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించాలంటూ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర కొనసాగుతోంది. ఈ సందర్భంగా పాదయాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తిరుగుతానని స్పష్టం చేశారు. 'నేను డంప్ యార్డు తీసేయాలని పాదయాత్ర చేస్తుంటే ఈటల రాజేందర్ పనిలేక తిరుగుతున్నారంటూ కాంగ్రెస్ నాయకులు అంటున్నారట.. ఈ డంప్ యార్డ్‌ను తొలిగించే వరకు మాత్రమే కాదు.. మీ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తిరుగుతా' అంటూ వ్యాఖ్యానించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు రీసైకిల్ కోసం ఎంత ఖర్చవుతుందో డీపీఆర్ చేసి మిగతా 2లో

అమర వీరులను అవమానించిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

హైదరాబాద్ : తెలంగాణ అమరవీరులను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే రాష్ట్రంలో అడుగు పెట్టాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. అమిత్ షా హైదరాబాద్‌కు నవంబర్ 2న రానున్నారని, ఎవరైనా స్వేచ్ఛగా వచ్చి వెళ్లవచ్చని అన్నారు. అయితే గతంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, తెలంగాణ అమరవీరుల పట్ల అవమానకరంగా మాట్లాడిన ఆయనకు ఇక్కడికి వచ్చే అర్హత ఉందా అని శుక్రవారం విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. గతంలో ఒక ఓటు రెండు రాష్ట్రాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసగించింది మీరు కాదా? అని ఆయన ప్రశ్నించారు. కాబట్టి హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమంలో పాల్గొనడానికి ముందుగా అమిత్ షా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో తమ పోరాటం ఆగదని అన్నారు. 2లో

సికింద్రాబాద్‌లో అండాల అక్రమ సేకరణ గుట్టురట్టు

అదుపులోకి 10 మంది యువతులు

సికింద్రాబాద్: బేగంపేటలో యువతుల అండాల సేకరణ వ్యవహారం కలకలం రేపుతోంది. బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన యువతుల నుంచి అక్రమంగా అండాలు సేకరిస్తున్నట్లు బేగంపేట పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ప్రకాశ్ నగర్‌లోని నగ్రాన్ అపార్ట్‌మెంట్‌పై ఎస్ఓటీ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అమీ నీతా గర్ల్స్ హాస్టల్ పేరుతో గత ఏడాది కాలంగా అక్రమ అండాల సేకరణ వ్యవహారం 2లో

మియాపూర్‌లోని 550 ఎకరాలను కొట్టేసేందుకు కేసీఆర్ ప్రయత్నం

హరీశ్ రావు మామ కబ్జా.. మాజీమంత్రి హరీశ్? రావు మామ హనుమంత రావు కబ్జా పెట్టిన భూములను అధికారులు సర్వే చేయకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. పైగా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని సీఎం రేవంత్ చెప్పారు. భూముల ఆక్రమణపై బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై అనేక తప్పుడు ఆరోపణలు చేశారని ధ్వజమెత్తారు. శాసనసభలో చర్చ పెట్టి చర్యలకు దిగితే తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే ఎందుకు బీఆర్ఎస్ నాయకులు స్పందించడం లేదని ప్రశ్నించారు. కనీసం రెవెన్యూ అధికారులను ఎందుకు బీఆర్ఎస్ నాయకులు అభినందించడం లేదని అన్నారు. పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు.. ఉమ్మడి రాష్ట్రంలో పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు వేసిన కేసీఆర్, హరీశ్? రావు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు వాటిని స్వాధీనం చేసుకోలేదని సీఎం ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరిపై కేసులు వేశారో వారితోనే కేసీఆర్, హరీశ్ రావు లాలూచీ పడ్డట్లు తెలిపారు. మియాపూర్ భూములపై ఇప్పటికైనా కుట్రలు మానుకోవాలని సూచించారు.

బీఆర్?ఎస్? నేతలు భూ ఆక్రమణలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని సీఎం సవాల్ విసిరారు. "కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలంగాణలో ఎక్కడైతే అత్యంత విలువైన ప్రభుత్వ భూములున్నాయో వాటిని తన కుటుంబ సభ్యులు, అనుచరుల మీదకు బదిలీ చేసి కొట్టేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ మా ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటన్నింటితో పాటు మియాపూర్?లోని రూ.50 వేల కోట్ల విలువైన ఆస్తి(550 ఎకరాలు)ని న్యాయస్థానాల్లో పోరాటం చేసి కాపాడాం" -రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఎల్బీనగర్‌లో 150 ఎకరాలను అటవీ ప్రాంతంగా మార్చామన్న సీఎం ఈ మూడేళ్లలో రూ.లక్షా 50 వేల కోట్ల విలువైన భూములను కబ్జా చెర నుంచి కాపాడినట్లు వెల్లడించారు. భూములను ఇలాగే వదిలేస్తే కేసీఆర్ ముఠా మళ్లీ కబ్జా చేస్తుందని అన్నారు. మియాపూర్? భూములను ప్రజాప్రయోజనాలకే ఉపయోగిస్తామని స్పష్టం చేశారు. భూ కబ్జాకు యత్నిస్తే ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్న ఆయన ఉన్నది లేనట్టుగా లేనిది ఉన్నట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్?ఎస్?కు చెందిన వార్తా పత్రికలు, టీవీల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఆక్షేపించారు. దొంగలందరూ ఒక్కటై కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. సీఎం సూచనలతోనే విలువైన భూములు కాపాడాం సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి ఆదేశం మేరకు మియాపూర్ భూములను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. సర్వే నంబర్? 100,101 భూములను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆ భూములు హెచ్ఎండీఏ అధీనంలోనే ఉన్నాయని తెలిపారు. 400 ఎకరాల భూమికి ఫెన్సింగ్ వేశామన్న ఆయన మరికొంత భూమికి ఫెన్సింగ్ త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. సెటిల్‌మెంట్ రికార్డులో ప్రభుత్వ భూమిగా ఉందని, మియాపూర్ భూమి 1949లోనే జాగీర్‌దార్ నుంచి ప్రభుత్వ పరమైందన్నారు. 1995లో ప్రారంభమైన వివాదం 23 ఏళ్ల పాటు కోర్టులో నడిచిందని వివరించారు. కోర్టుకు అన్ని రికార్డులు సమర్పించడం వల్లే భూమి దక్కిందన్నారు. సీఎం సూచనలతో విలువైన భూములు కాపాడామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ సర్వే నంబర్లలో ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లడం లేదని స్పష్టం చేశారు.

ఆదిలాబాద్‌కు ఏముఖం పెట్టుకుని వస్తారు

లేకుంటే నాటి ఇరిగేషన్ మంత్రిగా ఉన్న వ్యక్తి జేబుల్లోకి వెళ్లాయో చెప్పాలని ప్రశ్నించారు. పరిశ్రమ మంత్రిగా దేశ విదేశాలు తిరిగిన కేటీఆర్... వెనుకబడ్డ ఆదిలాబాద్ జిల్లాలో టెక్స్‌టైల్స్ పార్క్‌ను ఎందుకు పెట్టలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రశ్నలకు జవాబు చెప్పిన తర్వాతనే కేటీఆర్ ఆదిలాబాద్ రైతు గర్జన కు రావాలని కవిత పట్టుబట్టారు.

రేవంత్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తిరుగుతా

ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎంపీ కోరారు. ప్రధాని నరేంద్ర నరేంద్ర మోదీని ఒప్పించి అవసరమైన డబ్బులను తీసుకొస్తామని ప్రకటించారు. అలా తీసుకురాలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా అంటూ ఎంపీ ఈటల రాజేందర్ ఛాలెంజ్ విసిరారు. కాగా.. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలంటూ ఈనెల 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్రను మొదలుపెట్టారు. ఈ డంపింగ్ యార్డు వల్ల వెలువడే కాలుష్యంతో చుట్టుపక్కల గ్రామాలు, కాలనీల ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని తెలిపారు. గాలి, భూగర్భ జలాలు కలుషితమయ్యాయని.. వెంటనే డంపింగ్ యార్డును తొలగించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించం

తాజాగా మియాపూర్ భూముల విషయంలోనూ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో విజయం వరించిందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రెవెన్యూ, న్యాయశాఖ, ప్రభుత్వ న్యాయవాదుల మధ్య సమన్వయంతో న్యాయపోరాటం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. పాత భూ రికార్డులు, రెవెన్యూ ఆధారాల పరిశీలనతో ప్రభుత్వ హక్కులను పరిరక్షిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు.. రాష్ట్ర ప్రజల ఉమ్మడి ఆస్తి అని ఉద్ఘాటించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. న్యాయపోరాటంలో కీలక పాత్ర పోషించిన రెవెన్యూ అధికారులు, న్యాయ నిపుణులకు మంత్రి అభినందనలు తెలిపారు. భవిష్యతు తరాల ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూములను కాపాడుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

సికింద్రాబాద్‌లో అండాల అక్రమ సేకరణ గుట్టురట్టు

నడుస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. అనంతరం అక్కడ ఉన్న బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన సుమారు 8 నుంచి 10 మంది యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో ఓ మహిళ పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. దీంతో ఆమెను అదుపులోకి తీసుకుని అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. మల్కాజిగిరి సీపీ సుమతి ఆదేశాలతో ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. సంతాన సాఫల్య కేంద్రాలకు యువతుల అండాలను సరఫరా చేస్తున్నారా? అనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అలాగే, అండాల అక్రమ సేకరణ, విక్రయాల వెనుక ఎవరెవరు ఉన్నారనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాగా, పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

రేషన్ బియ్యం స్కామ్ గుట్టురట్టు..

రీసైక్లింగ్ చేసి బ్రాండెడ్ పేరుతో విక్రయం

హైదరాబాద్, అక్టోబరు 20 : హైదరాబాద్ పరిధిలో దర్జాగా సాగుతున్న భారీ రేషన్ బియ్యం మాఫియా అక్రమాలను సివిల్ సప్లైస్, విజిలెన్స్ చెక్ పెట్టాయి. పేదలకు ప్రభుత్వం అతి తక్కువ ధరకు లేదా ఉచితంగా సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని దళారులు అక్రమ మార్గాల్లో సేకరించి, వాటిని రీ-సైక్లింగ్ చేసి మార్కెట్లో విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. కర్మన్ ఘాట్ పరిసరాల్లోని ప్రముఖ రైస్ డిపోలు, గోదాములపై ఉన్నతాధికారులు దాడులు చేశారు. ఈ సోదాల్లో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన రేషన్ బియ్యం సంచులు, కల్తీ ప్రాసెసింగ్ యంత్రాలను అధికారులు సీజ్ చేశారు. రేషన్ లబ్ధిదారుల నుంచి లేదా రేషన్ డీలర్ల నుంచి అతి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని మాఫియా ఏజెంట్లు సేకరిస్తారు. ఇలా సేకరించిన లావు బియ్యాన్ని రైస్ మిల్లులు, డిపోల్లో ప్రత్యేక యంత్రాల ద్వారా పాలిష్ పట్టిస్తారు. దీనివల్ల బియ్యం తెల్లగా, సన్న బియ్యం మాదిరిగా కనిపిస్తాయి. రీ సైకిల్ చేసిన ఈ బియ్యాన్ని ప్రముఖ, పేరుగాంచిన బ్రాండెడ్ కంపెనీల కవర్లు, డూప్లికేట్ బ్యాగుల్లో ప్యాక్ చేస్తారు. మార్కెట్లో ఈ కల్తీ బియ్యాన్ని కిలో రూ. 80 నుంచి రూ. 100 వరకు విక్రయిస్తూ వినియోగదారులను దారుణంగా మోసం చేస్తున్నారు.రేషన్ బియ్యాన్ని పదే పదే పాలిష్ చేయడం ద్వారా వాటిలో ఉండాల్సిన పోషకాలు కోల్పోతాయి. ప్రాసెసింగ్ సమయంలో వాడే రసాయనాల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రేషన్ అక్రమ తరలింపునకు సహకరిస్తున్న డీలర్లు, మిల్లుల యజమానులు, దళారులపై పి.డి. యాక్ట్ కింద కేసు నమోదు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు జరగకుండా బయోమెట్రిక్ ట్రాకింగ్, జీపీఎస్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ తెలిపింది.

మచిలీపట్నంలో వర్ష బీభత్సం..

రెండు రోజులైనా తగ్గని నీరు

జలమయమైన రహదారులు.. ప్రజలకు తప్పని ఇక్కట్టు

మచిలీపట్నం అర్నబ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మచిలీపట్నం నగరం జలమయమైంది. ఎటు చూసినా రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసి రెండు రోజులు గడుస్తున్నప్పటికీ రహదారులపై నీరు ఏమాత్రం తగ్గకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులు వర్షపు నీటితో నిండిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రోడ్లపై నిలిచిపోయిన నీరు డ్రైనేజీలను తలపిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.వర్షపు నీరు సకాలంలో బయటకు వెళ్లకపోవడంతో నగరంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి నిల్వలను తొలగించి, రహదారులపై సాధారణ పరిస్థితులు నెలకొనేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు ఒకవైపు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండగా, మరోవైపు రెండు రోజులైనా రోడ్లపై నీరు తగ్గకపోవడం నగర ప్రజలకు మరింత భారంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీటిని తొలగించే చర్యలను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తుఫాన్ నష్టంపై సమగ్ర అంచనా

ప్రజల్లో అవగాహన తీసుకువచ్చామని అన్నారు. అధికార యంత్రాగాన్ని అన్నింటికి సిద్ధం చేశామని తెలిపారు. టెక్నాలజీ, క్షేత్రస్థాయి అంశాలను కలిపి సమీక్ష చేశామని.. దీంతో చాలావరకు ప్రాణనష్టం తగ్గిందని వెల్లడించారు. దురదృష్టవశాత్తు ఒకరిద్దరు మృతిచెందారని అన్నారు. తుఫాన్ రోజున 12,500 చెట్లు, 4500 విద్యుత్ స్థంభాలు పడిపోయాయని చెప్పారు. తెలంగాణ నుంచి కూడా విద్యుత్ సిబ్బందిని పంపాలని తాము కోరామని తెలిపారు. ఎల్లుండి ఉదయానికి ఇళ్లకు కరెంటు ఇస్తామని అన్నారు. ఆ తర్వాత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరిస్తామని చెప్పారు. కమ్యూనికేషన్ వ్యవస్థను రేపు ఉదయంలోగా పూర్తిగా పునరుద్ధరిస్తామని తెలిపారు. రేపు, ఎల్లుండో కేంద్ర బృందం ఏపీకి వస్తుందని పేర్కొన్నారు. రెండు ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఉద్యానవన, వరి పంటలు దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. బీమా కట్టిన రైతులకు బీమా వస్తుందని తెలిపారు. దానికి అదనంగా హెక్టారుకు రూ.25 వేల ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని ప్రకటించారు. బీమా కట్టని రైతులకు ఇబ్బంది వస్తోందని.. వారు కూడా భవిష్యత్తులో బీమా కట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, దెబ్బతిన్న ఇళ్లకు రూ.10 వేలు, కిరాణా దుకాణాలకు రూ.25 వేల నష్టం ఇస్తామని స్పష్టం చేశారు. చేనేత కార్మికులకు రూ. 25 వేల ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. 65 రకాల పంటలకు ఏ మేరకు నష్టపరిహారం ఇవ్వాలో నిర్ణయించామని సీఎం అన్నారు. సహాయక చర్యలు పూర్తయిన తర్వాత నష్టం అంచనాలు వేస్తామని వివరించారు. ప్రతీ ఒక్కరికీ న్యాయం చేసేంతవరకు సహాయక చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజల్లో ఒక నమ్మకాన్ని, విశ్వాసాన్ని కలిగించాలని చెప్పుకొచ్చారు. ఎన్ని పనులు ఉన్నా తుఫాన్ బాధితులను ఆదుకోవడానికి ప్రాధాన్యం ఇస్తామని మాటిచ్చారు. అక్వారంగానికి జరిగిన నష్టంపైనా సమీక్షిస్తామని చెప్పారు. ప్రజల్లో బాధ్యత రావాలని.. అవగాహన పెంచుకోవాలని సూచించారు. డ్రైనేజ్ వ్యవస్థను రూ.3 వేల కోట్లతో ప్రక్షాళన చేస్తామని అన్నారు. దెబ్బతిన్న సోలార్ ప్లాంట్లకు సహాయం చేస్తామని... వశిష్ట గోదావరి నది ప్రక్షాళనకు అధ్యయనం చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

అమెరికన్ల ఉద్యోగాలు విదేశీయులకు ఇస్తే ఊరుకోం..

కంపెనీలకు వాన్స్ వార్నింగ్

వాషింగ్టన్ : విదేశీ కార్మికుల నియామకంలో వీసా మోసాలపై చర్యలు తీసుకుంటామన్న వాన్స్అమెరికన్లను తొలగించి విదేశీయులను నియమించే కంపెనీలను లక్ష్యంగా చేసుకున్నామని వెల్లడితయారీ రంగంలో 670 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చినట్లు ప్రకటనఓడరేవులు, చమురు శుద్ధి కేంద్రాలు, కర్మాగారాల విస్తరణతో స్థానికంగా ఉద్యోగాలు పెరుగుతాయని ఆశాభావంయువతకు ఇళ్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామని వెల్లడిఅమెరికన్ల ఉద్యోగాలను విదేశీ కార్మికులకు కట్టబెట్టే కంపెనీలపై చర్యలు తీసుకుంటామని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పష్టం చేశారు. వీసా మోసాలకు పాల్పడే సంస్థలు, అమెరికా ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో విదేశీ కార్మికులను నియమించే కంపెనీల యాజమాన్యాలే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. టెక్సాస్‌లోని వెదర్‌ఫోర్డ్‌లో ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ సార్వభౌమాధికారం అంటే అమెరికా పౌరుల ప్రయోజనాలను కాపాడటమేనని వాన్స్ అన్నారు. అమెరికా ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో విదేశీ కార్మికులను నియమించే సంస్థలపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అయితే ఏయే కంపెనీలపై దర్యాప్తు జరుగుతోంది? ఏ వీసా కేటగిరీకి సంబంధించి అక్రమాలు జరిగాయి? అనే వివరాలను ఆయన వెల్లడించలేదు. అమెరికా కార్మికులకు మేలు చేసేలా వాణిజ్య విధానాలను రూపొందిస్తున్నామని వాన్స్ చెప్పారు. దేశంలో కొత్తగా 670 బిలియన్ డాలర్ల తయారీ రంగ పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. ఓడరేవులు, చమురు శుద్ధి కేంద్రాలు, కర్మాగారాల విస్తరణతో స్థానికంగా ఉద్యోగాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధిలో టెక్సాస్ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. యువత సొంత ఇల్లు కొనుగోలు చేయగలిగేలా చర్యలు తీసుకుంటున్నామని వాన్స్ తెలిపారు. వాల్‌స్ట్రీట్ సంస్థలు, విదేశీ పెట్టుబడిదారులు ఇళ్ల కొనుగోళ్లపై చూపే ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. టిప్స్ ద్వారా వచ్చే ఆదాయం, అదనపు పని గంటల వేతనాలు, సీనియర్లకు పన్ను ఉపశమనం కల్పించే చర్యలను ప్రస్తావించారు. చిన్నపిల్లలున్న కుటుంబాలకు ప్రయోజనాలు పెంచడంపైనా మాట్లాడారు. యువత సొంత ఇళ్లు కొనుక్కొని, కుటుంబాలను ఏర్పరచుకుని, స్థిరమైన ఉద్యోగాలతో జీవించే పరిస్థితులు రావాలని వాన్స్ ఆకాంక్షించారు. తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకుంటూ.. మందులు కొనాలా? ఆహారం కొనాలా? అని ఆలోచించాల్సిన పరిస్థితులు తన కుటుంబంలో ఉండేవని చెప్పారు. సామాన్య కుటుంబాల జీవన వ్యయాన్ని తగ్గించడం ప్రభుత్వ బాధ్యతగా అభివర్ణించారు. కెన్ పాక్స్‌టన్ అమెరికా సెనేట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వాన్స్ ఈ సభలో పాల్గొన్నారు. ఉద్యోగాలు, సరిహద్దు భద్రత, ఇంధన ఉత్పత్తి, జీవన వ్యయాల తగ్గింపును ప్రస్తావిస్తూ రిపబ్లికన్ అభ్యర్థులకు మద్దతివ్వాలని ఓటర్లను కోరారు.

మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఊరట

మెదక్, అక్టోబరు 20 తెలంగాణ ప్రభుత్వం మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఊరట కల్పించింది. మలన్నసాగర్ భూ నిర్వాసితులకు గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పునరావాసం కల్పించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులకు ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ఫీజు నుంచి మినహాయింపు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే ఎల్ఆర్ఎస్ నుంచి మినహాయింపును అమలు చేస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో మల్లన్నసాగర్ బాధితులకు ఊరట దక్కింది.సిద్ధిపేట జిల్లా పరిధిలో మల్లన్నసాగర్ నిర్మాణంతో తొగుట మండలంలోని ఆరు గ్రామాలు (లక్ష్మాపూర్, ఏటిగడ్డ కిష్టాపూర్, పల్లెపహాడ్, బంజేరుపల్లి, తండా, వేములఘాట్).. కొండపాక మండలంలోని రెండు గ్రామాలు (ఎర్రవల్లి, సింగారం) ముంపునకు గురయ్యాయి. ఈ ముంపు గ్రామాల నిర్వాసితుల కోసం గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్, లింగరాజుపల్లి మధ్య ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మించిన సంగతి తెలిసిందే. గత మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఈ ముంపు గ్రామాలను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ప్రభుత్వం విలీనం చేసింది.రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఈ కాలనీల్లో స్థలాలు పొందిన నిర్వాసితులు ఇళ్లు నిర్మించుకునే సమయంలో అనుమతి లేదని మున్సిపల్ అధికారులు అడ్డుకుంటున్నారు. కొత్త ఇంటి నిర్మాణం అగిపోవడంతో ఎల్ఆర్ఎస్ నుంచి పదేళ్లపాటు మినహాయింపు కల్పించాలని నిర్వాసితులు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉత్తర్వులు జారీ చేయడంతో మల్లన్నసాగర్ నిర్వాసితులు ఆనందంలో ఉన్నారు.మరోవైపు మల్లన్నసాగర్ జలాశయం కట్టను ఆనుకొని భారీ పేలుళ్లు జరుగుతున్నాయన్నారు మాజీ మంత్రి హరీష్‌రావు. ఈ పేలుళ్లలతో కట్టకు ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ఆయన మల్లన్నసాగర్ ఇన్‌టెక్ వెల్‌ను పరిశీలించారు. ఇంజినీర్ల అనుమతులు లేకుండా పనులు ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించారు. అక్కడ జిలెటెన్ స్టిక్స్ పెట్టి పేలుళ్లు ఎందుకు చేపడుతున్నారో చెప్పాలన్నారు. కిలోమీటరు దూరంలో తిప్పారంలో గోడలకు పగుళ్లు వస్తున్నాయన్నారు. మల్లన్నసాగర్‌పై కుట్రలు చేస్తున్నట్లు అనుమానం ఉందన్నారు. ఈ పేలుళ్లకు విచారణ జరిపి బాధ్యులైనవారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై హరీష్‌రావు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు

రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో వన్ వే

హైదరాబాద్, అక్టోబరు 20 : హైదరాబాద్ ఐటీ కారిడార్‌తో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నిత్యం వేలాది మంది టెక్కీలను, వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రెండు ప్రధాన జంక్షన్లలో త్వరలోనే వన్ వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాంతాల్లో సమగ్ర ట్రాఫిక్ అధ్యయనం నిర్వహించిన అధికారులు, వన్ వే విధానం అమలు సాధ్యాసాధ్యాలను పూర్తిస్థాయిలో పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గతంలో కేబీఆర్ పార్క్ వద్ద అమలు చేసిన వన్ వే వల్ల దాదాపు 6 కిలోమీటర్ల మేర అదనపు ప్రయాణం చేయాల్సి రాగా, ఇక్కడ మాత్రం వాహనదారులకు కేవలం 2 కిలోమీటర్ల మేర మాత్రమే అదనపు ప్రయాణ భారం పడనుంది.ఈ కొత్త ట్రాఫిక్ నిబంధనల వల్ల ఐటీ కారిడార్‌లో కనీసం 40 శాతం మేర ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దశలవారీగా చేపట్టనున్న ఈ ప్రణాళికలో భాగంగా.. తొలుత వారం, రెండు వారాల వ్యవధిలోనే రాయదుర్గం జంక్షన్ పరిసరాల్లో వన్ వే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఆ తర్వాత పరిస్థితిని సమీక్షించి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మరో కీలక జంక్షన్‌లోనూ దీనిని విస్తరిస్తారు. ఈ మార్పుల వల్ల ఉద్యోగులకు, సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు సమీపంలోని కార్పొరేట్ కంపెనీలు, వాణిజ్య సంస్థలు, మాల్స్, విద్యాసంస్థల యాజమాన్యాలకు ముందస్తు సమాచారం అందించి వారిని సమాయత్తం చేస్తున్నారు.మరోవైపు, పీక్ అవర్లలో ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గించేందుకు ఆర్టీసీతో చేతులు కలిపిన సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు.. వినూత్నంగా కాంట్రా ఫ్లో ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రవేశపెట్టనున్నారు. తీవ్ర రద్దీ ఉండే జేఎన్‌టీయూ, హఫీజ్‌పేట్, రాయదుర్గం జంక్షన్లను గుర్తించి, జేఎన్‌టీయూ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు అలాగే తిరుగు ప్రయాణంలో ఈ బస్సులను నడపనున్నారు. ప్రధాన రహదారులపై మనుషులు అడ్డదిడ్డంగా దాటడం వల్ల వాహనాల వేగం మందగించి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని అధికారులు గుర్తించారు. ఈ సమస్యకు అడ్డుకట్ట వేసేందుకు సైబరాబాద్ పరిధిలోని పలు కీలక కూడళ్లలో అత్యాధునిక స్కైవాక్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

అమర వీరులను అవమానించిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు 'ఓట్ బచావో - దేశ్ బచావో' నినాదంతో ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి కాంగ్రెస్ పార్టీ మండల, బ్లాక్ అధ్యక్షులు, మార్కెట్ చైర్మన్లు, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లు సహా ముఖ్య నాయకులందరూ ఢిల్లీకి తరలివెళ్లారని చెప్పారు.జాతీయ జనగణనలో వెంటనే బీసీ కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు. మియాపూర్‌లోని ప్రభుత్వ భూముల పరిరక్షణ చారిత్రక విజయమని, ప్రభుత్వ న్యాయపోరాటం ఫలించి వేలాది కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి మందు చూపు తప్ప ముందు చూపు లేదు

చెబుతున్నారని మండిపడ్డారు. సంగారెడ్డి చుట్టూ ఉన్న ప్రభుత్వ పరిశ్రమలకు 50 శాతం మాత్రమే నీళ్లు ఇవ్వాలని చెప్పిన ప్రభుత్వం, బీరు కంపెనీలకు మాత్రం వంద శాతం నీళ్లు ఇస్తున్నారని విమర్శించారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వానికి మందు చూపు తప్ప.. ముందు చూపు లేదంటూ వ్యాఖ్యానించారు. మందు కావలి కానీ.. జిల్లా ప్రజలకు నీళ్లు ఇవ్వడానికి మాత్రం ముందు చూపు లేదంటూ ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అఖిలపక్షం తీసుకున్న నిర్ణయాలకు తాము కూడా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర పెద్దలు వస్తే... కేంద్రం పది రూపాయలు ఇచ్చేలా ఉంటే.. 15 రూపాయలు ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ కూడా ఆరోపణలు, విమర్శలు తప్ప ఇద్దరూ గ్రౌండ్‌లో పని చేయడం లేదని విమర్శించారు. మల్లన్నసాగర్‌లో నీళ్లు లేవని ప్రభుత్వమే చెబుతోందని.. మరి 20 టీఎంసీలు ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించారు. 'కాంగ్రెస్‌కు ముందు చూపు లేదు, ఆలోచన లేదు.. చెప్పిన మాటలు ఆచరించే నైజం లేదు. కాళేశ్వరం ఉందా లేదా.? రిపేర్ చేస్తారా లేదా..? కాళేశ్వరం పనికి వస్తదా లేదా.. అనేది ఈ రోజు వరకు కాంగ్రెస్ చెప్పలేదు. మొత్తం ప్రాజెక్ట్‌పై విచారణ చేయాలని మేము అడుగుతున్నాం.. కానీ మూడు బ్యారేజ్‌ల గురించే కాంగ్రెస్ మాట్లాడుతుంది. కాంగ్రెస్ ఎలాంటి భరోసా ఇవ్వదు. కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో సున్నా సీట్లని ఆ పార్టీకి మనమే భరోసా ఇవ్వాలి. సర్‌పై కాంగ్రెస్ ఆందోళనలు రాజకీయంగా చేస్తున్న క్రీనిడలు తప్ప మరోటి కాదు. రాజ్యాంగ వ్యవస్థల్ని విచ్ఛిన్నం చేయాలనే దుర్మార్గ ఆలోచన తప్ప మరోటి కాదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకరికొకరు కలిసి పని చేస్తున్నాయని... బీజేపీ ప్రజలతో కలిసి పని చేస్తుంది' అంటూ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

ఎన్డీఏ కూటమిలోనే గ్రామాల్లో అభివృద్ధి

ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌లను చూసి.. కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు. అడ్డరోడ్డు నుంచి నర్సీపట్నం రోడ్డును పూర్తి చేశామని తెలిపారు. నియోజకవర్గంలో స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్, టాయ్ పార్క్ లాంటి పరిశ్రమలు వచ్చాయని వివరించారు. టాయ్ పార్క్‌తో 25 వేల మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు రానున్నాయని చెప్పుకొచ్చారు. గోదావరి జలాలు పాయకరావుపేట నియోజకవర్గానికి తీసుకురావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ఎన్నికల్లో అభివృద్ధి చేసే వారికి పట్టం కట్టాలని హోం మంత్రి అనిత కోరారు.

అతిగా ఫోన్ మాట్లాడుతోందని బిడ్డను గొంతుపిసికి చంపిన తల్లి

షాద్‌నగర్ : బిడ్డ అతిగా ఫోన్ మాట్లాడుతోందని, తాను చెప్పిన మాట వినడం లేదని ఓ తల్లి ఆమెను దారుణంగా గొంతుపిసికి చంపేసింది. ఈ ఘటన షాద్‌నగర్ ఏరియాలోగల కొత్తూరు మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. షాద్‌నగర్ డీసీపీ శిరీష వెల్లడించిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని హనుమాన్ కాలనీలో నివాసం ఉండే ఆటోడ్రైవర్ ముయ్యడి రాజు, విజయలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె సువర్చల (14) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ముయ్యడి రాజు భార్య కల్లుకు బానిసైంది. ఈ క్రమంలో కల్లు తాగవద్దన్న కుమార్తె సువర్చలతో నిత్యం గొడవ పడేది. ఈ నెల 27న సాయంత్రం మరోమారు వీరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహంతో ఊగిపోయిన తల్లి కుమార్తెను గొంతుపిసికి చంపేసింది. అనంతరం ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు బాలిక మెడకు చీర చుట్టింది. తర్వాత భర్తకు ఫోన్ చేసి రప్పించింది. బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇటీవలే బాలిక పుష్పవతి కావడంతో కడుపునొప్పి భరించలేక బలవన్మరణానికి పాల్పడి ఉంటుందని తండ్రి రాజు భావించాడు. అయితే రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులకు బాలిక కడుపునొప్పితో కాదు, ఊపిరాడక చనిపోయిందని పోస్టుమార్టం రిపోర్టులో తెలిసింది. దాంతో వారు తల్లిని అనుమానించి తమదైన శైలిలో ప్రశ్నించారు. దాంతో నిందితురాలు నేరం అంగీకరించింది. ఫోన్ అతిగా మాట్లాడుతోందని, చెప్పిన మాట వినట్లేదని, అందుకే చంపేశానని చెప్పింది

భారంగా ఇళ్ల నిర్మాణం

హైదరాబాద్, అక్టోబరు 30 : దేశీయ రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రస్తుతం ధరల మంట తీవ్రంగా వేధిస్తోంది. నిర్మాణ రంగానికి అత్యంత కీలకమైన సిమెంట్, ఇనుము , ఇటుకలు, కంకర , ఇతర ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం కొత్త ప్రాజెక్టుల నిర్మాణ వ్యయాన్ని ఆకాశానికి ఎత్తేసింది. దీనికి తోడు రవాణా ఖర్చులు, నిపుణులైన కార్మికుల వేతనాలు పెరగడంతో ప్రాజెక్ట్ వ్యయాలు అంచనాలను మించిపోతున్నాయని రియల్ ఎస్టేట్ డెవలపర్లు , బిల్డర్ల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొంతకాలంగా అంతర్జాతీయ పరిణామాలు, ఇంధన ధరల పెరుగుదల ప్రభావంతో స్టీల్ మరియు సిమెంట్ ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. ప్రాజెక్ట్ ప్రారంభంలో అనుకున్న అంచనా వ్యయానికి , ప్రాజెక్ట్ పూర్తయ్యే సమయానికి అవుతున్న వాస్తవ వ్యయానికి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని డెవలపర్లు వాపోతున్నారు. లాభాల మార్జిన్లు దారుణంగా పడిపోవడమే కాకుండా, ఇప్పటికే ప్రారంభించిన ప్రాజెక్టులను అనుకున్న సమయానికి పూర్తి చేయడం బిల్డర్లకు పెద్ద సవాలుగా మారింది.పెరిగిన నిర్మాణ వ్యయాల భారాన్ని మోయలేక డెవలపర్లు అనివార్యంగా ఆ అదనపు భారాన్ని చదరపు అడుగు రేట్ల రూపంలో గృహ కొనుగోలుదారులపైనే వేయాల్సి వస్తోంది. దీనివల్ల హైదరాబాద్ వంటి మహానగరాల్లో సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఇళ్ల ధరలు మరింత దూరమవుతున్నాయి. ఇప్పటికే రూ. 50 లక్షల లోపు లభించే అందుబాటు ధరల ఇళ్ల ప్రాజెక్టులు తగ్గిపోయి, సగటు ప్లాట్ , ఫ్లాట్ ధర రూ. 1 కోటికి పైగా చేరుకోవడానికి ఈ నిర్మాణ వ్యయాల పెరుగుదలే ప్రధాన కారణం.ఈ సంక్షోభం నుంచి నిర్మాణ రంగాన్ని గట్టెక్కించేందుకు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని నరెడ్కో , క్రెడాయ్ వంటి రియల్టర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నిర్మాణ సామాగ్రిపై విధిస్తున్న జీఎస్టీ శ్లాబులను తగ్గించాలని, సిమెంట్ మరియు స్టీల్ ధరల కృత్రిమ పెంపుదలను అరికట్టేందుకు ఒక నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం తగ్గితేనే గృహ కొనుగోలుదారులకు ఉపశమనం లభించడంతో పాటు రియల్ ఎస్టేట్ మార్కెట్ స్థిరమైన వృద్ధి సాధిస్తుందని బిల్డర్లు పేర్కొంటున్నారు.

రైతును రారాజు చేయడమే మోదీ లక్ష్యం

కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్ : దేశానికి జై జవాన్, జై కిసాన్ రెండు కళ్లు. మోదీకి సైనికులు, రైతులంటే పిచ్చి ఇష్టం. 2014తో పోలిస్తే వ్యవసాయ బడ్జెట్ 5 రెట్లు పెంపు. రైతును రారాజు చేయడమే మోదీ లక్ష్యమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం నాడు అయన రాజేంద్రనగర్ లో ఐఐపిఆర్ ఆవరణలో జరిగిన పిఎం కిసాన్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్రమంత్రి మాట్లాడుతూ అందులో భాగంగానే రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని జమ చేస్తున్నాం. ఇప్పటి వరకు 23 విడతలుగా రూ. 4 లక్షల 47 వేల కోట్లు జమ చేశాం. శుక్రవారం 9.34 కోట్ల మంది రైతుల ఖాతాల్లో మరో రూ.18,690 కోట్లు జమ చేస్తున్నాం. తెలంగాణలో 30 లక్షల మందికిపైగా రైతులకు లబ్ది చేకూరుస్తున్నాం. కిసాన్ సమ్మాన్ నిధి సొమ్మును 92 శాతం మంది రైతులు వ్యవసాయానికే ఖర్చు చేస్తున్నారు. దీనివల్ల 85 శాతం మంది రైతుల ఆదాయం పెరిగింది. రైతు ఏడాది ఆదాయం ఐటీ ఎంప్లాయి నెల జీతంకంటే తక్కువే. రైతుల అభివృద్ధి కోసం మోదీ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తంది. ఎరువుల సబ్సిడీ కోసమే 12 లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నం. మోదీ ఇచ్చే సబ్సిడీతో రైతులకు ఎకరాకు 18 వేలు ఆదా అవుతోంది. తెలంగాణలోనూ దాదాపు 40 లక్షల మందికి కిసాన్ క్రెడిట్ కార్డులిచ్చినం. 50 వేల కోట్ల రుణాలు అందించినం. 1 కోటి 10 లక్షల సాయిల్ హెల్త్ కార్డులు అందించినం. కాంగ్రెస్ పాలనలో తిండి గింజలు లేక ఇతర దేశాల నుండి బియ్యం గింజలను దిగుమతి చేసుకునే దుస్థితని అన్నారు. మోదీ నిరంతర క్రుషి, శాస్త్రవేత్తల నిరంతర పరిశోధనలవల్లే వరి ఎగుమతుల్లో ఇండియా ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రైతులకు తల్లి మోదీ..తండ్రి ఐకార్-ఐఐఆర్ఆర్ వంటి వ్యవసాయ శాస్త్రవేత్తలు. హైదరాబాద్ అంటే ఐటీయే కాదు, ఐకార్-ఐఐఆర్ఆర్ ఐకాన్ గా మారింది. ఎల్ నినో తో దేశవ్యాప్తంగా కరువొచ్చింది. తెలంగాణలో 11 లక్షల ఎకరాల్లో పంట వేయలేదు. ఈ సీజన్ లో దాదాపు 20 వేల కోట్ల రూపాయల పంట నష్టం వాటిల్లిందని అంచనా. రాష్ట్రంలో ఇంకా చాలా మండలాలను కరువు జాబితాలో చేర్చాలని అన్నారు.

భూసారాన్ని కాపాడితేనే భవిష్యత్ ..వ్యవసాయానికి భరోసా

మాగనూరు : సాగు భూముల సారవంతాన్ని కాపాడుతూ, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన నేలను అందించాలనే లక్ష్యంతో ఖేత్ బచావో అభియాన్ ను నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్ తెలిపారు. నేరడగం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో భూసార పరిరక్షణ, సేంద్రియ ఎరువుల వినియోగం, పంటల మార్పిడి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూముల సారవంతాన్ని కాపాడుకోవడం ప్రతి రైతు బాధ్యత అని అన్నారు. అధిక రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పశువుల ఎరువు, కంపోస్టు, పచ్చిరొట్ట ఎరువులను వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుచు కోవచ్చని సూచించారు. నేలలో సేంద్రియ కర్బనం పెరగడం వల్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగి, పంటలకు మేలు చేసే సూక్ష్మజీవుల అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. వరి కోత అనంతరం మిగిలిన పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని ఉపయోగకర మైన సూక్ష్మజీవులు నశించడంతో పాటు, నేలలోని పోషకాలు తగ్గి పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం లేదా కంపోస్టుగా తయారు చేసి వినియోగించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు పంటల మార్పిడిని పాటించాలని, వరి తర్వాత శనగ, పెసర, మినుము వంటి పప్పుధాన్యాల పంటలను సాగు చేయడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడంతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు.

అమిత్ షా టూర్ వెనుక భారీ వ్యూహం



హైదరాబాద్, అక్టోబరు 20 : తెలంగాణ రాజకీయ రంగంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ అంశం కాంగ్రెస్, బీజేపీల మధ్య రగులుతోంది. ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదాన్‌లో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీ నినాదంతో నిర్వహించనున్న భారీ ర్యాలీకి సవాల్ విసురుతూ.. మరుసటి రోజే నవంబర్ 2న భాగ్యనగరంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రత్యక్షంగా పాల్గొనేలా లోక్‌తంత్ర బచావో – అరాజకతా హటావో పాదయాత్రను బీజేపీ ఖరారు చేసింది. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియను రాజకీయం చేస్తూ, కాంగ్రెస్ ఆడుతున్న నాటకాలను తిప్పికొట్టడమే లక్ష్యంగా చాణక్యుడు స్వయంగా రంగంలోకి దిగుతుండటంతో జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిలు ఈసీ ప్రక్రియపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారనేది బీజేపీ ప్రధాన ఆరోపణ. మరణించినవారు , శాశ్వతంగా చిరునామాలు మారినవారు ,అడ్రస్‌లో లేనివారు, రెండు చోట్ల నమోదు చేసుకున్న డూప్లికేట్ ఓట్లను సాంకేతిక ఆధారాలతో ఈసీ తొలగిస్తుంటే, దానిని ఓట్ల చోరీ అని కాంగ్రెస్ ప్రచారం చేస్తోందని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. చట్టబద్ధమైన సవరణ ప్రక్రియను అరాచకత్వంగా మార్చాలని చూస్తున్న కాంగ్రెస్ వైఖరిని ప్రజల వద్దకే వెళ్లి ఎండగట్టడమే ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశం.ఈ పరిణామం వెనుక బీజేపీ జాతీయ నాయకత్వం సుదీర్ఘ రాజకీయ వ్యూహం దాగి ఉందనేది స్పష్టమవుతోంది. ముఖ్యంగా తెలంగాణను రాబోయే రోజుల్లో కైవసం చేసుకోవాలనే దృఢ సంకల్పంతో ఉన్న అమిత్ షా, ఈ ఓటర్ల జాబితా రచ్చ ను కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పొలిటికల్ అస్త్రంగా మలుచుకోవాలని చూస్తున్నారు. రాహుల్ గాంధీ డిఫెన్స్ లోకి నెట్టిన ప్రతిసారీ ప్రత్యక్షంగా తానే వేదికపైకి వచ్చి కౌంటర్ ఇవ్వడం అమిత్ షా శైలి. హైదరాబాద్ ట్యాంక్ బండ్ పరిసరాల్లో వేలాదిమంది శ్రేణులతో సాగనున్న ఈ పాదయాత్ర ద్వారా సౌత్ ఇండియాలో కాంగ్రెస్ నరేటివ్‌ను పూర్తిగా పటాపంచలు చేయాలని భావిస్తున్నారు.రాష్ట్రంలో నెలకొన్న కరువు, తాగునీటి ఎద్దడి వంటి ప్రజా సమస్యలను పక్కనబెట్టి సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు 'ఢిల్లీ ర్యాలీ' కోసం గాల్లో విహరిస్తున్నారని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నిజమైన ఓటర్ల పేర్లు ఎక్కడైనా తొలగించి ఉంటే ఆధారాలతో చూపించాలని, సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లికి రావడానికైనా తాము సిద్ధమని సవాల్ విసిరారు. ఓటర్లకు ఉన్న ఫారమ్-6 హక్కును వివరించకుండా, ఓట్ల పేరుతో కాంగ్రెస్ కేవలం రాబోయే స్థానిక ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తోందని ధ్వజమెత్తారు. మరోవైపు, బిఆర్ఎస్ స్థానంలో కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా తమను తాము నిలబెట్టుకోవడానికి బీజేపీకి ఇది ఒక సువర్ణావకాశంగా మారింది. తెలంగాణలో అధికారం చేజిక్కించుకోవాలంటే కేవలం అసెంబ్లీ స్థానాలే కాకుండా, హైదరాబాద్, రంగారెడ్డి లాంటి అర్బన్ సెంటిమెంట్‌ను తమవైపు తిప్పుకోవడం అత్యంత కీలకం. అందుకే అమిత్ షా నేరుగా వీధుల్లోకి వచ్చి పాదయాత్ర చేయడం ద్వారా కమలం క్యాడర్‌లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు, తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్ష పాత్రను రీ-ఛార్జ్ చేయబోతున్నారు. ఢిల్లీలో రామ్‌లీలా మైదాన్ ర్యాలీతో కాంగ్రెస్ వేసిన ఎత్తుకు, మరుసటి రోజే హైదరాబాద్ పాదయాత్రతో అమిత్ షా వేస్తున్న పైఎత్తు దేశ రాజకీయాల్లో ప్రధాన ఆకర్షణగా మారింది. ఎన్నికల సమయానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ, ఈ ఓటర్ల జాబితా సమరం ద్వారా కాంగ్రెస్-బీజేపీలు తెలంగాణ నేతలను జాతీయ స్థాయి రాజకీయ కురుక్షేత్రంగా మార్చేశాయనడంలో ఎలాంటి సందేహం లేదు.కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నవంబర్ 2న తెలంగాణలో పర్యటనతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ పర్యటనను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకత్వం, భారీ ఎత్తున జన సమీకరణ చేసేందుకు సమాయత్తమవుతోంది.అమిత్ షా పర్యటన, పాదయాత్ర ఏర్పాట్లపై బీజేపీ ముషీరాబాద్ సీనియర్ నాయకులు రామచందర్ రావు, బీజేపీ సహ ఇంచార్జి అభయ్ పాటిల్, పార్టీ ప్రధాన కార్యదర్శులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కార్యక్రమాన్ని ప్రజాక్షేత్రంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు.ఈ పర్యటనలో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం.. అరాచకత్వంను అంతంచేద్దాం' అనే ప్రధాన నినాదంతో బీజేపీ భారీ పాదయాత్రను చేపట్టనుంది. కేవలం ఏదో ఒక గ్రౌండ్ లో లేదా వేదికలకే పరిమితం కాకుండా, నేరుగా ప్రజల మధ్య నుంచే పాదయాత్ర సాగాలని కేంద్ర బీజేపీ అగ్ర నాయకత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర నాయకత్వం ఆదేశాలతో బీజేపీ నేతలు నాంపల్లిలోని చారిత్రాత్మక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, మొజంజాహీ మార్కెట్ పరిసర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. పాదయాత్ర రూట్ మ్యాప్, రద్దీ నియంత్రణ, వేదిక ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు.తెలంగాణలో రాబోయే ఎన్నికలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా అమిత్ షా పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. అధికార పార్టీ వైఫల్యాలను, పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ యాత్ర ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది. కేంద్ర మంత్రి అమిత్ షా స్వయంగా ర్యాలీ చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీజేపీ శ్రేణులు, కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలో తమ బలాన్ని మరోసారి నిరూపించుకోవాలని బీజేపీ నాయకులు యోచిస్తున్నారు.

భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

భద్రాద్రి కొత్తగూడెం. అక్టోబర్ 30 : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనుల పురోగతి, వివిధ శాఖల అనుమతులు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించేందుకు ప్రత్యేక అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతిని నియమిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను వేగవంతం చేయాలని, అవసరమైన ప్రతిపాదనలు, అనుమతులను సంబంధిత శాఖల నుంచి త్వరితగతిన పొందాలని ఆదేశించారు. ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చేపట్టిన పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, నిధులు, అనుమతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.పుష్కరాల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికలు: గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలంలోని పుష్కర ఘాట్ల అభివృద్ధి, విస్తరణతో పాటు భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలపై సమీక్షించారు. పుష్కరాల సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున స్నానపు ప్రదేశాలు, రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రత, తాగునీరు, పారిశు ద్ధ్యం, విద్యుత్ వంటి సదుపాయాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఘాట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పనులను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రామాలయం నుంచి పుష్కర ఘాట్‌కు వెళ్లే మార్గంలో ఉన్న 47 ఇళ్ల తొలగింపునకు సంబంధించిన అంశాన్ని సమీక్షిస్తూ, ఆయా నిర్మాణాల వివరాలు, విలువ అంచనాలు, నిర్వాసితులకు కల్పించాల్సిన పునరావాసం, పరిహారం (ఆర్ అండ్ ఆర్)పై చర్చించారు. బాధితులకు నిబంధనల ప్రకారం పునరావాసం, పరిహారం అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం: భద్రాచలం బ్రిడ్జి నుండి పుష్కర ఘాట్ లకు రహదారి విస్తరణకు అవసరమైన భూమి, నిర్మాణాలు, భూసేకరణ అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. పుష్కర ఘాట్‌కు అనుసంధానంగా నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులు, యాత్రికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. భద్రాచలంలో వీఐపీ, వీవీఐపీ అతిథి గృహాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని సూచించారు. అన్ని వసతులతో ఆరు సూట్లతో కూడిన అతిథి గృహ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించి తగిన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని తెలిపారు. అవసరమైన భూసేకరణ ప్రక్రియను ప్రారంభించి, సంబంధిత శాఖల అనుమతులతో ప్రతిపాదనలను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.సమన్వయంతో గడువులోగా పనులు పూర్తి: గోదావరి పుష్కరాల నాటికి ఆలయం, ఘాట్లు, పట్టణ పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేలా శాఖల వారీగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, అధికారులకు అప్పగించిన బాధ్యతలు, పనుల పురోగతికి సంబంధించిన మినిట్స్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని, తదుపరి సమీక్షలో వాటి ఆధారంగా పురోగతిని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూష, భద్రాచలం దేవస్థానం ఈఓ దామోదర్ రావు, ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, భద్రాచలం తహసీల్దార్ రామ్ కుమార్, దుమ్ముగూడెం తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యం:

మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ హైదరాబాద్‌లో నిరసన చేపట్టే ముందు అమిత్ షా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలిప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై పోరాటం తప్పదు. జాతీయ జనగణనలో వెంటనే బీసీ కులగణనను చేర్చాలిప్రభుత్వ భూముల పరిరక్షణ చారిత్రాత్మక విజయంతెలంగాణ ప్రభుత్వ న్యాయ పోరాటం ఫలించి వేలాది కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా దక్కడంపై ముఖ్యమంత్రి కి, న్యాయ వ్యవస్థకు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలంగాణ ప్రజల పక్షాన అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.గాంధీ భవన్ లో మీడియా తో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఓట్ బచావో- దేశ్ బచావో' నినాదంతో ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నుంచి మండల, బ్లాక్ అధ్యక్షులు, మార్కెట్ చైర్మన్లు, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లు సహా ముఖ్య నాయకులందరూ ఢిల్లీకి తరలివెళ్లారన్నారు.కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపై స్పందిస్తూ దేశ హోంమంత్రిగా హైదరాబాద్‌కు ఎవరైనా రావచ్చు, అనుమతులు ఇస్తామని, కానీ రాజకీయంగా కొన్ని సూటి ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు పట్ల, తెలంగాణ అమరవీరుల త్యాగాల పట్ల గతంలో పార్లమెంటు సాక్షిగా అవమానకరంగా మాట్లాడినందుకు అమిత్ షా, ప్రధాని మోదీలు తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని అన్నారు. ఓట్ చోర్-గద్దీ చోడ్ అంటూ ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అవసరం దేశవ్యాప్తంగా ఉందని చెప్పారు.

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం?

నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క?

హైదరాబాద్ : నగరాన్ని ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు, తెలంగాణను దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నగరాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల పాత్ర అత్యంత కీలకమని, ఈ రంగంలో ఉన్నవారిని కేవలం వ్యాపారవేత్తలుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా ప్రభుత్వం గుర్తిస్తోందని అన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌కు దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అనేక అనుకూలతలు ఉన్నాయని, మోస్ట్ లివబుల్ సిటీగా గుర్తింపు పొందిన ఈ నగరంలో స్థిరపడేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు కల్పించిన మౌలిక సదుపాయాలను మరింత విస్తరిస్తూ ప్రస్తుత ప్రభుత్వం నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఈసీఐఎల్, డీఆర్‌డీఓ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ఐఐటీ, ఐఐఐటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు నగర అభివృద్ధికి బలమైన పునాదులుగా నిలిచాయని పేర్కొన్నారు ?రూ.84,790 కోట్లతో నగరాభివృద్ధికి బృహత్తర ప్రణాళిక ?హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.84,790 కోట్లతో భారీ కార్యాచరణను రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో ఇప్పటికే సుమారు రూ.55 వేల కోట్ల పనులకు సంబంధించి డిజైన్లు, టెండర్ల ప్రక్రియ చేపట్టడంతో పాటు పలు పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. రానున్న రోజుల్లో నగరంలోని ప్రతి ప్రాంతంలో అభివృద్ధి పనులు, నిర్మాణ కార్యక్రమాలు కనిపిస్తాయని చెప్పారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, మెట్రో రైలు తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.52,706 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు రూ.15,849 కోట్లు కేటాయించి పనులు ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.4 వేల కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,500 కోట్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,163 కోట్లు, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రహదారుల అభివృద్ధికి రూ.500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. పునరుజ్జీవనంతో నగరానికి కొత్త ఆభరణం ?మూసీ నదిని మురికి కూపం నుంచి స్వచ్ఛమైన జలాలతో ప్రవహించే నదిగా మార్చి హైదరాబాద్‌కు గొప్ప ఆస్తిగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలు తమ మధ్యలో ప్రవహించే నదులను శుద్ధి చేసి పర్యాటక, ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసుకున్నాయని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో మూసీ పునరుజ్జీవన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా తొలి దశలో సుమారు రూ.7,500 కోట్ల పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని చెప్పారు. మూసీలోకి మురుగునీరు చేరకుండా నగరంలోని 21 ప్రధాన నాలాల వద్ద ఒకేసారి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి, టెండర్ల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎస్టీపీల సంఖ్యను 38కు పెంచే ఆలోచన ఉందన్నారు. శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక అవసరాలు, ఉద్యానవనాల నిర్వహణకు వినియోగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. మూసీ నది భవిష్యత్తులో హైదరాబాద్‌కు అతిపెద్ద ఆభరణంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీతో అభివృద్ధికి నూతన దిశ సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఇందులో 15 వేల ఎకరాలను పచ్చదనం, విశాలమైన బహిరంగ ప్రదేశాల కోసం కేటాయించడం విశేషమన్నారు. మొత్తం భూభాగంలో 50 శాతం గ్రీన్ స్పేస్‌గా ఉంచుతూ నగర నిర్మాణం చేపట్టడం దేశంలోనే ప్రత్యేకతగా నిలుస్తుందని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా భారత్ ఫ్యూచర్ సిటీ మరో కీలక అభివృద్ధి కేంద్రంగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ట్రిపుల్ ఆర్, మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు హైదరాబాద్ భవిష్యత్తును మార్చనున్నాయని తెలిపారు. నగరాభివృద్ధికి అవసరమైన నీటి వనరుల విషయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కృష్ణా, గోదావరి జలాలను నగరానికి తీసుకువచ్చే ప్రణాళికలు హైదరాబాద్ విస్తరణకు దోహదపడ్డాయని గుర్తుచేశారు. కాలుష్య నియంత్రణకు హిల్ట్ పాలసీ హైదరాబాద్‌ను స్వచ్ఛమైన, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు హిల్ట్ పాలసీని తీసుకొచ్చినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పరిశ్రమలను దశలవారీగా బయటకు తరలించడం ద్వారా నగరంలో కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రజా రవాణాలో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడంతో పాటు, ఆటోలను కూడా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు సబ్సిడీతో కూడిన సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక రవాణా వ్యవస్థల సమన్వయంతో హైదరాబాద్‌ను మరింత నివాసయోగ్యమైన నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు.?

తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్ : డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ 50 ఏళ్ల సేవా ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన స్వర్ణోత్సవ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కమల్లు అతిథిగా పాల్గొన్నారు. భట్టి మాట్లాడుతూ 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోంది. ఆర్థిక వృద్ధి కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, ప్రతి కుటుంబం జీవితంలో సానుకూల మార్పు తీసుకురావాలి. సంక్షేమం, ఆర్థిక క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణలతోనే సుస్థిర ప్రగతి సాధ్యం. హైదరాబాద్లోని ఆర్థిక, సాంకేతిక ప్రగతిని రాష్ట్రంలోని పల్లెలకు, పట్టణాలకు విస్తరించి, యువతకు వారి సొంత జిల్లాల్లోనే ఉపాధి కల్పించడమే మా ధ్యేయం.

సంపాదకీయం

రాజకీయ మనుగడగా నిత్యావసరాలు

రాజకీయాల్లో ప్రభుత్వాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి రగిలేందుకు పెద్ద పెద్ద సమస్యలో లేదా సిద్ధాంతపరమైన విభేదాలో అవసరం లేదు. సగటు సామాన్యుడి రోజువారీ కిచెన్ బడ్జెట్ తలకిందులైతే చాలు! కడుపు నిండా తినే కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటినప్పుడు, ప్రజల్లో వ్యక్తమయ్యే ఆగ్రహం నేరుగా పాలకపక్షాల గ్రాఫ్‌ను వేగంగా పడదోస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపిన ఎల్ నినో తీవ్రత వల్ల ఏర్పడిన అకాల వర్షాలు, పండగల రద్దీ, వాతావరణ మార్పుల ధాటికి ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోనూ నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ధరల మంట ప్రజావ్యతిరేకతగా మారకముందే అదుపుచేసేందుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు రూ.కోట్ల ఆర్థిక భారాన్ని మోసేందుకు సిద్ధపడుతుండటం ఆసక్తికరమైన రాజకీయ సమీకరణగా మారింది.ఏపీలో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, పెరుగుతున్న ధరల నుంచి సామాన్యుడిని కాపాడేందుకు ప్రత్యేక కౌంటర్లు, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో రంగంలోకి దించింది. నెలకు సుమారు రూ. 100 కోట్ల వరకు అదనపు భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ, బహిరంగ మార్కెట్ ధరల కంటే చాలా తక్కువకే నిత్యావసరాలను అందుబాటులోకి తెస్తోంది. రూ.100కే కిలో కందిపప్పు, రూ.125కే లీటర్ పామాయిల్, రూ.25కే గోధుమపిండి అందించడంతో పాటు, ధరణి బ్రాండ్ బియ్యాన్ని ప్రత్యేక వాహనాల ద్వారా అందుబాటులోకి తెస్తూ మార్కెట్ ధరలపై ఒత్తిడి పెంచి అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది.మరోవైపు తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల అసంతృప్తిని చల్లబరిచేందుకు ఏకంగా రేషన్ కార్డుదారులకు ప్రత్యేక నిత్యావసరాల కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టే దిశగా అడుగులు వేస్తోంది. కేవలం బియ్యం మాత్రమే కాకుండా, పప్పు దినుసులు, వంటనూనెలు, గోధుమపిండి, చక్కెర వంటి 6 రకాల నిత్యావసరాలతో కూడిన సబ్సిడీ కిట్లను అందించడం ద్వారా పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు పౌరసరఫరాల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. బహిరంగ మార్కెట్లో ధరలను విచ్చలవిడిగా పెంచే వ్యాపారుల నిర్బంధ తనిఖీలతో పాటు, ప్రభుత్వం నేరుగా ఈ సబ్సిడీ కిట్లను ఇవ్వడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజల్లో సానుకూలత తెచ్చుకోవాలని భావిస్తోంది.ఆర్థికంగా తీవ్ర లోటు, రుణభారంతో సతమతమవుతున్నప్పటికీ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్ణకై ఇంత భారీగా నిధులు వెచ్చించడానికి ప్రధాన కారణం ఓటు బ్యాంకు ముప్పు! ఉచిత పథకాలు ఎంత అందజేసినా, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరిగితే సామాన్యుడి పాకెట్ మనీ ఖాళీ అయిపోతుంది. దీనివల్ల ప్రభుత్వాల సంక్షేమ పథకాల ఇంపాక్ట్ సున్నాగా మారి, హామీలు ఇచ్చారు కానీ పొట్ట నింపడం లేదు అనే నిరసన స్వరం గ్రామాల్లో బలంగా వినిపించే ప్రమాదం ఉందనేది పొలిటికల్ సర్వేల హెచ్చరిక. ఈ నిత్యావసరాల ధరల నియంత్రణ అంశం రెండు ప్రభుత్వాలకు సంజీవనిలా మారనుంది. బహిరంగ మార్కెట్ ధరలపై నిరంతరం నిఘా ఉంచడం, లభ్యత కొరత రాకుండా ముందస్తుగా దిగుమతులు చేసుకోవడం ద్వారా ప్రజాసంతోషాన్ని కాపాడుకోవడమే ఏపీ, తెలంగాణ సీఎంల ప్రధాన అజెండా.జాతీయ, అంతర్జాతీయ వాతావరణ మార్పుల వల్ల ఏర్పడిన నిత్యావసరాల కొరతను కేవలం పరిపాలనా సమస్య గా చూడకుండా, 'రాజకీయ మనుగడ' సమస్యగా భావించి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు భారాన్ని తమ భుజాన వేసుకోవడం రాజకీయంగా అత్యంత వ్యూహాత్మకమైన అడుగుగా భావించవచ్చు. ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక సబ్సిడీ ప్రణాళిక ప్రకారం.. మార్కెట్‌లో కిలో రూ.160 నుంచి రూ. 180 వరకు పలుకుతున్న కందిపప్పును కేవలం రూ. 100 కే అందించనున్నారు. అలాగే లీటరు పామాయిల్‌ను రూ. 125 కే, గోధుమపిండిని కిలో రూ. 25 కే పంపిణీ చేయనున్నారు. వీటితో పాటు క్వాలిటీ బియ్యాన్ని తక్కువ ధరలకే అందించేందుకు ప్రత్యేక మొబైల్ వాహనాలు, రైతు బజార్లను విస్తృతంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌లో రేట్ల కృత్రిమ కొరతను అరికట్టేందుకు, ఉల్లిపాయల నిల్వలను కూడా నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ , రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకు ఈ సరుకులను పంపిణీ చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై నెలకు దాదాపు రూ. 100 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఎల్ నినో వల్ల పెరిగిన ధరల నుంచి సామాన్యులకు ఊరట కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల కడుపు నింపే విషయంలో సంక్షేమానికి వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు.దీపావళి కానుకగా అందుబాటులోకి రానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలో కోట్లాది మంది కార్డుదారులు , సామాన్య ప్రజలు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఒకవైపు పండుగ సీజన్,మరోవైపు ఎల్ నినో ప్రభావంతో కూరగాయలు, దినుసుల ధరలు మండిపోతున్న తరుణంలో చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం మధ్యతరగతి గృహిణులకు ఎనలేని ఊరటనిస్తోంది. ప్రభుత్వం సకాలంలో స్పందించి చౌక ధరల సరుకులను రేషన్ డిపోల వేదికగా అందుబాటులోకి తేవడంపై పబ్లిక్ సర్కిల్స్‌లో హర్షం వ్యక్తమవుతోంది.

నెతన్యాహు నెగ్గితే భద్రత ఎవరికి?

అక్టోబర్ 27న ఇజ్రాయెల్‌లో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రధాన కేంద్ర బిందువుగా మారారు. ఇజ్రాయెల్ ఏర్పడిన 78 సంవత్సరాల చరిత్రలో దాదాపు రెండు దశాబ్దాల పాటు అధికారంలో కొనసాగిన నెతన్యాహుకు ఈ ఎన్నికలు అతిపెద్ద పరీక్షగా నిలిచాయి. 2021లో అధికారం కోల్పోయినప్పటికీ, 2022లో విజయం సాధించి తీవ్ర భావజాలం వైపు మొగ్గు చూపారు. అల్ట్రా ఆర్థడాక్స్ పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిర్ణయాలపై సుప్రీంకోర్టు నియంత్రణ తగ్గించగలిగారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేయగా, గాజాలో నెతన్యాహు నాయకత్వంలో భీకర సమరం సాగింది. ఇదో మారణహోమం అన్న తీవ్ర విమర్శలు వచ్చాయి. మరోవైపు ప్రతిపక్ష పార్టీలు అక్టోబర్ 7న హమాస్ దాడి ఇజ్రాయెల్ భద్రతా వైఫల్యమేనని, దీనికి నెతన్యాహును బాధ్యుడిగా నిలబెడతామని, నిరంతరం సాగుతున్న యుద్ధాలకు ముగింపు పలుకుతామని వెల్లడించాయి. ఈ ఎన్నికలు నెతన్యాహును అధికారం లోంచి తొలగించడానికి విపక్షాలకు ఒక అవకాశంగా మారాయి. అయితే ఈ ఎన్నికల ఫలితాలు మిశ్రమ సంకేతాలను అందించాయి. బుధవారం సాయంత్రం పోలైన ఓట్లలో 86 శాతం లెక్కించగా 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్)లో నెతన్యాహు నేతృత్వం లోని లికుడ్ కూటమికి 54 సీట్లు, ప్రత్యర్థి ఐజెన్‌కాట్ నేతృత్వం లోని కూటమికి 47 సీట్లు వచ్చే అవకాశం కనిపించింది. అరబ్ పార్టీలు కూడా 19 సీట్ల వరకు సాధించే అవకాశం ఉంది.ప్రతిపక్ష పార్టీలు అన్నీ కలిపి 67 స్థానాలను సాధించే దిశగా ఉన్నప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అంత సులభం కాదు. ՟ాశ్రీంశీ =ఖుః - ఓటు హక్కుకోసం పోరాటం ఎందుకంటే అరబ్ పార్టీల మద్దతును స్వీకరించడానికి కొన్ని యూదు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించిన కూటమి చర్చలను విశాల దృక్పథంతో, ముందస్తు అభిప్రాయాలు లేకుండా జరపాలని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జాగ్ విజ్ఞప్తి చేసినా రాజకీయ పార్టీల మధ్య నమ్మకం లోపించింది. చివరి ఫలితాల తరువాత సీట్ల పంపకం కొనసాగితే స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకు రానున్న కొన్ని రోజుల వరకు పార్టీల మధ్య తీవ్ర చర్చలు, సంప్రదింపులు, ఒప్పందాల ప్రయత్నాలు జరుగుతాయి. అంతవరకు ప్రస్తుత ప్రధాన మంత్రి నెతన్యాహుయే తాత్కాలిక ప్రధాన మంత్రిగా కొనసాగుతారు. ఈ పరిస్థితి ఆయనకు అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. వాస్తవానికి ఈ ఎన్నికలు ప్రధానంగా నెతన్యాహుపై ప్రజల అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ఒక రిఫరెండమ్ లాంటిది. ఒకప్పుడు ఇజ్రాయెల్‌లో బలమైన వామపక్ష ఉద్యమం ఉండేది. కానీ నేడు అక్కడి రాజకీయాలు ప్రధానంగా మతపరమైన జియోనిజం, దాని వివిధ రూపాల ఆధిపత్యంలో ఉన్నాయి. నెతన్యాహును వ్యతిరేకించే కూటమి కూడా అరబ్ రాజకీయ పార్టీలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయబోమని హామీ ఇవ్వడం గమనార్హం. నెతన్యాహు తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేసే ఓటును ఇజ్రాయెల్ శత్రువులకు మద్దతుగా చిత్రీకరించడం ద్వారా ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పడేశారు. ఇజ్రాయెల్‌ను రక్షించడానికి తన యుద్ధాలు ధైర్యవంతమైన, తప్పనిసరి చర్యలని నెతన్యాహు చెప్పుకొచ్చారు. ఇజ్రాయెల్ భద్రతపై ప్రజల్లో ఉన్న ఆందోళనలను తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారు. ఇజ్రాయెల్ జనాభాలో దాదాపు 20 శాతంగా ఉన్న అరబ్ ప్రజలు అరబ్ రాజకీయ పార్టీల వెనుక ఏకమవ్వడం ఈ విభజనను ప్రతిబింబిస్తోంది. ՟ాశ్రీంశీ =ఖుః - పత్రికా స్వేచ్ఛపై గొడ్డలిపెట్టు ఇజ్రాయెల్ యూదులు, అరబ్ పౌరుల మధ్య రాజకీయ విభేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్‌లో రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్న వాస్తవాన్ని ఈ ఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. బెంజమిన్ నెతన్యాహు అధికారంలో కొనసాగుతున్నంత కాలం ఇరాన్‌పై యుద్ధమే కాదు, ఇజ్రాయెల్‌కే కాకుండా మొత్తం మధ్య ప్రాచ్య ప్రాంతానికే నష్టం కలగక తప్పదు. ట్రంప్ కూడా నెతన్యాహుకు మద్దతు తెలుపుతూ ఇరాన్‌పై మొదలు పెట్టిన సైనిక చర్యను చివరివరకు కొనసాగించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ తన సవాళ్లను అధిగమించి తన రాజకీయ స్థితిని నిలబెట్టుకుంటే పశ్చిమాసియా మరోసారి భగ్గుమనక తప్పదు. అయినాసరే ప్రభుత్వ పాలనలో అరబ్ పార్టీల భాగస్వామ్యాన్ని అన్ని వర్గాలు విస్తృతంగా ఆమోదించినప్పుడే నెతన్యాహు ప్రభుత్వానికి స్వస్తి పలకడం జరుగుతుంది.అరబ్ పార్టీలు కీలకంగా మారితే వాటితో కలిసి పనిచేయడానికి నెతన్యాహు వ్యతిరేక కూటమి అంగీకరిస్తుందా అనేది అసలు ప్రశ్న. ఎన్నికలసమాచారం చూడండి ఈ ఎన్నికల ఫలితాల నుంచి ప్రతిపక్ష పార్టీలు పాఠం నేర్చుకుని అరబ్ పార్టీలతో కలిసి విస్తృత కూటమిని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేసేలా చూడాలి. నెతన్యాహు నియంత్రణ లోని సైనిక చర్యలను తిరిగి పరిశీలించాలి. అలాగే ప్రపంచ దేశాలతో ఇజ్రాయెల్ సంబంధాలను తిరిగి మెరుగపరిచే ప్రయత్నాలు సాగించాలి. ఇదే సమయంలో మధ్యప్రాచ్య ప్రాంతంలో పరిస్థితులు కూడా మారుతున్నాయి. సోమవారం టెహ్రాన్‌లో ఇరాన్ నాయకులు, సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్థాన్ లకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఇజ్రాయెల్, అమెరికా కారణంగా తాము ఎదుర్కొంటున్న సంఘర్షణలకు దౌత్యపరమైన పరిష్కారం కనుగొనాలనే వారి ప్రయత్నం కనిపించింది. తమ మధ్య విభేదాలు ఉన్నప్పటికీ, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. ఈ పరిణామాలు ఇజ్రాయెల్ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో పరిశీలించాల్సిందే.

క్లైమాక్స్‌కు విజయవాడ మేయర్ ఎన్నికల సమరం

విజయవాడ అక్టోబరు 30 : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ వంటి విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ ఎన్నికల సమరం క్లైమాక్స్‌కు చేరుతున్న వేళ, క్షేత్రస్థాయి రాజకీయ సమీకరణాలు స్పష్టమైన ఏకపక్ష తీర్పును సూచిస్తున్నాయి. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా బరిలోకి దిగిన వంగవీటి రాధాకృష్ణ అనూహ్యమైన ప్రజా మద్దతుతో అత్యంత పటిష్టమైన స్థితిలో దూసుకుపోతున్నారు. బెజవాడ ప్రజానీకంలో వంగవీటి కుటుంబానికి ఉన్న భావోద్వేగ అనుబంధం, దివంగత రంగా అభిమానుల అండదండలతో పాటు, కూటమి పార్టీల ఓటు బ్యాంక్ ఏకతాటిపైకి రావడం రాధాకు ఆధిక్యాన్ని తెచ్చిపెడుతోంది. డివిజన్లలో కూటమి ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమా, సుజనా చౌదరి, జనసేన నేతలు సమన్వయంతో సాగిస్తున్న ప్రచారం రాధా విజయాన్ని ముందే ఖరారు చేసినట్లు కనిపిస్తోంది.గత మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.. ఈసారి కనీస పోటీని కూడా ఇవ్వలేక ఘోరమైన ఆత్మరక్షణలో పడిపోయింది. రాధా వంటి మాస్ లీడర్‌ను ఢీకొట్టేందుకు బలమైన సామాజిక, రాజకీయ నేపథ్యం ఉన్న అభ్యర్థిని రంగంలోకి దించడంలో ఆ పార్టీ అధిష్ఠానం విఫలమైంది. ఓటమి ఖాయమని ముందే గ్రహించిన నగరానికి చెందిన ముఖ్య నేతలు, మాజీ మంత్రులు పోటీకి పూర్తిగా ముఖం చాటేశారు. దీంతో అనివార్య పరిస్థితుల్లో మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మికే మళ్లీ టికెట్ కేటాయించాల్సి వచ్చింది. అయితే ఆమె ప్రచారం ఏమాత్రం ఊపు లేకుండా అత్యంత సాదాసీదాగా సాగుతుండటం, గత ఐదేళ్ల పాలనలో కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి, పన్నుల భారం వంటి ప్రజావ్యతిరేక అంశాలు ఆమెకు తీవ్ర ప్రతిబంధకంగా మారాయి.మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్, మల్లాది విష్ణు వంటి కీలక నేతలు ఎవరికి వారే నామమాత్రంగా దర్శనమిచ్చి వెళ్లిపోతుండటం కేడర్‌ను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. నగరంలో ఎక్కడా వైసీపీ ప్రచార హోరు కనిపించకపోవడం, పార్టీ ఇచ్చిన హామీలపై ప్రజల్లో నమ్మకం లేకపోవడంతో కార్పొరేటర్ అభ్యర్థులు సైతం సొంత ఖర్చులతో రిస్క్ తీసుకోలేక చేతులెత్తేస్తున్నారు.

మోడీకి సరే...మిగిలిన ఎన్నికల్లో ఏమౌతోంది

లక్నో, అక్టోబరు 30 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆధ్యాత్మిక రాజధాని వారణాసిలో ఎన్నికల ఫలితాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని మోదీ ఇక్కడి నుంచి లక్షల ఓట్ల ఆధిక్యంతో జయకేతనం ఎగురవేస్తూ వస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయి స్థానిక సంస్థలు, శాసనమండలి ఎన్నికల విషయానికి వచ్చేసరికి బీజేపీ సవాళ్లను ఎదుర్కొంటోంది. తాజాగా జరిగిన యూపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారణాసి ఉపాధ్యాయ స్థానాన్ని సమాజ్‌వాదీ పార్టీ సిట్టింగ్ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్ భారీ తేడాతో నిలబెట్టుకుని బీజేపీ అభ్యర్థి ప్రమోద్ మిశ్రాను మట్టికరిపించగా, పట్టభద్రుల స్థానంలోనూ ఎస్పీ అభ్యర్థి అశుతోష్ సిన్హా తిరుగులేని ఆధిపత్యాన్ని కనబరిచారు. సాక్షాత్తూ దేశ ప్రధాని నియోజకవర్గంలోనే విద్యావంతులు, ఉద్యోగ వర్గాలు బీజేపీకి వ్యతిరేకంగా తీర్పునివ్వడం రాజకీయ వర్గాలను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేస్తోంది.2014లో నరేంద్ర మోదీ వారణాసి నుంచి లోక్‌సభకు ఎన్నికైన నాటి నుంచి గత పన్నెండేళ్ల స్థానిక ఎన్నికల ఫలితాల చరిత్రను పరిశీలిస్తే ఫలితాలు ఇలాగే వస్తున్నాయి. 2020లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఇదే తరహా పరిణామం ఎదురైంది. దాదాపు పదేళ్ల పాటు బీజేపీ చేతిలో ఉన్న వారణాసి గ్రాడ్యుయేట్స్, టీచర్స్ స్థానాలు రెండింటినీ సమాజ్‌వాదీ పార్టీ చేజిక్కించుకుని కమలనాథులకు ఊహించని షాక్ ఇచ్చింది. అంతకుముందు బీజేపీ అభ్యర్థి కేదార్‌నాథ్ సింగ్ ప్రాతినిధ్యం వహించిన గ్రాడ్యుయేట్స్ సీటును ఎస్పీ ఎగరేసుకుపోవడం నాడే రాష్ట్రవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టించింది. లోక్‌సభలో మోదీ ఇమేజ్ పనిచేస్తున్నప్పటికీ, పరోక్ష, విద్యావంతుల ఓటింగ్ విధానాల్లో మాత్రం స్థానిక అసంతృప్తులు బ్యాలెట్ బాక్సుల్లో బయటపడుతూనే ఉన్నాయి.ఎమ్మెల్సీ ఎన్నికలకే పరిమితం కాకుండా, వారణాసి జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీకి ఆశించిన స్థాయిలో పట్టు దక్కలేదు. 2015, 2021 పంచాయతీ ఎన్నికల్లో జిల్లా పంచాయతీ వార్డు సభ్యుల స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ తో పాటు స్వతంత్రులే అధిక స్థానాల్లో గెలుపొందారు. క్షేత్రస్థాయి గ్రామీణ ఓటర్లలో బీజేపీ సొంత బలంతో సాధారణ మెజార్టీని సాధించలేకపోయింది; తదనంతర రాజకీయాల్లో ఇతర పక్షాల మద్దతుతో, అధికార బలాన్ని ఉపయోగించి జిల్లా పంచాయతీ అధ్యక్ష పీఠాన్ని దక్కించుకున్నప్పటికీ.. బూత్ స్థాయి ప్రజాతీర్పులో ఎస్పీ, స్వతంత్ర అభ్యర్థులే పైచేయి సాధించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. నగర ప్రాంత మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ పీఠాన్ని బీజేపీ నిలబెట్టుకుంటున్నప్పటికీ, డివిజన్ వార్డుల్లో మాత్రం విపక్షాలు గట్టి పోటీనిస్తూనే ఉన్నాయి.ప్రధానమంత్రి వ్యక్తిగత చరిష్మా, జాతీయవాదం, కాశీ విశ్వనాథ్ కారిడార్ వంటి భారీ ప్రాజెక్టులు లోక్‌సభ ఎన్నికల్లో నగర ఓటర్లను ఆకర్షిస్తున్నాయి. అయితే లోకల్ బాడీ, ఎమ్మెల్సీ ఎన్నికలకు వచ్చేసరికి ఓటర్ల ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోతున్నాయి.

అంతటా ఉంది ఆత్మే

'ఆత్మ (భూమా) కింద పైన వెనుక ముందు పక్కల అంతటా నిండి ఉంది. ఈ కనిపించే జగత్తు అంతా ఆత్మే! అదే నేను. నేనే కిందా, పైనా అంతటా ఉన్నాను. అంతా నేనుగా ఉన్నాను' అని పై ఉపనిషత్ వాక్యానికి భావం. ఎంతటి ఉదాత్తమైన భావాన్ని తెలియజేసిందో కదా ఈ శ్లోకం. దీన్ని బలపరిచే కథే ఇది.. మహారాష్ట్రలో పండరీపురం అనే పుణ్యక్షేత్రం ఉన్నది. అక్కడ దైవం పాండురంగ విఠలుడు. ఏడు వందల ఏండ్ల క్రితం అక్కడ ఒక భక్తుడు ఉండేవాడు. చిన్నప్పటినుంచీ అతనికి రంగడంటే ప్రాణం. ఎప్పుడూ స్వామి ధ్యాసలోనే ఉండేవాడు. ఒకరోజు సాయంకాలం అతను ఓ చెట్టుకింద కూర్చొని భోజనం చేస్తున్నాడు. ఎక్కడినుంచో ఒక కుక్క అక్కడికి వచ్చింది. పళ్లెంలోని రొట్టెలను లొట్టలు వేసుకుంటూ చూసింది. భక్తుణ్నీ పరిశీలించింది. ఆ వచ్చిన కుక్కను అతను గమనించలేదు. అది గబుక్కున రొట్టెను నోట కరచుకొని పరుగెత్తింది. పరధ్యానం నుంచి తేరుకున్న ఆ భక్తుడు ఆ కుక్క వెంటపడ్డాడు. 'భగవాన్ కేవలం రొట్టెలు తినకు. కడుపు నొప్పి లేస్తుంది. ఇదిగో ఈ నెయ్యి వేసుకో!' అంటూ కుక్కను పట్టుకున్నాడు. రొట్టె మీద నేతి వేసి కుక్కకు ఇచ్చాడు. అది ఆవురావురుమంటూ తిన్నది. భక్తుడు తృప్తిగా నవ్వాడు. అతనెవరో కాదు పాండురంగనిపై ఎన్నో కీర్తనలు రచించి, పాడి ధన్యుడు అనిపించుకున్న భక్తాగ్రేసరుడు నామదేవ్! ఆత్మ అనంతమైనది. ఆ భూమా తత్వాన్ని అనుభూతిలోకి తెచ్చుకున్న మహాత్ముడు కాబట్టి అతను జంతువుల్లోనూ దైవాన్ని దర్శించాడు. ఈ తత్వంలోని వాళ్లు సర్వజీవులందు ఆత్మ దర్శనం చేస్తారు. అక్కడ కుక్క, పిల్లి అనేవి సామాన్యులకు కనిపిస్తాయి. కానీ, భూమా తత్వంలో స్థిరపడిన వాళ్లు అంతటా తమను తామే దర్శనం చేసుకుంటారు. తాము ఏ విధంగానైతే అనుభూతి చెందుతారో, అవి కూడా అలాగే అనుభూతి చెందుతాయని భావిస్తారు.



ఆధ్యాత్మికం

డిప్యూటీ సీఎం జోక్యంతో జిల్లాకు దక్కాల్సిన వందల కోట్లు దారి మళ్లింపు

● సింగరేణి బొగ్గు గనులైన రామగుండం -1, 2, 3 ద్వారా డీఎంఎఫ్టికి దాదాపుగా 760కోట్ల నిధులు ఎక్కడికి పోయాయి

● జిల్లా మంత్రులకు ఎమ్మెల్యేలలకు డీఎంఏఫ్టీ నిధులు దారి మళ్ళుతుంటే చోద్యం చూస్తున్నారా

గోదావరిఖని ప్రతినిధి : పెద్దపల్లి జిల్లాలో విస్తరించి ఉన్న సింగరేణి బొగ్గు గనులైన రామగుండం (ఆర్జీ)-1, 2, 3 ద్వారా డీఎంఎఫ్టికి దాదాపుగా 760కోట్ల నిధులు బకాయి ఉన్నయని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ పేర్కొన్నారు. శుక్రవారం రోజున పెద్దపల్లి జిల్లా కలేక్టరేట్ కార్యాలయంలో కలేక్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ డీఎంఏఫ్టీ కమిటీకి చైర్మన్, కలెక్టర్, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా తెలియకుండానే డీఎంఏఫ్టీ నిధులు అటు ప్రభుత్వ కార్యక్రమాలు, ఇటు పక్క జిల్లాల్లోని పనులకు మల్లుతున్నాయనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయన్నారు. కావున పెద్దపల్లి జిల్లాకు చెందిన 760 కోట్లు జిల్లాకే కేటాయించాలని వారు డిమాండ్ చేసారు. తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఇంధన వనరులశాఖ మంత్రి మల్లు భట్టి విక్ర మార్క జోక్యంతోనే డిఎంఎఫ్టి నిధులు సుమారు 760 కోట్లు పెద్దపల్లి జిల్లాకు రాకుండానే దారి మల్లుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతు న్నాయని, జిల్లా వ్యాప్తంగా 2022 నుంచి ఇప్పటి వరకు 760 కోట్ల వరకు డీఎంఎఫ్ బకాయిలు ఉన్నాయని, పెద్దపల్లి జిల్లాలో ఇప్పటి వరకు 135.80కోట్ల ఎంబీ రికార్డులు పూర్తి చేసుకున్న 453 పనులకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నదన్నారు. ఇట్టి పనులు పూర్తయినప్పటికీ ఆ బిల్లుల చెల్లిం పులు జరగకపోవడంతో కాంట్రాక్టర్లు అప్పులతో తిప్పలు పడుతున్నారు. సింగరేణి నుంచి డీఎంఏఫ్టీకి నిధులు రాకపోవడంతో ఈ పేమెంట్లు పెండింగ్లో ఉన్నట్లు అధి కారులు చెబుతున్నారు. పెద్దపల్లి జిల్లాలో విస్తరించి ఉన్న సింగరేణి బొగ్గు గనులైన ఆర్జీ-1, 2, 3 ద్వారా డీఎంఎఫ్టికి దాదాపుగా 760కోట్ల నిధులు బకాయి ఉన్నది. డీఎంఎన్టీ చైర్మన్, కలెక్టర్, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా తెలియకుండానే డీఎంఎన్టీ నిధులు అటు ప్రభుత్వ కార్యక్రమాలు. ఇటు పక్క జిల్లాల్లోని పనులకు మల్లుతున్నాయనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి అని అగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం, ఇంధన వనరులశాఖ మంత్రి మల్లు భట్టి విక్ర మార్క జోక్యంతోనే ఈ నిధులు పెద్దపల్లి జిల్లాకు రాకుం డానే దారి మల్లుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. జిల్లా వ్యాప్తంగా 2022 నుంచి ఇప్పటి వరకు 760కోట్ల వరకు డీఎంఎఫ్ బకాయిలు ఉండగా, పెద్దపల్లి జిల్లాలో ఇప్పటి వరకు 135.80కోట్ల ఎంబీ రికార్డులు పూర్తి చేసుకున్న 453పనులకు బిల్లులు చెల్లిం చాల్సి ఉన్నది. పనులు పూర్తయినప్పటికీ ఆ బిల్లుల చెల్లిం పులు జరగకపోవడంతో కాంట్రాక్టర్లు అప్పులతో తిప్పలు పడుతున్నారు. సింగరేణి నుంచి డీఎంఎన్టీకి నిధులు రాకపోవడంతో ఈ పేమెంట్లు పెండింగ్లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పిందే వేదంగా సాగుతోందని, జిల్లాకు చెందిన మంత్రుకు కూడా గౌరవం దక్కడం లేదని పెద్దపల్లి జిల్లా ప్రజలు ఆగ్రహిస్తున్నారన్నారు. మూడేళ్లుగా అరకొర మినహా పెద్దగా డీఎంఏఫ్టీ నిధులు రాకపోవడంతో ఎక్కడి అభివృద్ధి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. జిల్లాలోని సింగరేణి ఆర్జీ-1, 2, 3 నుంచి తవ్విన బొగ్గుపై చెల్లించే రాయల్టీలో డీఎంఎన్టీకి నిధులు చెల్లించాల్సి ఉంటుంది. టన్ను బొగ్గుకు 32 నుంచి 180 రూపాయల వరకు డీఎంఫీకి రాయల్టీ రూపంలో వస్తుంది. తక్కువ క్వాలిటీ బొగ్గు టన్నుకు 780 అయితే 32, నాణ్యమైన బొగ్గు 4000 అయితే 180 చొప్పున రావాలి. 2022 నుంచి మూడేళ్లుగా ఈ మొత్తాన్ని పెండింగ్లో పెట్టారు. గత బీఆర్ఎస్ హయాంలో జిల్లా ఇన్చార్జి మంత్రి చైర్మన్గా గా ఈ డీఎంఏఫ్టీ కమిటీ ఉండేది. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కలెక్టర్లను చైర్మన్లుగా చేశారు. ఈ కమిటీలో జిల్లాలోని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్కుమార్, ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ సభ్యులుగా ఉన్నారు. వీరికి తెలియకుండానే ఇప్పటికే వందల కోట్లు యంగ్ ఇండియా స్కూల్స్కు వెళ్లగా, మరో ప్రభుత్వ కార్యక్రమానికి సైతం వందల కోట్లు తరలివెళ్లాయని, సింగరేణి ప్రభావితమైన పెద్దపల్లి జిల్లాకే డీఎంఎఫ్టి నిధులు అందకుండా పోతుండడంతో జిల్లా వ్యాప్తంగా తీవ్రంగా నిరసన వ్యక్తం అవుతున్నదన్నారు. పెద్దపల్లి జిల్లాలో 135.80 కోట్లకు సంబంధించిన పనులు ఎంబీ రికార్డు పూర్తయిన బిల్లుల చెల్లింపు చేయడం లేదు. దీంతో నిధుల్లేక 453 అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. 2023 తర్వాత 269 పనులకు 107.14 కోట్లు, 2023 ముందు 184 పనులకు 28.65 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. ఇందులో పెద్దపల్లి నియోజక వర్గంలోనే 70 కోట్లకు పైగా, మంథనిలో 51 కోట్లు పెండింగ్లో ఉన్నాయి. 2023కి ముందు చేసిన 184పనులకు ఇంకా 28.65 కోట్లు ఇవ్వాల్సి ఉన్నది. పెద్దపల్లి నియోజక వర్గంలో 28 పనులకు 21.12 కోట్లు, రామగుండం నియోజక వర్గంలోని 94 పనులకు 3.43 కోట్లు, మంథని నియోజక వర్గంలోని 27పనులకు 60 లక్షలు చెల్లించాల్సి ఉన్నది. బిల్లులు రాక కాంట్రాక్టర్లు విలవిలలాడుతుంటే, అధికార పార్టీ మాత్రం ప్రచార బోర్డులు, ఇతర జిల్లాల ప్రాజెక్టులకు నిధులు తరలిస్తోందని విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. పెద్దపల్లి జిల్లా నిధులు పెద్దపల్లికే ఇవ్వాలని, డిప్యూటీ సీఎం జోక్యాన్ని ఆపాలని జిల్లా ప్రజలు పక్షాన జిల్లా కలేక్టర్గా మిమ్మల్ని కోరుతున్నామని దినేష్ పేర్కొన్నారు.

సన్న బియ్యం ధరల నియంత్రణలో పారదర్శకత పాటించాలి

● బియ్యం దుకాణాల్లో నిల్వలు, రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలి ● అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్కు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు ● అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి ప్రతినిధి : సన్న బియ్యం ధరల నియంత్రణలో భాగంగా బియ్యం వ్యాపారులు పారదర్శకత పాటించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని తన ఛాంబర్లో హోల్సేల్ బియ్యం వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించి, బియ్యం ధరలు, నిల్వలు, విక్రయాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ ప్రతి బియ్యం దుకాణంలో నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, అన్ని రికార్డులను పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బియ్యం కొరత ఉందంటూ ప్రజల్లో ఆందోళన సృష్టించే ప్రయత్నాలు చేయకూడదని స్పష్టం చేశారు. అక్రమంగా బియ్యం నిల్వ చేయడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి బియ్యం దుకాణంలో నోటీసు బోర్డు ఏర్పాటు చేసి, విక్రయించే బియ్యం బ్రాండ్లు, రకాలు, వాటి ధరల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. బియ్యం బస్తాల బరువును కచ్చితంగా పాటించాలని, వినియోగదారులకు నిర్ణీత బరువుకు అనుగుణంగా బియ్యం అందించాలని తెలిపారు. 26 కిలోల బియ్యం బస్తాలో 25 కిలోల బియ్యం మాత్రమే ఉంటున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బియ్యం దుకాణాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. తనిఖీల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, బ్లాక్ మార్కెటింగ్కు పాల్పడటం, సన్న బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం వంటి ఉల్లంఘనలు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరూ ప్రయత్నించకూడదని రాష్ట్రంలో బియ్యం సమృద్ధిగా అందుబాటులో ఉందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బియ్యం వ్యాపారులు నిబంధనలకు అనుగుణంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, బియ్యం దుకాణాల యజమానులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్లో ఘనంగా మెగా రక్తదాన శిబిరం: 200 మంది రక్తదానం

సుల్తానాబాద్, అక్టోబర్ 30: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని సుల్తానాబాద్ సర్కిల్ పోలీస్ శాఖ , సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ సంయుక్త సౌజన్యంతో శనివారం స్థానిక ఎస్ వి ఆర్ ఫంక్షన్ హాల్లో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ అత్యంత విజయవంతంగా నిర్వహించారు. దేశ రక్షణ, శాంతిభద్రతల కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో దాదాపు 200 మంది స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీపీ భూక్య రామ్ రెడ్డి , ఏసీపీ జీ. కృష్ణ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి స్మరణార్థం ఇలాంటి రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ , రెడ్ క్రాస్ సొసైటీలు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండడం సంతోషకరమన్నారు. ఈ క్యాంప్లో పోలీస్ శాఖ అధికారులు, సిబ్బందితో పాటు లయన్స్ క్లబ్ ప్రతినిధులు, స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. సుల్తానాబాద్ సి.ఐ పి. రంజిత్ రావు , ఎస్.ఐ చంద్రకుమార్ , సర్కిల్ పరిధిలోని ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బ్లడ్ డొనేషన్ క్యాంప్ కోఆర్డినేటర్ వలస నీలయ్య, సెక్రటరీ ఎర్రబెల్లి సుధీర్ రావు, కోశాధికారి తమ్మనవేని సతీష్ కుమార్, సభ్యులు భూమేష్ దీకొండ, మాటేటి సంజీవ్ కుమార్ పాల్గొన్నారు. అలాగే పెద్దపల్లి రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కావేటి రాజగోపాల్, వైస్ చైర్మన్ ఊట్కూరి రాధాకృష్ణ రెడ్డి, జిల్లా కమిటీ మెంబర్ డి.వి.ఎస్. మూర్తి, ప్రముఖ వైద్యులు డాక్టర్ వీ.నా.చీ. రెడ్డి, పిట్టల వెంకన్న తదితరులు పాల్గొని రక్త సేకరణ ప్రక్రియను పర్యవేక్షించారు.

ఉద్యోగుల హక్కులను కాలరాస్తే ఊరుకోం...

ఎన్హెచ్ఎం ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష

పెద్దపల్లి ప్రతినిధి : నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గత 18 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్న ఎన్హెచ్ఎం ఉద్యోగుల ధర్నా శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైద్య సిబ్బంది పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఇతర రాష్ట్రాల్లో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు ఇస్తుంటే, ఇక్కడ పనిచేస్తున్న మహిళా సిబ్బందికి చట్టబద్ధంగా రావాల్సిన 180 రోజుల ప్రసూతి సెలవులను కూడా నిరాకరించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రచారాలు, సమ్మిట్ల పేరిట పత్రికా ప్రకటనల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 వేల మంది ఎన్హెచ్ఎం సిబ్బందికి ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడానికి మాత్రం వెనకడుగు వేస్తోందని విమర్శించారు. హర్యానా, రాజస్థాన్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను ఔట్సోర్సింగ్ లోకి నెట్టి వారి హక్కులను కాలరాయాలని చూస్తున్నారని మండిపడ్డారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన వైద్య సిబ్బందికి రాజ్యాంగబద్ధంగా సమాన పనికి సమాన వేతనం. చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రులు వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎన్హెచ్ఎం కార్మికులు ఎవరి బెదిరింపులకూ భయపడాల్సిన అవసరం లేదని, వారి న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనూ ఈ సమస్యపై గళమెత్తుతామని దాసరి ఉష స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ మహా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన బండి రమేష్

కూకట్పల్లి అక్టోబర్ 30 (: బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్ను అడ్డుపెట్టుకుని ప్రజల ఓటు హక్కులను కాలరాస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలకు పాల్పడుతోందని నిరసిస్తూ, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సాగిస్తున్న ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి మద్దతుగా నవంబర్ 01న ఢిల్లీ లోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ మహా ర్యాలీలో పాల్గొనేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో కూకట్పల్లి నియోజకవర్గం నుంచి ప్రత్యేక బస్సుల్లో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఢిల్లీకి బయలుదేరిన ప్రత్యేక బస్సులకు బండి రమేష్ స్వయంగా జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారిని ఘనంగా సాగనంపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

వైభవంగా ప్రారంభమైన అండర్-17 జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

- సుల్తానాబాద్లో రూ. 8 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్

- జూన్ నాటికి అందుబాటులోకి పాఠశాల

- రూ. 1.40 కోట్లతో హైస్కూల్ భవన నిర్మాణాల పరిశీలన

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

సుల్తానాబాద్, అక్టోబర్30: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్య, క్రీడా రంగాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 70వ ఈస్టువిలే కరీంనగర్ జిల్లా వాలీబాల్ అండర్-17 బాలుర, బాలికల టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, టాస్ వేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెద్దపల్లి నియోజకవర్గానికి మంజూరైన ప్రతిష్టాత్మక తెలంగాణ పబ్లిక్ స్కూల్ను సుల్తానాబాద్ కాలేజ్ గ్రౌండ్ ఆవరణలో రూ. 8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మెరుగైన విద్యా ప్రమాణాలు, సకల సౌకర్యాలతో నిర్మించబోయే ఈ పాఠశాల ప్రక్రియ వచ్చే జూన్ మాసం చివరి నాటికి పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణలో రూ. 1.40 కోట్లతో నిర్మిస్తున్న హైస్కూల్ భవన తరగతి గదుల నిర్మాణ పనులను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, అదనపు గదుల నిర్మాణానికి మరో రూ. 3 కోట్లు వెచ్చించనున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకటించారు. క్రీడాకారులకు రేవంతన్న సర్కార్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్లు, వాలీబాల్ జిల్లా అధ్యక్షులు, పీడీలు, పీఈటీలు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్పల్లి అక్టోబర్ 30 : కూకట్పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ లోని వసుంధర ఆసుపత్రి వెనుక ప్రాంతంలో రోడ్డు పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నుంచి హబీబ్నగర్ కు వెళ్లే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు నెమ్మదిగా సాగుతుండటాన్ని గమనించారు. రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే మంజూరైన రోడ్లకు సంబంధించి కొంతమంది మట్టి పోసి నాయకులు వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారన్న సంగతి తెలుసుకుని, అటువంటి పనులకు వత్తాసు పలుకొద్దని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ వెంకటేష్ చౌదరి, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ఆనంద రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఏదులాపురం మునిసిపాలిటీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం

● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30: ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఏదులాపురం మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 6 వ వార్డు సింగరేణి కాలనీ వద్ద రూ. 496 లక్షల అంచనా వ్యయంతో 46 అంతర్గత సి.సి. రోడ్ల నిర్మాణ పనులకు, రూ. 250 లక్షల అంచనా వ్యయంతో ప్రకాశ్ నగర్ బ్రిడ్జి నుండి కోదాడ ఆర్ అండ్ బి రోడ్డు వయా కోటనారాయణపురం ఇందిరమ్మ కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ రోడ్లతో సాయి ప్రభాత్ నగర్ వన్ అండ్ టూ, టెంపుల్ సిటీ, అభయ టౌన్‌షిప్, సింగరేణి కాలనీ, గుర్రాలపాడు తండా, ఇందిరమ్మ కాలనీ, కోట నారాయణపురం, సూర్యా నగర్, చంద్ర నగర్, చిన్న తండా, కె.ఎల్.ఆర్. నగర్, బృందావనం, గోకుల కృష్ణ నగర్, తాశిల్లీ తండా, లక్ష్మీ గాయత్రి నగర్, నందన వనం, ఏదులాపురం, ఆదిత్య టౌన్‌షిప్, గుర్రాలపాడు ఆర్.టి.సి. కాలనీ, శ్రీవారి నగర్, సత్య సంకల్ప కాలనీ, షాబాద్ మాసరెడ్డి నగర్, వరంగల్ క్రాస్ రోడ్, కోదాడ క్రాస్ రోడ్ తదితర ప్రాంతాల ప్రజలందరూ నిరంతరం రాకపోకలు సాగిస్తారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత 6, 7, 8 డివిజన్ లలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ. 79 కోట్ల 79 లక్షల రూపాయలతో శంకుస్థాపనలు చేసుకున్నామని, కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఎన్నికల ముందు నుంచి కూడా అభివృద్ధి చేస్తూ, రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్ మున్సిపాలిటీగా తీసుకొస్తామని ఇచ్చిన మాటి ప్రకారం ఎన్నికల దగ్గర నుంచి ఇప్పటివరకు సుమారు రూ. 100 కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చామని తెలిపారు. మున్సిపాలిటీలో 8 నుంచి 11 గ్రామ పంచాయతీలు కలిసి ఉన్నందున అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఈ విశాలమైన మున్సిపాలిటీని తీర్చిదిద్దాలనే తపనతో ముఖ్యమంత్రి ఏది కాదనకుండా సహకరిస్తున్నారని అన్నారు. కేవలం రోడ్లు, డ్రైన్లే కాకుండా తాగునీరు సమస్యను, విద్యుత్ సమస్యలను హైటెన్షన్ లైన్ల తొలగింపు తదితరాలను పరిష్కరించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పేదవాళ్లకు అండదండగా ఉంటూ, భద్రత, భరోసా కల్పిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆర్.టి.సి. బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, కొత్త రేషన్ కార్డులు, పేదవాళ్ళు తినడానికి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమంలో భాగంగా గడిచిన 33 నెలల్లో రూ. 73 వేల కోట్లు సున్నా వడ్డీనిచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని తెలిపారు. పేదోడి కల ఇందిరమ్మ ఇల్లు అన్నట్లుగా, పేదవాడు చనిపోయేలోపు సొంత స్థలంలో ఇల్లు కట్టుకోవాలనే కోరికను నెరవేర్చడానికి తెలంగాణ ప్రభుత్వం అప్పుల్లో ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. మొదటి విడత రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు, రెండో విడత 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాదులో లక్ష ఇళ్లు, మొత్తంగా 8 లక్షల ఇళ్లకు 40 వేల కోట్ల రూపాయలు పేదింటి ఆడబిడ్డకు ఇల్లు కట్టుకోవడానికి ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కులం, మతం, పార్టీ అనకుండా కేవలం పేదవాడై ఉంటే చాలు అనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం అమలు జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఏదులాపురం మునిసిపాలిటీకి ఇప్పటికే రూ. 100 కోట్లు ఖర్చు పెట్టామని, రాబోయే రోజుల్లో మరో రూ. 100 నుండి 150 కోట్లు ఖర్చు పెట్టి ప్రతి డొంకను, ప్రతి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మారుస్తామన్నారు. కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, కేవలం వారం రోజుల్లోనే రూ. 30 కోట్ల విలువైన శంకుస్థాపనలు ఏదులాపురం మునిసిపాలిటీలో జరిగాయన్నారు. అభివృద్ధి పనులు అత్యంత వేగంగా కొనసాగుతున్నాయన్నారు. అన్ని ఏరియాలలోనూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేలా సమగ్ర అభివృద్ధి జరుగుతోందని అన్నారు. మంత్రి ఆదేశాల మేరకు పనుల పూర్తికి ఇంజనీరింగ్ అధికారులను డెప్యుటేషన్ పై తెప్పించడం జరిగిందని, త్వరలోనే ఈ పనులన్నీ పూర్తిగా వేగవంతం చేసి పూర్తి చేస్తామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బయటపడ్డ"కరీంనగర్ పివిసి"ఇటుకల బండారం

● పదిహేను వేల ఇటుకలకు కేవలం ఆరువేల ఇటుకలే తెచ్చిన వైనం ● మహేశ్వరం ఇటుక పట్టి సంఘం సభ్యులతో బయటపడ్డ బాగోతం ● లక్షా, 50,వేల రూపాయల నిలువు దోపిడికి నిందితులు యత్నం

మహేశ్వరం అక్టోబరు 30 : అమాయకులను మోసం చేస్తూ తప్పించుకు తిరుగుతున్న " కరీంనగర్ పివిసి"ఇటుక బట్టి సిబ్బందిని మహేశ్వరం ఇటుకబట్టి సంఘం సభ్యులు పట్టుకున్నారు. స్థానికుల వివరాల ప్రకారం కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధి పులిమామిడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొత్త ఇంటి నిర్మాణం కోసం "కరీంనగర్ పివిసి" కంపెనీకి చెందిన ఇటుక బాగుంటుందనే ఉద్దేశంతో పదిహేను వేల ఇటుకకు ఆర్డర్ చేశాడు, శుక్రవారం ఉదయం పివిసి ఇటుక పట్టి సిబ్బంది లోడును దించారు, ఇంటి యజమానికి ఇటికలు తక్కువ కనిపించడంతో అనుమానం వచ్చిన ఇంటి యజమాని ఇటుక బట్టి సంఘానికి సమాచారం ఇచ్చాడు, వారు వచ్చి పీవీసి బట్టి నిందితుల ముందే ఇటుకలను వారితోటే లెక్కించడంతో అసలు బండారం బయటపడింది ఇటుకలను సందులు సందులుగా పేరుస్తూ పదిహేను వేల ఇటికలు ఉన్నట్టు చూపిస్తూ ఇటుకలు మొత్తం దించారు,మళ్ళీ మహేశ్వరం ఇటుక బట్టి యాజమాన్యం చొరవ తీసుకొని ఇటుకలు లెక్కించడంతో 15, వేల ఇటుకలకు బదులు కేవలం 6, వేల ఇటుకలే రావడంతో స్థానికులతో పాటు మహేశ్వరం ఇటుక బట్టి సంఘం సైతం అవాక్కయ్యారు. వెంటనే పోలీసులకు బాధితుడు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న కందుకూరు పోలీసులు " కరీంనగర్ పివిసి" ఇటుక బట్టి సిబ్బందితో పాటు ఇటుకలలోడును తీసుకొచ్చిన లారీని (టిఎస్ 07,యుజె 8379), కందుకూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఆన్‌లైన్‌లో ఇటుకలు కొనుగోలు చేసే ముందు అమ్మేవారి వివరాలు, ఇటుకల పరిమాణం, నాణ్యత, ధర తదితర అంశాలను పూర్తిగా నిర్ధారించుకోవాలి. ముందస్తుగా డబ్బులు చెల్లించే విషయంలో జాగ్రత్త వహించాలి. కేవలం ఆన్‌లైన్ ప్రకటనలు, ఫోన్‌లో చెప్పె మాయ మాటలు నమ్మి మోసపోవద్దు. ఇటుకలు అందిన తర్వాత ఆర్డర్ చేసిన సంఖ్య, నాణ్యత సరిగా ఉన్నాయో లేదో పరిశీలించాలి. ఎవరైనా మోసానికి పాల్పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండి సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.



కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో పరిమళించిన మానవత్వం

- పోలీసుల ఆధ్వర్యంలో ఆలయ ఫౌండేషన్ సహకారంతో ఉచిత ఐ క్యాంపు - పోలీస్ స్టేషన్ వేదికగా సేవా కార్యక్రమం
- ఖాకీలో మానవత్వం.. ఐ క్యాంపుతో ప్రజలకు అండగా

పోలీసులను సత్కరించిన ఆలయ ఫౌండేషన్ సభ్యులు

బ్యూరో,: పోలీసులు అంటే కఠినత్వం మాత్రమే కాదు.. మృదుత్వం కూడా! కేవలం శాంతిభద్రతల పరిరక్షణే కాదు.. సేవా గుణం కూడా తమలో ఉందని నిరూపిస్తూ మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కోటపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈరోజు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ఫౌండేషన్ సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని (ఐ క్యాంపు) ఘనంగా నిర్వహించారు. ఈశిబిరానికి స్థానిక ప్రజల నుంచివిశేష స్పందన లభించింది. ఈ సేవా కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొని, ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల కోసం విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ఫౌండేషన్ చేస్తున్న కృషిని, అందుబాటులోఉన్నపథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా కోటపల్లి ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ కృష్ణ, ఎస్ఐ రాజశేఖర్‌లను ఆలయ ఫౌండేషన్ తరఫున శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రముఖ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి రచించిన 'ఓబీసీ – పోరుబాట' పుస్తకాలను వారికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సీఈఓ మిట్టపల్లి రాజేంద్ర కుమార్, రసపెల్లి రవికుమార్, అలమర్తి శిరీష్, కమటం కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ అంటే కేవలం ఫిర్యాదులు స్వీకరించే చోటు మాత్రమే కాదు.. ప్రజా సేవకు కూడా వేదిక కావచ్చని కోటపల్లి పోలీసులు చాటిచెప్పారు. పోలీసుల ఈ మానవీయ చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన

ఒత్తిడిని అధిగమించి సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలి

మేడ్చల్, అక్టోబర్ 30: విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సమతుల్యతపై అవగాహన కల్పించేందుకు సాయి-సుధీర్ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. 'దైనందిన జీవితంలో మనస్తత్వశాస్త్రం -- ఆలోచనలు, భావోద్వేగాలు, ప్రవర్తన' అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని సమర్థవంతంగా అధిగమించే మార్గాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌బ్లిస్ మానసిక ఆరోగ్య కేంద్రం వ్యవస్థాపకురాలు శ్రావ్య రాగా పెన్మెత్స, సాయిరాం రామావత్, వైద్య మనస్తత్వ నిపుణురాలు శివాంగి పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆలోచనలు, భావోద్వేగాలు, ప్రవర్తన మధ్య ఉన్న సంబంధాన్ని వివరిస్తూ అతిగా ఆలోచించడం, ప్రతికూల ఆలోచనలు, ఆత్మవిశ్వాస లోపం, స్వీయ అవగాహన, భావోద్వేగ నియంత్రణ, నిర్ణయాలు తీసుకోవడంలో ఎదురయ్యే సమస్యలు, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ ఆర్. ఉషారాణి మాట్లాడుతూ సదస్సులో నేర్చుకున్న మానసిక ఆరోగ్య పద్ధతులను విద్యార్థులు తమ దైనందిన జీవితంలో పాటించాలని సూచించారు. ఒత్తిడిని తగ్గించుకుంటూ ప్రతికూల ఆలోచనలను అధిగమించి సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సంపూర్ణ వికాసంతోపాటు మానసిక, భావోద్వేగ ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ కళాశాల నిర్వహించిన ఈ సదస్సు అందరినీ ఆకట్టుకుంది.

జాతీయ సాహస శిబిరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపిక

ధర్మశాలలో జరిగే పది రోజుల శిబిరంలో పాల్గొననున్న అనిత.. విద్యార్థినిని అభినందించిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జమ్మికుంట అక్టోబర్ 30 : జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎన్. అనిత జాతీయ సాహస శిబిరానికి ఎంపికైంది. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని ధర్మశాలలో నవంబర్ 18 నుంచి 27 వరకు పది రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సాహస శిబిరంలో పాల్గొనేందుకు ఆమె ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. రమేష్ తెలిపారు. ఈ నెల 19న కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు జాతీయ సాహస శిబిరం ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎన్. అనిత జాతీయ స్థాయి శిబిరానికి ఎంపికైంది. విద్యార్థిని జాతీయ స్థాయి శిబిరానికి ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో అనితను శాలువా, పుష్పగుచ్ఛంతో అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రం, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ గణేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఎంబాడి రవి, లోఖండే రవీందర్, అధ్యాపకులు డాక్టర్ శ్యామల, కిరణ్ కుమార్, డాక్టర్ మాధవి, ఉమాకిరణ్, డాక్టర్ రాజకుమార్, పి. శ్రీనివాస్ రెడ్డి, మమత, డాక్టర్ సుష్మ, డాక్టర్ రవిప్రకాశ్, డాక్టర్ శ్రీనివాస్, పి. అరుణ్ రాజ్, సాయికుమార్, శ్రీకాంత్, దీనా, డాక్టర్ వినీత కుమారి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోకు ఘన సన్మానం...

ఇల్లందకుంట అక్టోబర్ 30 : ఇల్లందకుంట మండల ఎంపీడీవో (మండల పరిషత్ అభివృద్ధి అధికారి)గా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ మల్హోత్రను శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు గ్రామపంచాయతీలో మర్యాదపూర్వకంగా కలిసి ఎంపీడీవో ను శాలువాతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఇల్లంతకుంట మండల అభివృద్ధి గ్రామాల పురోగతి ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ తన పదవీ కాలాన్ని విజయవంతంగా నిర్వహించాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దార సురేష్, ధర్మకర్త గౌడిశాల పరమేష్, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి హరిహర క్షేత్రం ట్రస్ట్ ఆర్థిక చేయూత..

అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం..

వీణవంక అక్టోబర్ 30 : నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి హరిహర క్షేత్రం నర్సింగాపూర్ పోషక సమితి ట్రస్ట్ సభ్యులు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. గ్రామానికి చెందిన శ్రీమతి శ్రీమంతుల లక్ష్మి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు సహాయం కోరారు. వారి విజ్ఞప్తికి స్పందించిన హరిహర క్షేత్రం నర్సింగాపూర్ పోషక సమితి ట్రస్ట్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు, అంత్యక్రియలకు హాజరైన సమీప బంధువులకు భోజన సదుపాయాన్ని కూడా కల్పించారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్న ట్రస్ట్ సభ్యుల సేవలను గ్రామస్థులు అభినందిస్తున్నారు. కష్టకాలంలో సహాయం అందించిన ట్రస్ట్ సభ్యులకు కుటుంబ సభ్యులు, ట్రస్ట్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కుల వివక్షకు తావులేకుండా సమాజంలో ఐకమత్యంగా మెలగాలి

కొరపల్లిలో పౌరహక్కుల దినోత్సవం.. అంటరానితనాన్ని రూపుమాపాలని అధికారుల పిలుపు

జమ్మికుంట అక్టోబర్ 30 : కొరపల్లి కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో జీవించాలని, సమాజంలో అంటరానితనం, కులవివక్షకు తావులేకుండా చూడాలని అధికారులు పిలుపునిచ్చారు. కొరపల్లి గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ యశోద శంకర్ ఆధ్వర్యంలో, సర్పంచ్ కందికట్ల మధుసూదన్ అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉన్నాయని, కుల వివక్ష పాటించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. అంటరానితనాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గ్రామ ప్రజలందరూ కులాలకు అతీతంగా కలిసిమెలిసి జీవిస్తూ సోదరభావాన్ని పెంపొందించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ గడ్డం శంకర్, జీపీ ఓ మధుకర్, పంచాయతీ కార్యదర్శి రామారావు, వార్డు సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం

- రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

సుల్తానాబాద్, అక్టోబర్ 30: ఎలినో పరిస్థితులను ఎదుర్కొంటూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కార్యాచరణ రూపొందిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చిన్న బొంకూర్, పేరుకపల్లి, రెబ్బల్దేవ్ పల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమైన అంశాలను వెల్లడించారు: దళారుల కుట్రలపై హెచ్చరిక: వడ్ల డిమాండ్‌ను ఆసరా చేసుకొని వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేందుకు కుట్రలు పన్నుతున్నారని, ఇలాంటి చర్యలను సహించేది లేదని హెచ్చరించాారు. 'గోటీ' పేరిట రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. నగదు అందితేనే లోడింగ్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ వెంటనే చెల్లించడం జరుగుతుందని, ఒకవేళ బయట మార్కెట్‌లో అంతకంటే ఎక్కువ రేటు లభిస్తే రైతులు ఆ అవకాశాన్ని వాడుకోవచ్చని సూచించారు. అయితే, చేతికి వెంటనే నగదు అందజేస్తేనే వడ్లను లోడ్ చేయాలని రైతులకు స్పష్టం చేశారు. యాసంగిలో వరి పంట వేయవద్దు: వచ్చే యాసంగి పంట కాలానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వరి పంట వేయవద్దని కోరారు. ఎస్సారెస్పీ (రా=వ్రా) నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఆరుతడి పంటలకు పూర్తి మద్దతు: వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు వేసుకునే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన

సహాయ సహకారాలతో పాటు పంటలకు మద్దతు ధర చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ గౌరవెల్లి మురళీధర్ రావు, మండల పార్టీ అధ్యక్షులు చిలుక సతీష్, సింగిల్ విండో డైరెక్టర్లు, కార్యదర్శి, సర్పంచులు, మాజీ సర్పంచులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాకు జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- జార్జిరెడ్డి పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు మంద సురేష్ డిమాండ్

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30: ఖమ్మం జిల్లాకు జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని జార్జిరెడ్డి పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు మంద సురేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని ప్రభుత్వ జె వి ఆర్ డిగ్రీ కళాశాలలో జార్జిరెడ్డి పి డి ఎస్ యు నాయకులు తడికమళ్ళ సిద్దు అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి మంద సురేష్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లాకు జనరల్ యూనివర్సిటీ లేకపోవడం వల్ల విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంగా జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అధ్యాపకుల కొరత విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని కోరారు. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు, విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, లైబ్రరీలు, ప్రయోగశాలలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు స్వస్తి పలికి, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడం ద్వారానే సామాన్య విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయగలమని స్పష్టం చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే జార్జిరెడ్డి పి డి ఎస్ యు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా కేంద్రంగా

జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి పి డి ఎస్ యు సత్తుపల్లి డివిజన్ నాయకులు వేర్పుల చందు, గోపి, నవ్య స్వాతి, కుమార్, నైనా, తదితరులు పాల్గొన్నారు.

హాలియా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

- పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి.. బాధితులకు సత్వర న్యాయం అందించాలి: ఎస్పీ

నల్గొండ, ప్రతినిధి: అక్టోబర్ 30 హాలియా: హాలియా పోలీస్ స్టేషన్‌ను నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, విధుల నిర్వహణ, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు అందుతున్న సేవలు, సిబ్బంది స్పందన, పరిసరాల పరిశుభ్రత, సీసీ కెమెరాల పనితీరును సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రతి కేసులో నాణ్యమైన ఆధారాలు సేకరించి నిందితులకు చట్టప్రకారం శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనిస్తూ నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేయడంతో పాటు వాహనాల తనిఖీలు నిర్వహించి దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరిధిలో పరిష్కరించాలని తెలిపారు. గ్రామాల్లో తరచూ పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెంపొందించేలా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ అంకితభావంతో పనిచేయాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. ఈ తనిఖీలో మిర్యాలగూడ ఇన్‌చార్జి డీఎస్పీ రవి, హాలియా సీఐ రాఘవరావు, ఎస్ఐ సాయి ప్రశాంత్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలి

- బాండ్ల పరిశీలనకు రాష్ట్రవ్యాప్తంగా 10 కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- విజయవాడ ప్రత్యేక కోర్టును వెంటనే అమల్లోకి తేవాలి: పల్లా దేవేందర్ రెడ్డి

దేవరకొండ, అక్టోబర్ 30 : తెలంగాణ రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితుల బాండ్ల పరిశీలన కోసం రాష్ట్రవ్యాప్తంగా 10 కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు, విజయవాడ కేంద్రంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని కోరారు. శుక్రవారం దేవరకొండలోని సీపీఐ కార్యాలయంలో ఎం. యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన అగ్రిగోల్డ్ బాధితుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 12 సంవత్సరాలుగా బాధితులు తమ సొమ్ము తిరిగి పొందేందుకు పోరాటం చేస్తున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించి బాధితుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం బాండ్ల పరిశీలనకు రాష్ట్రంలో ఉన్న మూడు కేంద్రాల స్థానంలో పది కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. లేకపోతే బాధితులు వందల కిలోమీటర్లు ప్రయాణించి కేంద్రాలకు చేరుకోవాల్సి వస్తుందని, దీనివల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రత్యేక వెరిఫికేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులు ధైర్యంగా ఉండాలని, వారి సమస్యల పరిష్కారం కోసం సంఘం నాయకులు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని తెలిపారు. కోర్టు పర్యవేక్షణలో అగ్రిగోల్డ్ భూములకు వేలం నిర్వహించాలని కోరారు. భూములను చిన్నచిన్న కమతాలుగా విభజించి బహిరంగ వేలం నిర్వహిస్తే అధిక మొత్తంలో నిధులు సమకూరే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆ నిధులను బాధితులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు ఎం. యాదగిరి, జి. శ్రీనివాస్, వి. కేశవులు, బి. కుమార్, డి. సతీష్, ఆర్. వెంకన్న, వనం భాస్కర్, సీహెచ్. రాజేష్, వై. సుమతి, జి. హేమలత, వి. బాబు, సంతోష లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్ బాబుతోనే గ్రామాల అభివృద్ధి

కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్

రామగిరి,అక్టోబర్ 30: రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తోనే గ్రామాల అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ మాజీ సర్పంచ్

ఆకుల ఓదెలు లు అన్నారు. కమాన్ పూర్ మండలం గుండారం గ్రామంలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు ఇందిరమ్మ పథకం మంజూరి పత్రాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు గుండారం గ్రామంలో ఏడుగురికి ఇందిరమ్మ గృహాలు మంజూరయ్యాయని అలాగే మరికొంత మంది నిరుపేదలను గుర్తించి వారికి గృహాలు అందజేయడమే ప్రధమ ధీయమని అన్నారు. శ్రీధర్ బాబు తోనే గ్రామాల అభివృద్ధి చెందుతుందని ఇందులో భాగంగా కమాన్ పూర్ మండలంలో అంతర్గత రోడ్లు గ్రామపంచాయతీ భవనాలు వైకుంఠ రథాలు ఎన్నో ఇటీవల అందజేయడం జరిగిందని అన్వర్ట్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుండారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిడుగు శంకర్, కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్,ఉప సర్పంచ్ అంబిరి రాజేందర్, మాజీ సర్పంచు పిడుగు నరసయ్య, వార్డు సభ్యులు దామెర దేవయ్య పిడుగు ఎల్ఐసి సది, నాయకులు ముకుంద శ్రవణ్, వడ్లకొండ శంకర్, ఆకుల వెంకటేష్, ఆకుల రమేష్, ముధం కొమురయ్య, ముదాం రాములు, రాచకొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల రక్షణకు ప్రత్యేక చర్యలు

సేఫ్టీ కిట్లు యూనిఫార్మ్‌లను పంపిణీ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి

ధర్మపురి, అక్టోబర్ 30, : ధర్మపురి పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం పట్టణంలో పనిచేస్తున్న 53 మంది పారిశుధ్య కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని సేఫ్టీ హెల్మెట్లు, ఎన్95 మాస్కులు, ఆప్రాన్లు, సేఫ్టీ షూస్, బ్యాగులు మరియు యూనిఫార్మ్‌లను మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ నాగలక్ష్మి మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రత కోసం పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ నిరంతరం శ్రమిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. విధి నిర్వహణలో కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఈ రక్షణ పరికరాలు, దుస్తులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య కార్మికులు తగిన రక్షణ పరికరాలను వినియోగిస్తూ సురక్షితంగా విధులు నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్, మేనేజర్ గంగాధర్, శానిటరీ ఇన్స్పెక్టర్ గంగాధర్, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు జంజీరికని సువర్ణ, కొమురెల్లి పవన్ కుమార్, చుక్క సంధ్య, ముడుసుల ప్రశాంత్, కో ఆప్షన్ సభ్యులు ఎస్కే. శౌకత్, గరిగె అరుణ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

భూబాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

జోనల్ కార్యాలయం ముందు రైతులతో కలిసి సిపిఎం నేతలు ధర్నా

మహేశ్వరం అక్టోబరు 30,: మహేశ్వరం మండలం తుక్కుగూడ జిహెచ్ఎంసి పరిధి రావిర్యాల, జన్నాయిగూడ గ్రామాలకు చెందిన రైతుల 827 ఎకరాల భూములకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఫ్యాబ్ సిటీ రైతులు శుక్రవారం టిజిఐఐసి జోనల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం పార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు. గత 22 సంవత్సరాల క్రితం తమ భూములను టిజిఐఐసి స్వాధీనం చేసుకుందని, ఇప్పటివరకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తీవ్ర అన్యాయమని మండిపడ్డారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు గతంలో 93 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు కూడా నిర్వహించారని గుర్తు చేశారు. ఆ సందర్భంగా టిజిఐఐసి అధికారులు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారని, అయితే హామీ ఇచ్చి రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన జోనల్ కార్యాలయ అధికారి జ్యోతి సైతం రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం బాధాకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సహనాన్ని పరీక్షించవద్దని, 22 ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమకు తక్షణమే న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని, అధికారులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మపురి విద్యార్థి ఎంపిక

ధర్మపురి, అక్టోబర్ 30, : రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మపురి విద్యార్థులు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధా నోపాధ్యాయులు కొలిచాల శ్రీనివాస్ తెలిపారు. ధర్మపురి మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ముసుకు విశాల్ శుక్రవారం జరిగిన ఎస్. జి .ఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అథ్లెటిక్స్ జవలిన్ త్రోలో రెండవ బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పల్లపు రమ్య డిస్కస్ త్రోలో రెండవ బహుమతి సాధించిందని వీరిద్దరూ కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొలిచాల శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ అటుకుల స్వప్న మరియు ఉపాధ్యాయులు విశాల్, రమ్య ని వారు అభినందించారు.

మూసివేసిన రోడ్డును వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌కు వినతి

కూకట్‌పల్లి అక్టోబర్ 30 : గత కొంతకాలంగా కూకట్ పల్లి నియోజకవర్గం కైతలాపూర్ 15 ఫేసులోని చిత్తరమ్మ గుడి, రెయిన్బో వైన్స్ వెనకాల రోడ్డు మూసివేయడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురఅవుతున్నారని యూత్ కాంగ్రెస్ సెక్రటరీ జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ శుక్రవారం కూకట్ పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, కూకట్ పల్లి డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు లను కలిసి అక్కడి సమస్య గురించి వివరించి మూసివేసిన రోడ్డును వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు. దీని పై స్పందించిన అధికారులు వెంటనే అక్కడికి అధికారులను పంపి వివరాలు సేకరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డును తెరిపిస్తామని హామీ ఇచ్చినట్లు జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ తెలిపారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30: రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని పీవిఆర్ గార్డెన్స్ లో ఏదులాపురం మునిసిపాలిటీ లోని 176 మంది లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదవారి ఒక స్లాబ్ ఇళ్లలో ఉండాలనే కల, ఆశ ఏదైతే ఉందో అది నెరవేర్చాలనే తపనతో ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు ఇవ్వడం జరిగిందని, హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో మరో లక్ష ఇళ్లు, ఇవన్నీ కలిపి ఈ రెండు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లు 40 వేల కోట్ల రూపాయలతో కట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం వంద శాతం పేదోళ్ల మనసును దోచిన, మెచ్చినదని, అర్హులైన ప్రతి పేదవాడికి కులం, మతం, పార్టీ అని చూడకుండా, పూర్తిగా పేదల సంక్షేమమే ధ్యేయంగా అమలు చేయబడుతోందని మంత్రి స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు లో మియాపూర్ కు సంబంధించి 560 ఎకరాల భూమి వివాదంలో ప్రయివేటు వ్యక్తులకు అప్పటి ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తే, అప్పటి పార్లమెంట్ సభ్యుడిగా, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టులో న్యాయమైన వాదనలు పెట్టి ఆ కేసు గెలిచామని తెలిపారు. ప్రతి ఆడబిడ్డకు రూ. 5 లక్షల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని గావు కేకలు పెట్టినా, ఎన్ని పొర్లు దండాలు పెట్టినా, ఎన్ని క్షుద్ర పూజలు చేసినా ప్రజా ప్రభుత్వం మళ్లీ ప్రజల దీవెనలతో అధికారంలోకి వస్తుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఏదులాపురం మునిసిపాలిటీ కి మొదటి విడతలో దాదాపు 467 ఇళ్లు మంజూరు కాగా, ఇందులో దాదాపు 400 వరకు ఇళ్లు నిర్మాణం పూర్తై లబ్ధదారులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. మరో 45 ఇళ్లు మాత్రమే వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయని, కొన్ని నెలల క్రితం శాంక్షన్ వచ్చిన 18 మంది లబ్ధదారులు కూడా వేగంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. లబ్ధదారులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఇండ్ల నిర్మాణం స్టేజి పూర్తి కాగానే ఫోటోలు తీసుకుని, కేవలం వారం పది రోజుల్లోనే బిల్లులు చెల్లించడం వల్ల లబ్ధదారులు ఎంతో త్వరగా ఇళ్లను నిర్మించుకోగలిగారన్నారు. మొదటి విడత విజయవంతమైన నేపథ్యంలో, ఇప్పుడు రెండో విడత కింద 176 ఇళ్లను లబ్ధదారులకు అందజేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ రెండో విడత ఇళ్ల నిర్మాణాలను కూడా అతి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి

ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 30: ప్రజా ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి, ప్రోత్సహిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి సత్తుపల్లి పట్టణంలో రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన ప్రతిష్టాత్మక ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ కార్యక్రమాలతో పాటు క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేలా నూతన స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చి, ఫోర్త్ సిటీ లో అద్భుతమైన స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్రీడలపై ఆసక్తి చూపే యువతీ యువకులను ప్రోత్సహించేందుకు, పతకాలు సాధించిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం, ప్రోత్సాహకాలు అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ విద్య, వైద్యం, క్రీడా రంగాల్లో తెలంగాణను ప్రపంచ స్థాయిలో ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. సత్తుపల్లి ఇండోర్ స్టేడియం సాధన కోసం పదే పదే కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌ను, వారి సేవలను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. సత్తుపల్లి నియోజకవర్గం రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిచే మొదటి నియోజకవర్గంగా నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, సత్తుపల్లి అభివృద్ధికి మంత్రి అందిస్తున్న సహకారం, తోడ్పాటు ఎంతో అమూల్యమని అన్నారు. భవిష్యత్తులోనూ ఆయన నాయకత్వంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి టీ. సునీల్ రెడ్డి, సత్తుపల్లి మునిసిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్ పాషా, కమీషనర్ నర్సింహా, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మరణంలోనూ మానవత్వం.. ఇద్దరికి చూపునిచ్చిన రాజేశ్వరి

● విషాదంలోనూ తల్లి చివరి కోరికకు కుటుంబ సభ్యుల పెద్ద మనసు ● నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించిన ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ సిబ్బంది ● అభినందించిన కార్పొరేటర్లు, సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ● పాడెమోసిన కార్పొరేటర్లు

గోదావరిఖని టౌన్ : తాను మరణించినా.. మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపారు ఆమె. కన్నుమూసిన తల్లి నేత్రాలను దానం చేసి, ఆమె చూపును సజీవంగా ఉంచారు కుటుంబ సభ్యులు. పలువురికి ఆదర్శంగా నిలిచిన ఈ ఘటన పెద్దపల్లి జిల్లా గోదావరిఖని తిలక్‌నగర్‌లో చోటుచేసుకుంది. అవగాహన కల్పించిన కార్పొరేటర్లు... స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షుడు, సోషల్ మీడియా వారియర్ నంది వెంకటేష్ తల్లి రాజేశ్వరి (51) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు మృతురాలి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ ఎండీ. ముస్తఫా ద్వారా కార్పొరేటర్ గట్ల రమేష్ నేత్రదానం ప్రాముఖ్యతను వివరించారు. ఆమె నేత్రాలను దానం చేస్తే ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చని తెలిపారు. దీంతో స్పందించిన కుమారుడు వెంకటేష్ కుటుంబ సభ్యులను ఒప్పించి తల్లి నేత్రాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. శుక్రవారం సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ నేత్రాలను సేకరించారు. అనంతరం వాటిని భద్రపరిచి హైదరాబాద్‌కు తరలించారు. అభినందించిన సదాశయ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు... కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు సానా రామకృష్ణారెడ్డి, నూక రమేష్, లగిశెట్టి చంద్రమౌళి, భీష్మాచారి, వెల్దీ కవిత, అనంతరాములు, కే.ఎస్. వాసు, ధీటి వెంకటస్వామి, శశికళ, జ్యోతి, అన్నపూర్ణ, గోలివాడ చంద్రకళతో పాటు లయన్స్ క్లబ్ ప్రతినిధులు ముద్దసాని ప్రమోద్ కుమార్ రెడ్డి, పి. మల్లికార్జున్, కే. రాజేందర్, బంక రామస్వామి, కొదాటి ప్రవీణ్ తదితరులు అభినందించారు.

హోమీ జే బాబా సేవలు చిరస్మరణీయం

● భారత అణుశక్తి రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు

మేడ్చల్, అక్టోబర్ 30: భారత అణుశక్తి రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు డాక్టర్ హోమీ జే బాబా అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. హోమీ జే బాబా 117వ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈఎస్ఐఆర్ నగర్‌లోని డాక్టర్ హోమీ జే బాబా ఫంక్షన్ హాల్ వద్ద సంస్మరణ సభ నిర్వహించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ఎన్ఎఫ్‌సీ సీనియర్ నాయకులు ఉదయభాస్కర్ హాజరై హోమీ జే బాబా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ స్వావలంబన కోసం హోమీ జే బాబా తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకు వినియోగించడంతో పాటు భౌతికశాస్త్రం, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన కృషితోనే అణుశక్తి రంగంలో కీలకమైన ఎన్ఎఫ్‌సీ, ఈసీఐఎల్ వంటి సంస్థల ఏర్పాటుకు మార్గం సుగమమైందని, ఈ సంస్థల వల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని అన్నారు. స్ఫూర్తి గ్రూప్ సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ లండన్‌లో ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ హోమీ జే బాబా తన ప్రతిభాపాటవాలను దేశ అభివృద్ధికే వినియోగించారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేశారని చెప్పారు. డాక్టర్ ఏఎస్ రావు హోమీ జే బాబాను తన గురువుగా భావించేవారని గుర్తుచేశారు. విజ్ఞానశాస్త్రంతో పాటు కళలపై కూడా ఆయనకు విశేష ఆసక్తి ఉండేదని, విజ్ఞాన ఫలాలు సామాన్య ప్రజలకు అందాలనే దూరదృష్టి కలిగిన మహనీయుడని కొనియాడారు. హోమీ జే బాబా మరణంపై పలు అనుమానాలు, కుట్ర ఆరోపణలు ఉన్నాయని ప్రస్తావించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ దేశానికి అమూల్యమైన సేవలందించిన హోమీ జే బాబాకు భారతరత్న పురస్కారం ప్రకటించాలని కోరారు. ఈసీఐఎల్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఏఎస్ రావు సైతం హోమీ జే బాబాకు భారతరత్న లభించకపోవడంపై విచారం వ్యక్తం చేసేవారని గుర్తుచేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, సభకు హాజరైన ప్రముఖులు హోమీ జే బాబా విగ్రహానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అమర్ రహే డాక్టర్ హోమీ జే బాబా అంటూ నినాదాలు చేశారు. స్ఫూర్తి గ్రూప్ నాయకులు జి. శివరామకృష్ణ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, చల్లా లీలావతి, శారద, శ్రావణ్ కుమార్, బాలు, ప్రభాకర్, వెంకటేశ్వరరావు, పాషా, సత్యనారాయణ, సదాశివ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బిఆరెస్‌లో చేరిన కాంగ్రెస్ బీజేపీ నాయకులు

ధర్మపురి, అక్టోబర్ 30, : ధర్మపురి మండలం లోని నేరెల్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు హైదరాబాద్ లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో శుక్రవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కాసారపు రాజా గౌడ్, మామిడిపెల్లి రాజయ్య, జంగిలి మహేష్, తీగల దుబ్బయ్య, కాసారపు సాంబయ్య, గుర్రం మొగిలి, తీగల తిరుపతి, కందుల మహేష్, ఇరుగదిండ్ల రఘుపతి, గొల్లపల్లి వెంకటేష్, దూలం మల్లేశ్, బత్తిని సతీష్, ఓరగంటి బాబులకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గులాబీ కండువాలు కప్పి, పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయిందని, కెసిఆర్ విధానాలు కొప్పుల ఈశ్వర్ నాయకత్వం పట్ల ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఅరెస్ పార్టీ నాయకులు గుంపుల రమేష్, కందుల మహేష్ తో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు హక్కును వినియోగించుకోవాలి: బీజేపీ నాయకులు

పెద్దఅడిశర్లపల్లి । అక్టోబర్ 30 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కేతావత్ లాలు నాయక్, దేవరకొండ ఎమ్మెల్సీ నియోజకవర్గ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం పీఏ పల్లి మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో వినిపించేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకమని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు నిర్ణీత గడువులోగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యావంతులు, నిరుద్యోగ యువత తమకు తెలిసిన అర్హులైన పట్టభద్రులకు కూడా ఓటు నమోదు ఆవశ్యకతను తెలియజేసి చైతన్యపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐటీ విభాగం కన్వీనర్ జెల్దా భాస్కర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతెం కరుణాకర్, నేరేడుగొమ్ము మండల అధ్యక్షుడు నాగిళ్ల ఆంజనేయులు, దేవరకొండ పట్టణ ప్రధాన కార్యదర్శి సముద్రాల సహదేవ్, పీఏ పల్లి మండల ప్రధాన కార్యదర్శి నామిరెడ్డి అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన

మేడ్చల్, అక్టోబర్ 30: నాచారం సర్కిల్ పరిధిలోని హెచ్ఎంటీ నగర్ డివిజన్ ఇంద్రానగర్‌లో ఉన్న ఇంద్ర హైస్కూల్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై ఎంటమాలజీ సిబ్బంది అవగాహన కల్పించారు. దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు వివరించారు. ఇళ్లల్లో ఉపయోగించకుండా పడేసిన పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, కొబ్బరి బోండాలు, పాత కూలర్లు తదితర వస్తువుల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. అలాంటి వస్తువులను ఇంటి పరిసరాల్లో పడేయకుండా చెత్త సేకరణ వాహనాలకు అందజేయాలని సూచించారు. దోమల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను అరికట్టవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్లు పరమేష్, మల్లేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ పనికి కానీ మనసుకు కాదు

కమాన్ పూర్ తహసిల్దార్ ముస్త్యాల వాసంతి

రామగిరి, అక్టోబర్ 30: పదవి విరమణ పనికే కానీ మనసుకు కాదని కమాన్ పూర్ తహసిల్దార్ ముస్త్యాల వాసంతి, ఎంపీడీవో సాదినేని ప్రియాంక అన్నారు. శుక్రవారం కమాన్ పూర్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వంగల భరత్ కుమార్ పదవీ విరమణ కార్యక్రమం ఎంఈఓ ఇల్లందుల విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. తహసిల్దార్ ముస్త్యాల వాసంతి, ఎంపీడీవో సాదినేని ప్రియాంక, ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వంగల భారత్ దంపతులను పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో విద్యార్థులకు విద్యాబోధన చేసి పలువురుని ఉన్నత శిఖరాలకు చేరవేర్చారని వారన్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులకు విడరాని హనుమంతం ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్క రామ్ కిషన్ రావు, ఆర్ యు పి పి సమీవుల్లా ఖాన్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జీవన్రాజు, ఉపాధ్యాయులు సత్తు కనకయ్య, గసిగంటి రమేష్, నాగరాజు, రమణారెడ్డి, సదానందం, సరళ దేవి, సంతోష్ కుమార్, శంషాద్దీన్, మామిడాల సత్యనారాయణ, పడాల సతీష్. తదితరులు పాల్గొన్నారు.

యజ్వేంద్ర చాహల్‌తో విడాకులపై స్పందించిన ధనశ్రీవర్మ..!



టీమిండియా క్రికెటర్ యజ్వేంద్ర చాహల్‌తో విడాకులపై ఆయన మాజీ భార్య, ప్రముఖ కొరియోగ్రాఫర్ ధనశ్రీ వర్మ తొలిసారిగా స్పందించారు. విడాకుల సమయంలో కోర్టులో ఎదుర్కొన్న మానసిక వేదనను, ఆ తర్వాత జరిగిన టీ-షర్ట్ వివాదాన్ని ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నారు. కోర్టులో తీర్పు వెలువరించే సమయంలో ఆమె తన భావోద్వేగాలను కంట్రోల్ చేయలేక, అందరితో కలిసి కన్నీళ్లు పెట్టుకున్నట్లు ఆమె తెలిపారు. మంగళవారం 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పాడ్‌కాస్ట్‌లో ధనశ్రీ మాట్లాడింది. 'విడాకుల రోజున మేమిద్దరం కూడా మానసికంగా సిద్ధమయ్యే ప్రయత్నం చేసాం. కానీ, తీర్పు ఇవ్వబోతున్నప్పుడు, నా భావోద్వేగాలను అదుపు చేయలేకపోయాను. ఆ క్షణంలో నేను ఎంత బాధపడుతానో చెప్పలేక ఒక రకంగా ఏడ్చేశాను. ఆ తర్వాత చాహల్ అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయారు' అని చెప్పింది. విడాకుల సమయంలో చాహల్ ధరించిన 'బీ యువర్ ఓన్ షుగర్ డాడీ' అని రాసి ఉన్న టీ-షర్ట్ పెద్ద వివాదాన్ని రేపింది. దీనిపై ధనశ్రీ స్పందిస్తూ 'ఈ విషయంలో ప్రజలు నన్నే నిందిస్తారని మేం ముందే ఊహించాం. టీ-షర్ట్ గురించి తెలిసేలోపే.. నాపై నిందలు మోపుతారనే అభిప్రాయం ఏర్పడింది' అని తెలిపింది. కోర్టు నుంచి బయటకు వచ్చిన తర్వాత చాహల్ టీ-షర్ట్‌కి సంబంధించిన వీడియోలను చూసి ఆమె ఆశ్చర్యపోయానని చెబుతూ.. 'అరే, వాట్సాప్‌లో చెప్పొచ్చు కదా! అలా ఎందుకు వేసుకున్నాడో?' అని ఆమె వ్యాఖ్యానించారు. ఇలాంటి సున్నితమైన విషయాలను ఎంతో పరిపక్వతతో చూసుకోవాలని భావించానని అన్నారు. 'ప్రజలను ఆకట్టుకోవడం కోసం అనాలోచిత వ్యాఖ్యలు చేయడం నాకు ఇష్టం లేదు. మా కుటుంబ విలువలను, అతని కుటుంబ గౌరవాన్ని కాపాడాలనే భావనతోనే అలా స్పందించాను' అని పేర్కొన్నారు. సమాజంలో మహిళల పరిస్థితిని వివరిస్తూ 'మహిళగా, బంధాన్ని నిలబెట్టుకోవాలని, అన్నింటినీ మినహాయించుకొని జీవనం సాగించాలని మనం నేర్చుకుంటాం. మన తల్లులు ఎంతో గౌరవంగా ఆ మాటలు చెప్పినట్లయితే, అది నిజమే' అని తెలిపారు. పెళ్లి బంధంలో ఉన్నప్పుడు, తన భర్త చాహల్‌కు తాను అండగా నిలిచానని, చిన్న చిన్న విషయాల నుంచి పెద్ద విషయాల వరకు అతనితో అంగీకారంగా ఉంటూ ఎప్పుడూ కృషి చేశానని ధనశ్రీ గుర్తు చేసుకున్నారు. చాహల్, ధనశ్రీ వర్మ 2020లో వివాహం చేసుకున్న తర్వాత ఐదేళ్ల వివాహ బంధం ముగియడంతో ఈ విడాకులు తీసుకున్న విషయం ఇటీవల వార్తల్లో నిలిచింది.

రోకో లేకుండానే భారత జట్టు.. 1

7 ఏళ్లలో ఇదే తొలిసారి..! 2008 నుంచి ఇప్పటి వరకు టీమ్ ఇదే.. ఆసియా కప్ టోర్నీ వచ్చే నెలలో మొదలుకానున్నది. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు టీ20 ఫార్మాట్‌లో జరుగనుండగా.. అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా భారత్-పాకిస్తాన్ మధ్య జరిగే హైవోల్టేజ్ మ్యాచ్ కోసం నిరీక్షిస్తున్నారు. టోర్నమెంట్ షెడ్యూల్ ప్రకారం ఈ మ్యాచ్ సెప్టెంబర్ 14న దుబాయ్‌లో జరగనుంది. అయితే, భారత జట్టు ఈ మ్యాచ్ ఆడుతుందో.. లేదో ఇంకా స్పష్టత రాలేదు. అదే సమయంలో, సెప్టెంబర్ 10న యుఏఈతో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది. 2008 తర్వాత భారత జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ పేరు లేకపోవడం ఇదే మొదటిసారి. 17 సంవత్సరాల తర్వాత వారిద్దరు లేకుండానే జట్టు ఈ టోర్నమెంట్ ఆడనుంది. 2008 నుంచి ఇప్పటి వరకు భారత జట్టు ఎంతగా మారిపోయిందో ఓ లుక్కేద్దాం రండి..!

2008లో కెప్టెన్ ఎంఎస్ ధోనీ.. రోహిత్‌కు ఇదే తొలి ఆసియా కప్..

2008లో ఆడిన ఆసియా కప్‌లో మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్‌గా ఉన్నాడు. ఇది రోహిత్ శర్మకు తొలి ఆసియా కప్. ఆ ఎడిషన్‌లో విరాట్ జట్టులో లేడు. యువరాజ్ సింగ్ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. వన్డే ఫార్మాట్‌లో ఆడిన ఆ ఎడిషన్‌లో, టీమ్ ఇండియా ఫైనల్‌కు చేరుకుంది. అయితే, శ్రీలంక చేతిలో 100 పరుగుల తేడాతో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. 2010లో వన్డే ఫార్మాట్‌లో ఆడిన ఆసియా కప్‌కు కూడా ధోనీ కెప్టెన్‌గా వ్యవహరించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరూ ఆ ఎడిషన్‌లో జట్టులో ఉన్నారు. అయితే, జట్టుకు ఎవరినీ వైస్ కెప్టెన్‌గా నియమించలేదు. 2010లో ఫైనల్‌లో శ్రీలంకను 81 పరుగుల తేడాతో ఓడించి భారత జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. 2012లో వన్డే ఫార్మాట్‌లో ఆడిన ఆసియా కప్‌లో ధోనీ కెప్టెన్‌గా ఉన్నాడు. విరాట్ కోహ్లీకి వైస్ కెప్టెన్సీ బాధ్యత అప్పగించారు. రోహిత్ శర్మ కూడా జట్టులో ఉన్నాడు. 2012లో సెమీ-ఫైనల్స్‌లో ఓడిపోవడంతో భారత జట్టు ఎలిమినేట్ అయ్యింది. ఫైనల్‌లో బంగ్లాదేశ్‌ను రెండు పరుగుల తేడాతో ఓడించి పాక్ టైటిల్ గెలిచింది.

ఆసియా కప్‌కు జైస్వాల్‌ను ఎంపిక చేయకపోవడం అన్యాయం

మాజీ స్పిన్నర్ ఆర్ అశ్విన్

ఆసియా కప్ 2025 కోసం భారత టీ20 జట్టును ప్రకటించిన తర్వాత, సెలక్షన్ కమిటీ నిర్ణయాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా, యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను జట్టులోకి ఎంపిక చేయకపోవడం టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు ఆశ్చర్యకరంగా ఉందని.. నిరాశ కలిగించిందని పేర్కొన్నాడు. జైస్వాల్‌ను ఇలా పక్కన పెట్టడం అన్యాయంగా అభిప్రాయపడ్డాడు. అద్భుతంగా ప్రదర్శిస్తున్న ఆటగాడికి ఇలాంటి అన్యాయం జరిగితే ఆటతీరును దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆయన తెలిపాడు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శుభ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా తీసుకుని జట్టులోకి తీసుకోగా.. జైస్వాల్‌ను జట్టు నుంచి తప్పించింది. ఈ నిర్ణయం పై అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పందించారు. 'జట్టు కోసం నిస్వార్థంగా ఆడే యువ ఆటగాడు జైస్వాల్. ఇలా తప్పించబడడం చాలా బాధాకరం.

చిక్కుల్లో పాకిస్తాన్ మాజీ కెప్టెన్..

వసిం అక్రమ్‌పై సైబర్ క్రైమ్ ఏజెన్సీకి ఫిర్యాదు..

పాకిస్తాన్ మాజీ కెప్టెన్ వసిం అక్రమ్ చిక్కుల్లో పడ్డాడు. గ్యాంబ్లింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌కు ప్రచారం చేస్తున్న మాజీ బౌలర్‌పై సైబర్ క్రైమ్ ఏజెన్సీకి ఫిర్యాదు చేశారు. జూదం, బెట్టింగ్ యాప్స్‌ను ప్రోత్సహిస్తున్న అక్రమ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ముహమ్మద్ ఫైజ్ లాహోర్‌లోని నేషన్ సైబర్ క్రైమ్ ఏజెన్సీ(%చీజజ×ూా%)కి ఫిర్యాదు చేశాడు. విదేశీ బెట్టింగ్ యాప్ 'బాజీ'తో అక్రమ్‌కు సంబంధం ఉందని ఫైజ్ ఆరోపించారు. పాకిస్తాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ ఈ బెట్టింగ్ యాప్ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నాడన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ అయిన పోస్టర్, వీడియో క్లిప్‌లో వసీం అక్రమ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌కు మద్దతు తెలుస్తోందని.. ఇది యాప్‌పై సాధారణ ప్రజల్లో ఆసక్తిని పెంచిందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ క్రైమ్స్ యాక్ట్ 2016 కింద అక్రమ్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫైజ్ సైబర్ క్రైమ్ ఏజెన్సీకి విజ్ఞప్తి చేశాడు. ఇదిలా ఉండగా.. భారత్‌లో బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన పలువురు సెలబ్రిటీలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రశ్నిస్తున్నది. అక్రమ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన అనేక కేసులను ఏజెన్సీ దర్యాప్తు చేస్తోంది. చాలామంది పెట్టుబడిదారులను రూ.కోట్లల్లో మోసం చేయడం, పెద్ద మొత్తంలో పన్ను ఎగవేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఆ యాప్‌కు సంబంధించిన ప్రకటనల్లో పాల్గొన్న వ్యక్తులు, ముఖ్యంగా సినీతారలు, క్రికెటర్లపై ఈడీ చర్యలు చేపడుతున్నది. ఈ కేసులో ఈడీ చాలా మంది నటీనటులు, ప్లేయర్స్‌ను ప్రశ్నించింది. ఈ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్ ప్రజల నుంచి డబ్బును దోచుకుంటున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లు తమను తాము నాలెడ్జ్ ఆధారిత గేమింగ్‌గా చూపించుకుంటాయని, కానీ నకిలీ అల్గారిథమ్‌ల ద్వారా అక్రమ బెట్టింగ్‌ను ప్రోత్సహిస్తాయని దర్యాప్తులో వెల్లడైంది.

మను భాకర్‌కు కాంస్యం.. ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్

షిమ్కెంట్(కజకిస్థాన్): ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. పోటీల రెండో రోజైన మంగళవారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో డబుల్ ఒలింపియన్ మను భాకర్ కాంస్య పతకంతో మెరిసింది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన ఫైనల్లో మను భాకర్ 219.7 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో క్వియాన్కె మా(చైనా, 243.2), జిన్ యాంగ్(కొరియా, 241.6) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. మహిళల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లోనూ మను భాకర్(583), పాలక్(573), సురుచిసింగ్(574)తో కూడిన భారత త్రయం కాంస్యం ఖాతాలో వేసుకుంది. మరోవైపు మహిళల జూనియర్ పిస్టల్ ఈవెంట్‌లో యువ షూటర్ రశ్మిక సెహగల్ 241.9 పాయింట్లతో స్వర్ణంతో మెరిసింది. అదే దూకుడు కొనసాగిస్తూ టీమ్‌ఈవెంట్‌లోనూ రశ్మిక(582), వంశిక చౌదరీ (573), మోహిని సింగ్(565)త్రయం పసిడి కైవసం చేసుకుంది. టోర్నీలో ఇప్పటి వరకు భారత్ ఐదు స్వర్ణాలు సహా రెండు రజతాలు, నాలుగు కాంస్య పతకాలతో కొనసాగుతున్నది.

ఆసియా కప్‌లో శ్రేయాస్ అయ్యర్‌కు దక్కని చోటు..

అసంతృప్తిని వ్యక్తం చేసిన అభిషేక్ నాయర్

వచ్చే నెలలో యూఏఈ వేదికగా జరుగనున్న ఆసియా కప్ కోసం బీసీసీఐ జట్టును ప్రకటించింది. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులో చోటు కల్పించకపోవడంపై అందరినీ ఆశ్చర్యపరిచింది. ఛాంపియన్స్ ట్రోఫీలో సత్తా చాటిన, ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్ వరకు నడిపించిన అయ్యర్‌కు 15 మంది సభ్యుల జట్టులోనే కాకుండా, ఐదుగురు స్టాండ్‌బై ఆటగాళ్ల జాబితాలో కూడా చోటు దక్కలేదు. దాంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే బీసీసీఐ నిర్ణయంపై టీమిండియా మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాడు. 'శ్రేయస్ అయ్యర్ లాంటి స్టార్ ఆటగాడు కనీసం రిజర్వ్ ఆటగాళ్ల జాబితాలో కూడా ఎలా లేడో నాకు అర్థం కావడం లేదు. అతడిని 20 మందితో కూడిన జట్టులో ఎందుకు తీసుకోలేదో తెలియడం లేదు. ఈ నిర్ణయం అతనికి జట్టులో ప్రాధాన్యత ఇవ్వడం లేదు అనే స్పష్టమైన సంకేతం ఇస్తుంది' అని పేర్కొన్నాడు. సెలక్షన్ అనేది కేవలం ఆటగాడి ప్రతిభను మాత్రమే కాకుండా, కొంతమంది వ్యక్తుల ఇష్టాలకు ఆధారపడి ఉండవచ్చని నాయర్ వ్యాఖ్యానించాడు. అయితే, జట్టులో చోటు కల్పించకపోవడంపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పందించారు. 'శ్రేయస్ తప్పేమీ లేదు. తాము కేవలం 15 మందిని మాత్రమే ఎంపిక చేయగలం. ప్రస్తుతానికి అతను తన అవకాశం కోసం ఎదురు చూడాల్సిందే' అని కామెంట్ చేశాడు. అలాగే, అభిషేక్ శర్మ బౌలింగ్ చేయగల సామర్థ్యం ఉన్న ఆటగాడు కావడంతో యశస్వి జైస్వాల్ వంటి ఆటగాడిని పక్కన పెట్టడం అనివార్యమైందని అగార్కర్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ 17 మ్యాచ్‌లలో 175.07 స్ట్రయిక్ రేట్‌తో 604 పరుగులు చేసి, అత్యధిక స్కోరర్ చేసిన ఆరో ప్లేయర్‌గా నిలిచాడు. ఫుల్ ఫామ్‌లో ఉన్న ఆటగాడిని కీలకమైన టోర్నమెంట్‌కు ఎంపిక చేయకపోవడంపై క్రీడా వర్గాల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విశ్వజి

ఇలా కాపాడుకోండి

సాధారణంగానే మహిళల్లో పోషకాహర లోపం ఎక్కువగా కనిపిస్తుంది. అది ఎప్పుడూ వివిధరకాల సమస్యలకు కారణమవుతూనే ఉంటుంది. పోషకాల్లో ఒక్కో విటమిన్ ఒక్కో అవయవానికి మేలు చేస్తుంది. అందువల్ల అన్ని పోషకాలు మనిషికి అవసరమే. దాంట్లో విటమిన్-డి అనేది ఎముకల ఆరోగ్యానికి చాలా ముఖ్యం. విటమిన్-డి లోపిస్తే ఎముకలు బలహీనపడి 'ఆస్టియోమలాషియా' సమస్య వస్తుంది. అంతేకాదు, ఇది ఇలాగే కొనసాగితే దీర్ఘకాలంలో ఆస్టియోపొరోసిస్ సమస్యకు దారితీసి.. ఎముకలు గుల్లబారుతాయి. చిన్న గాయం కావడంతోనే విరిగిపోతుంటాయి. ఈ సమస్యలు పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం, విటమిన్-డి లోపం వల్ల మహిళల్లో తీవ్రమైన సమస్యలు వస్తాయట. నడి వయసు దాటిన మహిళల్లో మెనోపాజ్ తర్వాత ఈస్ట్రోజన్ హార్మోన్ తక్కువగా ఉంటుంది. ఫలితంగా ఎముకలు పటుత్వం కోల్పోతూ ఉంటాయి. ఇదే కాకుండా జీవనశైలిలో మార్పుల వల్ల కూడా మహిళల్లో విటమిన్-డి లోపిస్తుంది. ఫలితంగా అలసట, కండరాల బలహీనత, ఎముకల్లో నొప్పి (ముఖ్యంగా నడుము, కాళ్లు), డిప్రెషన్, రోగనిరోధక శక్తి తగ్గి తరచూ జలుబు, జ్వరం రావడం, జుట్టు రాలడం, గాయాలు త్వరగా తగ్గకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. విటమిన్-డి లోపించకూడదు అంటే.. ప్రతిరోజూ ఉదయం కొంతసేపు శరీరానికి సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. రోజూ కాకపోయినా రెండు రోజులకు ఒకసారి 15-30 నిమిషాలు సూర్యోదయం వేళ ఎండలో కూర్చుంటే మంచిది. అలాగే తినే ఆహారంలో విటమిన్-డి ఉండే ఫ్యాటీ ఫిష్ (సాల్మన్), గుడ్డు పచ్చసొన, ఫోర్టిఫైడ్ పాలు, పప్పు ధాన్యాలు తీసుకోవాలి. యూవీ కిరణాలు పడేచోట సాగు చేసిన పుట్టగొడుగుల్లో కూడా విటమిన్-డి ఉంటుంది. వీటితో పాటు 50 ఏళ్లు దాటిన మహిళలు వైద్యులను సంప్రదించి విటమిన్ సప్లిమెంట్లు తీసుకోవాలి. వీటితో పాటు క్యాల్షియం పుష్కలంగా ఉండే ఆహారం తీసుకుంటూ, బరువులతో కూడిన వ్యాయామం చేయడం ద్వారా విటమిన్-డి లోపాన్ని ఎదుర్కోవచ్చు.



ఈ ఆసనాలతో డయాబెటిస్ ముప్పు దూరం - ఎన్నో ఫలితాలు..!!

యోగా. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతకు తోడ్పడుతుంది. దీర్ఘ కాలిక రోగాలకు పరిష్కారం చూపుతోంది. నిత్యం యోగా చేయటం ద్వారా షుగరు వంటి సమస్యలు నియంత్రణలో ఉంటాయి. డయాబెటీస్ ఒకసారి వచ్చిందంటే నయమయ్యేది కాదు. డయాబెటీస్ కు యోగా ఎంతగానో తోడ్పడుతున్నట్లు రిసెర్చ్ లు వెల్లడించాయి. యోగాలోని ఆసనాలతో షుగరు తో పాటుగా అనారోగ్య సమస్యలు ఎన్నో దూరం అవుతాయి. డయాబెటీస్ రావటానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో మానసిక ఒత్తిడీ ప్రధాన కారణంగా ఉంది దీంతో సింపథెటిక్ నాడీ వ్యవస్థ, అడ్రినల్ గ్రంథి ఉత్తేజితమై రక్తంలోకి గ్లూకోజు ఎక్కువగా విడుదలవుతుందని, కణాల్లోకి గ్లూకోజు వెళ్లేలా చేసే ఇన్సులిన్ హార్మోన్ పనితీరు అస్తవ్యస్తం గా మారుతుంది. ఈ క్రమంలో క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతకు తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆసనాలతో కండరాలకు రక్త సరఫరా పెరుగుతుందని, అంతేకాకుండా ఇన్సులిన్ గ్రాహకాల వ్యక్తీకరణ ఇనుమడించటం వల్ల గ్లూకోజును బాగా స్వీకరిస్తాయి. ప్రాణాయామం, ధ్యానం వంటి వాటితో మానసిక ప్రశాంతత చేకూరుతుంది. యోగాలో ధ్యానంతో పాటుగా ఎన్నో రకాల ఆసనాలు శరీరానికి మేలు చేస్తాయి. యోగాలో వేసే త్రికోణాసనం షుగరు వ్యాధి గ్రస్తులకు ప్రయోజన కరంగా ఉంటుంది. అదే విధంగా చక్రాసనం ఆరు సార్లు చేయటం ద్వారా మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. పది నిమిషాల పాటు శవాసనం అవసరం. ఇందులో ప్రశాంతంగా వెల్లకిలా పడుకోవాలి. కళ్లు మూసుకొని పాదాల దగ్గర నుంచి తల వరకూ ఒక్కొ అవయవం మీద దృష్టి సారిస్తూ అవన్నీ బాగా విశ్రాంతి పొందుతున్నట్లు భావించాలి. ఇక.. సూర్య నమస్కారాలు 12 దశల్లో చేయాలి. సూర్య నమస్కారాల్లో ప్రణామ, హస్తోత్థావ,

హస్తపాద, అశ్వసంచాలన, దండ, అష్టాంగ నమస్కార, భుజంగ, అదోముఖస్వాన, అశ్వ సంచాలన, హస్తపాద, హస్తోత్థావ, ప్రణామ ఆసనాలను ఒక క్రమపద్ధతిలో చేయాలి. అర్ధమత్స్యేంద్రాసనం, పవన ముక్తాసనం, భుజంగాసనం, పాదచక్రాసనం, ధనురాసం వంటివి చేయటం ద్వారా శరీరానికి ఆరోగ్య పరమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఇక 5 సార్లు భస్త్రిక చేయాలి. ఇందులో నాలుగు సార్లు శ్వాసను వీలైనంత వేగంగా తీసుకొని, వదిలిపెట్టాలి. ఆ తర్వాత ఒకసారి గాఢంగా శ్వాస తీసుకొని, నెమ్మదిగా వదలాలి. ఇలా ప్రతీ ఆసనం.. భంగిమ శరీరంలో ఒక్కో అవయవానికి మేలు చేస్తుంది.

రోజూ అసలు ఎన్ని జామకాయలను తినాలి..?

వీటి వల్ల కలిగే లాభాలు ఏమిటి..?

జామకాయలు అంటే చాలా మంది ఇష్టంగానే తింటారు. కొందరు జామకాయలను తింటే కొందరు జామ పండ్లను తినేందుకు ఆసక్తిని చూపిస్తారు. జామకాయలు కొద్దిగా దోరగా, పులుపు, తీపి రుచుల కలయికలో ఉంటాయి. జామ పండ్లు తియ్యగా ఉంటాయి. జామ కాయలను లేదా పండ్లను వేటిని తిన్నా ఆరోగ్యకరమైన ప్రయోజనాలే కలుగుతాయి. జామకాయలను తినడం వల్ల లాభాలు కలుగుతాయని చాలా మందికి తెలుసు. కానీ రోజుకు ఎంత మోతాదులో వీటిని తినాలి.. అని చాలా మంది సందేహిస్తుంటారు. అయితే ఇందుకు పోషకాహార నిపుణులు ఏమని సమాధానం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. 100 గ్రాముల జామ కాయలు లేదా పండ్లను రోజూ తినవచ్చు. అంతకు మించితే జీర్ణ సమస్యలు వస్తాయి. ఇక జామకాయలను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. అనేక పోషకాలు మన శరీరానికి లభిస్తాయి. డయాబెటిస్ ఉన్నవారికి.. జామకాయలు లేదా పండ్లను పోషకాలకు నెలవుగా చెప్పవచ్చు. వీటిల్లో మన శరీరానికి కావల్సిన అనేక విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల వీటిని తింటే పోషకాహార లోపం తగ్గుతుంది. ఈ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను తగ్గేలా చేస్తుంది. రోగాలు రాకుండా చూస్తుంది. జామ పండ్లను తినడం వల్ల ఫైబర్ అధికంగా లభిస్తుంది. దీని వల్ల పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. దీంతో మలబద్ధకం తగ్గుతుంది. షుగర్ ఉన్నవారికి జామ కాయలు ఎంతో మేలు చేస్తాయి. వీటిని తింటే షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. ఈ కాయల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగవు. పైగా ఈ కాయల్లో ఉండే ఫైబర్, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. అందువల్ల జామకాయలను తరచూ తింటుంటే డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. గుండె ఆరోగ్యానికి.. జామకాయల్లో పొటాషియం, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి బీపీని నియంత్రిస్తాయి. రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. ఈ కాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న కారణంగా వీటిని తింటే చర్మం సంరక్షించబడుతుంది. సూర్యకాంతి నుంచి చర్మం సురక్షితంగా ఉంటుంది. ఆక్సీకిరణ ఒత్తిడి తగ్గిపోతుంది. ఫలితంగా వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మం యవ్వనంగా మారి కాంతివంతంగా కనిపిస్తుంది. జామకాయల్లో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ కాయలను తింటే గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. పేగుల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. రోగ నిరోధక వ్యవస్థకు.. జామకాయలను తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. జామకాయలను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. జామ కాయల్లో తెలుపు, పింక్ రంగులో ఉండే కాయలు ఉంటాయి. అయితే పింక్ రంగులో ఉండే కాయలను తింటే విటమిన్ ఎ అధికంగా లభిస్తుంది. ఇది కంటి చూపును మెరుగు పరచడంతోపాటు రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇలా జామ కాయలు లేదా పండ్లను రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

మార్కెట్

బ్యాంకులకు ఆ స్వేచ్ఛ ఉన్నది

కనీస నగదు నిల్వల పెంపుపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

గోజారియా(గుజరాత్) : బ్యాంకు ఖాతాల్లో కనీస నగదు నిల్వలపై రిజర్వు బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. మినిమమ్ బ్యాలెన్స్ ఎంత ఉండాలనేది పూర్తిగా బ్యాంకుల నిర్ణయమని, దీనిపై రిజర్వు బ్యాంక్ నియంత్రణ ఏదీ ఉండదని స్పష్టంచేశారు. కనీస బ్యాలెన్స్ పరిమితిని ఐసీఐసీఐ బ్యాంక్ గరిష్ఠంగా రూ.50 వేల వరకు పెంచిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్న ప్రస్తుత తరుణంలో ఆయన పై విధంగా స్పందించారు. కనీస బ్యాలెన్స్ ఎంత ఉండాలనే నిర్ణయం ఆర్బీఐ బ్యాంకులకే వదిలేసింది. కొన్ని బ్యాంకులు రూ.10 వేలు, మరికొన్ని బ్యాంకులు రూ.2 వేలుగా నిర్ణయిస్తుంటాయి. ఇటీవల ఐసీఐసీఐ బ్యాంక్ తన పొదుపు ఖాతాల్లో నగదు నిల్వలను ఐదింతలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో రూ.10 వేలుగా ఉన్న కనీస నగదు నిల్వలను రూ.50 వేలకు పెంచింది. కానీ, కొన్ని ప్రభుత్వరంగ బ్యాంకులు కనీస నగదు నిల్వలపై పరిమితులను ఎత్తివేశాయి. యువతకు డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత చాలా కీలకమన్నారు. మునుపు చదువుకోకపోతే అభివృద్ధి చెందరని చెప్పేవారు.. కానీ నేటి యుగంలో డిజిటల్ అక్షరాస్యత విషయంలోనూ ఇదే పరిస్థితి అన్నారు.

అమెరికా-చైనా మధ్య ట్రేడ్ డీల్‌కు మరో 90 రోజులు విరామం

రష్యా చమురు కొనుగోలును కారణంగా చూపి భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీస్థాయిలో ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే. న్యూఢిల్లీపై ఏకంగా 50 శాతం సుంకాలు విధించారు. ప్రస్తుతం 25 శాతం టారిఫ్ అమల్లోకి వచ్చింది. ఆగస్టు 27 నుంచి మిగతా 25 శాతం టారిఫ్ అమలులోకి రానుంది. అయితే, రష్యా చమురు కొనుగోలు చేస్తున్న చైనా విషయంలో మాత్రం ట్రంప్ భిన్నవైఖరితో ముందుకెళ్తున్నారు. డ్రాగన్‌పై ఎలాంటి టారిఫ్‌లు బాదడం లేదు. తొలుత చైనాపై భారీగా టారిఫ్‌ల బాంబ్ పేల్చిన ట్రంప్.. ఆ తర్వాత వెనక్కి తగ్గారు. ఇప్పుడు చైనాతో వాణిజ్య ఒప్పందానికి మరో 90 రోజుల విరామం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. వాణిజ్య ఒప్పందం చర్చల గడువును పొడిగించినట్లు చైనా కూడా తన అధికారిక మీడియాలో పేర్కొంది. రెండు దేశాలూ ఇటీవలే పోటాపోటీగా సుంకాలు విధించుకున్న విషయం తెలిసిందే. చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై 145 శాతం టారిఫ్‌లు విధించనున్నట్లు ట్రంప్ ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించారు. ఇక చైనా సైతం అమెరికాపై 125 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ ఏడాది మేలో అమెరికా, చైనా మధ్య కీలక ట్రేడ్ డీల్ కుదిరింది. ఇరుదేశాలు సుంకాలను భారీగా తగ్గించేందుకు ఓ అంగీకారానికి వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం.. అమెరికా దిగుమతులపై చైనా సుంకాలను 125 నుంచి 10 శాతానికి తగ్గించింది. మరోవైపు చైనా దిగుమతులపై అమెరికా సుంకాలను 145 నుంచి 30 శాతానికి తగ్గించింది. ఈ తగ్గింపు 90 రోజులు మాత్రమే అమల్లో ఉండేలా ఇరు దేశాలూ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆ ఒప్పందం మంగళవారం అర్ధరాత్రితో ముగియనుంది. దీంతో ట్రంప్ తాజాగా డ్రాగన్‌తో వాణిజ్య ఒప్పందానికి మరో 90 రోజుల విరామం ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనాపై ప్రతీకార సుంకాలు విధించాలా? వద్దా? అనే అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్? పేర్కొన్నారు. ఎందుకంటే, రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంతో సంబంధం లేని, అనేక అంశాలు అమెరికా-చైనా సంబంధాలను ప్రభావితం చేస్తాయని ఆయన అన్నారు.

భారీగా తగ్గిన పుత్తడి.. రూ.900 దిగిన తులం ధర

న్యూఢిల్లీ, ఆగస్టు 11 : రికార్డు స్థాయికి చేరుకున్న బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు భారీగా పడిపోవడంతో దేశీయంగా తులం ధర రూ.900 దిగొచ్చింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల ధర రూ.1,02,520కి దిగొచ్చింది. రాజకీయ అనిశ్చిత పరిస్థితులు తగ్గుముఖం పట్టడం, స్టాకిస్టులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో ధరలు తగ్గుముఖం పట్టాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన తులం ధర రూ.900 తగ్గి రూ.1,02,100గా నమోదైంది. గడిచిన ఐదు సెషన్లలో పుత్తడి ధర రూ.5,800 ఎగబాకిన విషయం తెలిసిందే. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ కలిగిన తులం బంగారం ధర రూ.760 తగ్గి రూ.1,02,280కి పరిమితమైంది. అంతకుముందు ఇది రూ.1,03,040గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర కూడా రూ.700 దిగొచ్చి రూ.1,02,280గా నమోదైంది. రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంపై ఒక కొలిక్కి వచ్చే అవకాశాలుండటంతో గ్లోబల్ మార్కెట్లో పుత్తడి ధరలు భారీగా తగ్గాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. పసిడితోపాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. కిలో వెండి రూ.1,000 తగ్గి రూ.1,14,000గా నమోదయ్యాయి.

చిత్తూరు రాజకీయాల్లో ఆసక్తికర పోరు!

తిరుపతి : తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విద్యార్థి దశ నుంచే పరిచయమైన రాజకీయ నాయకుల మధ్య మొదలైన పోటీ, కాలక్రమంలో చిత్తూరు జిల్లా రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి చేరింది. చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. ఈ ముగ్గురి రాజకీయ ప్రయాణాలు 1978 ఎన్నికలతో కొత్త మలుపు తిరిగాయి. అయితే, వీరిలో పెద్దిరెడ్డి ప్రస్థానం ప్రత్యేకంగా నిలుస్తుంది. తొలి ప్రయత్నాల్లో పరాజయాలు ఎదురైనా, వెనకడుగు వేయకుండా తన రాజకీయ బలాన్ని పెంచుకుంటూ ముందుకు సాగారు. మరోవైపు చంద్రబాబు నాయుడు 1983 ఎన్నికల్లో చంద్రగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరి కుప్పం నియోజకవర్గాన్ని తన రాజకీయ కంచుకోటగా మార్చుకున్నారు. ఇలా ఒకే కాలంలో రాజకీయాల్లోకి వచ్చిన నేతలు వేర్వేరు మార్గాల్లో ఎదిగినా, చిత్తూరు జిల్లా రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయ ప్రయాణం మాత్రం ఆరంభం నుంచే ఎత్తుపల్లాలతో సాగింది. 1978లో పీలేరు నియోజకవర్గం నుంచి జనతా పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆయనకు తొలి ఎన్నికల్లోనే ఓటమి ఎదురైంది. కాంగ్రెస్ అభ్యర్థి మొగల్ సైపుల్లాబేగ్ విజయం సాధించడంతో అసెంబ్లీలో అడుగుపెట్టాలన్న ఆయన ఆశ నెరవేరలేదు. ఆ తర్వాత 1981లో చౌడేపల్లె సమితి ఎన్నికల్లో పోటీ చేసినా కెళవాతి రామకృష్ణారెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. వరుస ఎదురుదెబ్బలు తగిలినా రాజకీయాలను విడిచిపెట్టకుండా తన ప్రయత్నాలను కొనసాగించారు. 1985 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పీలేరు నుంచి పోటీ చేసినప్పటికీ మరోసారి ఓటమి తప్పలేదు. వరుసగా ఎదురైన ఈ ఫలితాలు ఆయన రాజకీయ లక్ష్యానికి అడ్డుకట్ట వేయలేకపోయాయి. ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుంటూ, నియోజకవర్గంలో తన రాజకీయ పునాదులను బలోపేతం చేసుకోవడంపై దృష్టి పెట్టారు. 1989 ఎన్నికలు పెద్దిరెడ్డి రాజకీయ జీవితంలో కీలకమైన మలుపుగా నిలిచాయి. పీలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఆయన తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టారు. అయితే, ఆ విజయంతోనే ఆయనకు ఎదురులేని రాజకీయ ప్రస్థానం మొదలైందని చెప్పలేం. 1994 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జీవీ శ్రీనాథరెడ్డి చేతిలో ఓటమి ఎదురైంది. కానీ 1999 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి తిరిగి విజయం సాధించారు. ఈ దశ నుంచి పెద్దిరెడ్డి రాజకీయ వ్యూహాలు, స్థానిక సమీకరణాలు, ప్రత్యర్థుల బలాబలాలను అంచనా వేసే తీరుపై చిత్తూరు జిల్లా రాజకీయాల్లో చర్చ పెరిగింది. ఎన్నికల్లో గెలుపోటములు సహజమైనప్పటికీ, ఓటమి తర్వాత మళ్లీ పుంజుకోవడం ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రధాన లక్షణంగా కనిపించింది. పీలేరులో ఏర్పరచుకున్న పునాది, తదుపరి రాజకీయ ఎదుగుదలకు బాటలు వేసింది. కాలక్రమంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభావం పీలేరు రాజకీయాలకే పరిమితం కాలేదు. పుంగనూరు నియోజకవర్గంలో తన రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకుంటూ చిత్తూరు జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా ఎదిగారు. మరోవైపు చంద్రబాబు నాయుడు కుప్పం కేంద్రంగా తన పట్టును కొనసాగించడంతో జిల్లాలో రెండు ప్రధాన రాజకీయ శిబిరాల మధ్య పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. పెద్దిరెడ్డి తన రాజకీయ వారసత్వాన్ని కుటుంబ సభ్యులకూ విస్తరించారు. కుమారుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎంపీగా, సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఎమ్మెల్యేగా రాజకీయాల్లో కొనసాగడం కుటుంబ ప్రభావాన్ని ప్రతిబింబిస్తోంది. అయితే, ఎన్నికల విజయాలను కేవలం వ్యక్తిగత వ్యూహాలకే ఆపాదించలేం. స్థానిక నాయకత్వం, పార్టీ బలం, ప్రజల మద్దతు, నియోజకవర్గ సమస్యలపై స్పందన వంటి అంశాలూ కీలక పాత్ర పోషిస్తాయి. మొత్తంగా చూస్తే, తొలి ఓటముల నుంచి జిల్లా స్థాయి ఆధిపత్యం వరకు పెద్దిరెడ్డి సాగించిన ప్రయాణం చిత్తూరు రాజకీయాల్లో ఆసక్తికరమైన అధ్యాయంగా నిలుస్తోంది.

అండమాన్ సముద్రంలో అల్పపీడనం..

ఏపీ తీరం వైపు పయనం

దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం

అదే ప్రాంతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

రానున్న 24 గంటల్లో సుస్పష్ట అల్పపీడనంగా మారే ఛాన్స్

పశ్చిమ వాయవ్య దిశగా కదులుతున్న వ్యవస్థ

అమరావతి వాతావరణ కేంద్రం అధికారిక ప్రకటన

బంగాళాఖాతంలో మరోసారి వాతావరణ అలజడి మొదలైంది. దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ఇది రానున్న 24 గంటల్లో మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వాయుగుండం ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా పయనించే సూచనలు కనిపిస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. వివరాల్లోకి వెళితే, నిన్న దక్షిణ అండమాన్ సముద్రంలో కేంద్రీకృతమైన అల్పపీడనం, శుక్రవారం ఉదయం 8:30 గంటల సమయానికి మరింత స్పష్టంగా రూపుదిద్దుకుని, దక్షిణ అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల సమీపంలో కొనసాగుతోంది. ఇది ప్రస్తుతం పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తోంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ అల్పపీడనం అక్టోబర్ 31వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతంలో ఒక వాయుగుండంగా కేంద్రీకృతం కానుంది. వాయుగుండంగా మారిన తర్వాత కూడా ఇది పశ్చిమ వాయవ్య దిశలోనే తన ప్రయాణాన్ని కొనసాగించి, రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా కదిలే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ వాతావరణ పరిణామం ప్రభావంతో రానున్న రోజుల్లో ఏపీ తీర ప్రాంతాల్లో వాతావరణం మారే అవకాశం ఉంది. దీని కదలికలను, తీవ్రతను అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున, మత్స్యకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు జారీ చేసే అవకాశం ఉంది. వాయుగుండం తీరానికి ఎంత దూరంలో కేంద్రీకృతమవుతుంది, దాని ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందనే దానిపై రానున్న 48 గంటల్లో మరింత స్పష్టత రానుంది.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

ఏపీకి మళ్లీ వర్ష గండం

నవంబర్ 2, 3 తేదీల్లో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం

అర్నబ్ తుపాను ప్రభావం నుంచి ఏపీ ఇంకా కోలుకోకముందే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. దక్షిణ అండమాన్ సముద్రం పరిసరాల్లో ఏర్పడిన ఈ వాతావరణ వ్యవస్థ రానున్న రోజుల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో గంటకు 45?55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయి. సముద్రంలో అలజడి ఉండే అవకాశం నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి. ఇప్పటికే అర్నబ్ తుపాను కారణంగా పంటలు దెబ్బతిని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో మరో అల్పపీడనం ఏర్పడటంతో కోస్తా జిల్లాల ప్రజల్లో ఆందోళన మొదలైంది. వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండండి.

డివైడర్‌ను ఢీకొట్టిన బొలెరో

యడ్లపాడు : జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న ఈ వాహనం యడ్లపాడు సమీపానికి చేరుకోగానే, మితిమీరిన వేగం, డ్రైవర్ నిద్రమత్తుతో పాటు అకస్మాత్తుగా టైర్ పంక్చర్ కావడంతో ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో బొలెరో తీవ్రంగా ధ్వంసమవగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు; వెనుక వస్తున్న వాహనాలు సకాలంలో ఆగడంతో పెద్ద ముప్పు తప్పింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బహుదా నదికి పోటెత్తిన వరద..

12 రైళ్ల రాకపోకలు రద్దు

శ్రీకాకుళం : అర్నబ్ తుఫాన్ ప్రభావంతో.. శ్రీకాకుళం జిల్లాలో కురిసిన వర్షాలకు నదులలో వరద పోటెత్తింది. వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బహుదా నదుల్లోకి వరద నీరు భారీగా చేరింది. ఎగువన ఒడిశాలోని భగలట్టి డ్యామ్ వద్ద గేట్లు ఎత్తివేయడంతో పాటు భారీ వర్షాల వల్ల ఇచ్ఛాపురంలోని బహుదా నది ఉగ్రరూపం దాల్చింది. దాంతో పదుల సంఖ్యలో గ్రామాలు జలదిగ్బంధం లో చిక్కుకున్నాయి. పలు చోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలోనే.. కోల్‌కతా – చెన్నై మార్గంలో ఇచ్ఛాపురం మీదుగా వెళ్లే 12 రైళ్లు రద్దు చేసారు. అలాగే.. 8 రైళ్ల రూట్‌ను మార్చడంతో పాటు మరో ఎనిమిది రైళ్లు రీషెడ్యూల్ చేసారు.

ఏలూరు మేయర్ పీఠం కోసం హోరాహోరీ

ఏలూరు, అక్టోబరు 30 : ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల్లో అమలులోకి వచ్చిన ప్రత్యక్ష ఎన్నికల విధానంతో ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ పీఠం కోసం హోరాహోరీ సమరం నడుస్తోంది. కూటమి పొత్తు ఒప్పందంలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించిన ఈ మేయర్ స్థానానికి ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు కూటమి ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలవగా.. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గంటా మోహన్ రావు ప్రత్యర్థిగా తలపడుతున్నారు. కూటమి అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడికి స్థానిక రాజకీయాల్లో దశాబ్దాల క్షేత్రస్థాయి అనుభవం అతిపెద్ద బలం. గతంలో సుదీర్ఘకాలం టీడీపీలో ఉండి, సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, ఏలూరు మండల పరిషత్ అధ్యక్షుడిగా పనిచేసిన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఆయనకుంది. 2019 నుంచి ఏలూరు జనసేన ఇన్‌చార్జ్‌గా పనిచేస్తూ పార్టీ కేడర్‌ను నిర్మించడంతో పాటు, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్‌గా కార్మిక, ప్రజా సంఘాలతో ఆయనకు బలమైన అనుబంధం ఉంది. దీనికితోడు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చరిష్మా, టీడీపీ–జనసేన సంప్రదాయ కాపు, బీసీ, బలిజ ఓటు బ్యాంకు ఒక్కతాటిపైకి రావడం ఆయనకు కొండంత అడ్వాంటేజ్. అయితే, ఏలూరు మేయర్ సీటు తమకే కావాలంటూ ప్రారంభంలో స్థానిక టీడీపీ కేడర్, ఆశావహులు వ్యక్తం చేసిన తీవ్ర అసంతృప్తి, ఎమ్మెల్యే బడేటి చంటి వర్గంతో సమన్వయం సాధించడంలో తొలుత ఎదురైన అంతర్గత అసంతృప్తి అప్పలనాయుడికి కొంత ప్రతిబంధకంగా మారాయి. మరోవైపు వైసీపీ అభ్యర్థి గంటా మోహన్ రావు కూడా నగరంలో బలమైన ఆర్థిక, సామాజిక వనరులున్న నాయకుడిగా బరిలోకి దిగారు. నగరంలోని బీసీ వర్గాలతో పాటు, సంప్రదాయంగా వైసీపీ వెన్నంటి నిలిచే మైనార్టీ, ఎస్సీ , కొన్ని కార్మిక వాడల ఓటు బ్యాంకుపై ఆయన ప్రధానంగా ఆశలు పెట్టుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అమలైన సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలుస్తూ, ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రచారం చేస్తూ కేడర్‌ను మోహరించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, గత మున్సిపల్ పాలకవర్గంపై ఏలూరు ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకత, గతంలో నగరంలో తాగునీటి కాలుష్యంతో పదుల సంఖ్యలో ప్రజలు అస్వస్థతకు గురైన చేదు జ్ఞాపకాలు ఇప్పటికీ నగరవాసుల మదిలో ఉండటం వైసీపీకి అతిపెద్ద మైనస్. అదీగాక, ఓటమి భయంతో నగరానికి చెందిన మాజీ మంత్రులు, కీలక వైసీపీ నేతలు ప్రచారానికి మొహం చాటేయడం, ఆయనకు పూర్తిస్థాయి అంగబలం కరువవ్వడం ప్రధాన బలహీనతగా మారింది. ఈ ఎన్నికల్లో డివిజన్ల స్థాయిలో కార్పొరేటర్ అభ్యర్థుల బలం మేయర్ పోరును ప్రత్యక్షంగా శాసిస్తోంది. నగరంలోని 62 డివిజన్లలో దాదాపు అన్ని చోట్లా కూటమి శ్రేణులు ముందస్తుగా సమన్వయ కమిటీలు వేసుకుని, బూత్ లెవల్ ప్రచారంలో స్పష్టమైన పైచేయి సాధించాయి. గతంలో తమ మధ్య ఉన్న అసంతృప్తులను పక్కనబెట్టి.. టీడీపీ ఎమ్మెల్యే బడేటి చంటి, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, జనసేన నేతలు ఏకతాటిపైకి వచ్చి అప్పలనాయుడి తరఫున ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మరోవైపు, వైసీపీకి చాలా డివిజన్లలో సమర్థులైన కార్పొరేటర్ అభ్యర్థులే దొరక్కపోవడం, బరిలో ఉన్నవారు సైతం సొంత ఖర్చులతో రిస్క్ తీసుకోలేక చతికిలపడటం మేయర్ అభ్యర్థి గంటా మోహన్ రావుకు క్షేత్రస్థాయిలో గొడ్డలిపెట్టుగా మారింది. సామాజిక సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే.. ఏలూరు నగరంలో దాదాపు 60 శాతానికి పైగా ఉన్న బీసీ, కాపు, వైశ్య, ఉద్యోగ వర్గాలు కూటమి ప్రభుత్వ అభివృద్ధి ఎజెండా, పెన్షన్ల పెంపు, దీపం-2' వంటి సంక్షేమ పథకాల వైపే స్పష్టంగా మొగ్గుచూపుతున్నాయి. అప్పలనాయుడికున్న క్లీన్ ఇమేజ్, స్థానిక నాయకత్వ పట్టు ఆయనకు సాధారణ తటస్థ ఓటర్లలోనూ ఆదరణ తెచ్చిపెడుతోంది. వైసీపీ కేవలం తమ పాత సంప్రదాయ ఓట్లను మాత్రమే నిలుపుకోగలుగుతుండగా, కొత్తగా ఓటర్లను ఆకర్షించే అంశాలేవీ ఆ పార్టీ వద్ద లేకపోవడం ప్రచారంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మేయర్ ప్రత్యక్ష పోరులో కూటమి–జనసేన అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడికే దాదాపు 65 నుంచి 70 శాతం మేర స్పష్టమైన విజయావకాశాలు కనిపిస్తున్నాయి. టికెట్ కేటాయింపు సమయంలో తలెత్తిన విభేదాలను అధిగమించి కూటమి శ్రేణులు ఏకతాటిపైకి రావడం ఆయనకు అతిపెద్ద రక్షాకవచంగా మారింది. దీంతో గంటా మోహన్ రావు గట్టి పోటీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుని, అక్కడ జనసేన జెండా ఎగరడం దాదాపు లాంఛనమేనని అనుకోవచ్చు.

ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు..

రైల్వే స్టేషన్‌లో మారణహోమం

నిప్రో రైల్వే స్టేషన్‌పై రష్యా జెట్-పవర్డ్ డ్రోన్‌తో దాడి

14 మంది మృతి, మరో 14 మందికి తీవ్ర గాయాలు

ఉక్రెయిన్ వ్యాప్తంగా దాడుల్లో 20కి పైగా పౌరుల మృతి

పౌరులనే లక్ష్యంగా చేసుకున్నారంటూ జెలెన్స్కీ ఆవేదనరష్యాపై కఠిన ఆంక్షలు విధించాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపు

నిప్రో : ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి విరుచుకుపడింది. గురువారం ఉదయం నిప్రో నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌పై జెట్–పవర్డ్ డ్రోన్‌తో భీకర దాడికి పాల్పడింది. రద్దీగా ఉండే ప్లాట్‌ఫామ్‌ను లక్ష్యంగా చేసుకున్న ఈ దాడిలో కనీసం 14 మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. దేశవ్యాప్తంగా జరిగిన పలు దాడుల్లో మొత్తం మృతుల సంఖ్య 20 దాటింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. జపోరిజియా వెళ్లే ప్యాసింజర్ రైలు, మరో కమ్యూటర్ రైలు ప్లాట్‌ఫామ్‌పై ఉన్నప్పుడు ఈ దాడి చోటుచేసుకుంది. దాడికి ముందు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, చాలామంది పౌరులు అక్కడే ఉండటంతో ప్రాణనష్టం భారీగా జరిగింది. నిప్రోపెట్రోవ్స్క్ ప్రాంతంపైకి రష్యా ప్రయోగించిన నాలుగు డ్రోన్లలో మూడింటిని ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చివేయగా, ఒకటి రైల్వే స్టేషన్‌ను తాకిందని అధికారులు తెలిపారు. మృతుల్లో 11 ఏళ్ల బాలుడు కూడా ఉన్నాడని, ఓ వ్యక్తి తన రెండు కాళ్లను కోల్పోయాడని ప్రాంతీయ గవర్నర్ ఒలెక్సాండర్ హంజా వెల్లడించారు. ప్లాట్‌ఫామ్‌పై మృతదేహాలు, రక్తపు మడుగులు, ధ్వంసమైన రైళ్లతో భయానక వాతావరణం నెలకొందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇదే రోజు ఉక్రెయిన్‌లోని ఇతర ప్రాంతాల్లోనూ రష్యా దాడులు చేసింది. చెర్నిహివ్ నగరంలో జరిగిన దాడిలో 15 ఏళ్ల వయసున్న ఇద్దరు బాలికలు మరణించారు. క్రెమెన్‌చుక్‌లో ఓ నివాస భవనంపై డ్రోన్ దాడి జరగడంతో ముగ్గురు చనిపోగా, 15 మంది గాయపడ్డారు. దేశవ్యాప్తంగా ఈ దాడుల్లో గాయపడిన వారి సంఖ్య 50కి పైగా ఉన్నట్లు అంచనా. ఈ దాడిని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ "అత్యంత భయంకరమైనది"గా అభివర్ణించారు. సాధారణ ప్రయాణికులు, పౌరులు ఉండే రైల్వే స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రష్యాపై అమెరికా, ఐరోపా దేశాలు మరింత కఠినమైన ఆంక్షలు విధించాలని మరోసారి పిలుపునిచ్చారు. అయితే, ఈ దాడికి తామే బాధ్యులమని రష్యా ప్రకటించలేదు. పౌరులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యం చేసుకోలేదని, సైనిక, రవాణా కేంద్రాలపైనే తమ దాడులు ఉంటాయని రష్యా వాదిస్తోంది.

డోన్ మున్సిపాల్టీలో ఒంటరి పోరు

కర్నూలు, అక్టోబరు 30 ఫ డోన్ మున్సిపాలిటీలో రాజకీయ వాతావరణం ఉత్కంఠభరితంగా మారింది. ఐదేళ్ల పాటు నియోజకవర్గంలో ఆధిపత్యం చలాయించిన మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, స్థానిక సంస్థల సమరంలో తమ పట్టు కోల్పోకుండా గట్టిగా పోరాడుతున్నట్లు కలరింగ్ ఇచ్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో , బేతంచర్ల వంటి సొంత మండలంలో తీవ్ర ప్రతికూల పరిస్థితులు ఎదురై అభ్యర్థులు కొరవడినప్పటికీ, డోన్ పురపాలక సంఘం పరిధిలో మాత్రం తమ ఉనికిని కాపాడుకునేందుకు కోట్ల కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ పోటీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. డోన్ పట్టణ పరిధిలో వైఎస్సార్‌సీపీకి ఇంకా మిగిలి ఉన్న కొద్దిపాటి వర్గ బలాన్ని ఏకం చేసి, కనీసం పోటీ ఉందనే అభిప్రాయాన్ని కల్పించేందుకు బుగ్గన రోజూ ప్రచారంలో పాల్గొంటున్నారు. అయితే, ఓటమి భయంతోనే ఆయన సానుభూతి కార్డ్ వాడుతున్నారని, కోట్ల సుజాతమ్మపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం ద్వారా వివాదాన్ని రాజేసి రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోట్ల సుజాతమ్మపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. స్వయంగా ఆమే మున్సిపల్ చైర్మన్ బరిలో ఉన్నారు. ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, ఆయన సతీమణి కోట్ల సుజాతమ్మ డోన్ మున్సిపాలిటీని కూటమి ఖాతాలో వేసేందుకు వార్డుల వారీగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. 32 వార్డుల్లో బలమైన స్థానిక నాయకులను పోటీలో నిలిపి, బుగ్గన హయాంలో జరిగిన అభివృద్ధి లోపాలు, అక్రమాలను ఓటర్ల ముందుకు తీసుకెళ్తున్నారు. కోట్ల సుజాతమ్మనే మున్సిపల్ చైర్మన్ గా టీడీపీ హైకమాండ్ ఖరారు చేసింది. గతంలో ఎమ్మెల్యేగా చేసినప్పటికీ పోటీకి సుజాతమ్మ అంగీకరించిరంగంలోకి దిగారు. ఒకవైపు బుగ్గన డోన్ మున్సిపాలిటీలో గట్టిగా పోరాడుతున్నట్లు మీడియా ముందుకు వస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం నామినేషన్ల ఘట్టం నుంచే టీడీపీ–జనసేన కూటమి స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తోంది. బలమైన అభ్యర్థి కావడంతో బుగ్గన రాజేంద్రనాథ్ ఆరోపణలతో ఎదురుదాడి చేస్తున్నారు.

మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట

రాజమండ్రి : వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం వల్ల నిత్యావసర సరుకుల ధరలు నింగినంటుతుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయంగా, దేశీయంగా పెరిగిన ద్రవ్యోల్బణ భారాన్ని సామాన్యులపై పడకుండా నిరోధించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. రాబోయే దీపావళి పండుగ నుంచే రాష్ట్రంలోని పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ద్వారా రేషన్ షాపుల్లో నిత్యావసర వస్తువులను మార్కెట్ ధరల కంటే సగానికి పైగా తక్కువ రేటుకే అందుబాటులోకి తేవాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక సబ్సిడీ ప్రణాళిక ప్రకారం.. మార్కెట్‌లో కిలో రూ.160 నుంచి రూ. 180 వరకు పలుకుతున్న కందిపప్పును కేవలం రూ. 100 కే అందించనున్నారు. అలాగే లీటరు పామాయిల్‌ను రూ. 125 కే, గోధుమపిండిని కిలో రూ. 25 కే పంపిణీ చేయనున్నారు. వీటితో పాటు క్వాలిటీ బియ్యాన్ని తక్కువ ధరలకే అందించేందుకు ప్రత్యేక మొబైల్ వాహనాలు, రైతు బజార్లను విస్తృతంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌లో రేట్ల కృత్రిమ కొరతను అరికట్టేందుకు, ఉల్లిపాయల నిల్వలను కూడా నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ , రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకు ఈ సరుకులను పంపిణీ చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై నెలకు దాదాపు రూ. 100 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఎల్ నినో వల్ల పెరిగిన ధరల నుంచి సామాన్యులకు ఊరట కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల కడుపు నింపే విషయంలో సంక్షేమానికి వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు. దీపావళి కానుకగా అందుబాటులోకి రానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలో కోట్లాది మంది కార్డుదారులు , సామాన్య ప్రజలు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఒకవైపు పండుగ సీజన్, మరోవైపు ఎల్ నినో ప్రభావంతో కూరగాయలు, దినుసుల ధరలు మండిపోతున్న తరుణంలో చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం మధ్యతరగతి గృహిణులకు ఎనలేని ఊరటనిస్తోంది. ప్రభుత్వం సకాలంలో స్పందించి చౌక ధరల సరుకులను రేషన్ డిపోల వేదికగా అందుబాటులోకి తేవడంపై పబ్లిక్ సర్కిల్స్‌లో హర్షం వ్యక్తమవుతోంది.

నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టివేత

హైదరాబాద్ : మలక్పేట్లో నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ రవాణాపై పోలీసులు తనిఖీలునిర్వహించారు. మూసారాంబాగ్ రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టుబడింది. ఆటోలో అక్రమంగా పొగాకు ఉత్పత్తులను తరలిస్తుండగా ఎస్ఐ తేజ్యా నాయక్ బృందం గుర్తించింది. ఆటో డ్రైవర్ను విచారించగా సిరిపురం కాలనీలోని గోదాములో భారీ నిల్వలుబయటపడ్డాయి. పోలీసులు గోదామును తనిఖీ చేసి నిషేధిత పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారి మధుసూదన్ (61), ఆటో డ్రైవర్ ధూప సుధాకర్ను అదుపులోకి తీసుకున్నారు. గుడిమల్కాపూర్, కిషన్బాగ్ ప్రాంతాల నుంచి పొగాకు ఉత్పత్తులు తీసుకొచ్చి మలక్పేట్ పరిసర ప్రాంతాల్లోని పాన్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడి అయింది. నిషేధిత పొగాకు ఉత్పత్తులతో పాటు రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసారు.

కొన్ని కండీషన్స్ ఎంతో కోల్పోయా : మృనాల్‌ఠాగూర్

మొదటి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకుని ఇండస్ట్రీలోనే సెన్సేషన్ అయ్యింది. అయితే కెరీర్ తొలినాళ్లల్లో తన తల్లిదండ్రులు పెట్టిన కండిషన్ వల్ల ఎన్నో సినిమా ఆఫర్స్ కోల్పోయానని తెలిపింది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా? హీరోయిన్ మృణాల్ ఠాకూర్. సీతారామం సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. 2022లో విడుదలైన ఈ మూవీ భారీ విజయాన్ని సాధించింది. ఈ సినిమాతో పాన్ ఇండియా లెవల్లో గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ వంటి చిత్రాల్లో నటించింది. కాలేజీ రోజుల్లోనే మరాఠీ సీరియల్లో నటించింది మృణాల్. ఆ తర్వాత హిందీలో మరిన్ని ఆఫర్స్ అందుకుంది. ఆ తర్వాత హాలో నందన్ సినిమాతో వెండితెరకు పరిచయమైంది. రాహుల్ జాదవ్ దర్శకత్వం వహించిన మరాఠీ భాషా చిత్రంలో ఆమె కథానాయికగా అరంగేట్రం చేసింది. ఈ సినిమా తర్వాత మరిన్ని ఆఫర్స్ అందుకుంది. ఈ క్రమంలోనే కెరీర్ తొలినాళ్లల్లో ఎన్నో ఆఫర్స్ కోల్పోయిందట. గతంలో ఓ ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ.. తాను ఎన్నో హిట్ మూవీస్ కోల్పోయానని తెలిపింది. కెరీర్ తొలినాళ్లల్లో తాను రొమాంటిక్ సీన్లలో నటించనని తన తల్లిదండ్రులు షరతు పెట్టారని.. దీంతో తాను చాలా హిట్ మూవీస్ కోల్పోయానని తెలిపింది. నటి కావాలనే తన కల చెదిరిపోతుందనే భయంతో ఆమె తన తల్లిదండ్రులతో మాట్లాడి.. రొమాంటిక్ చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపింది. ప్రస్తుతం మృణాల్ పూజా మేరీ జాన్, హై జవానీ తో ఇష్క్ హెూనా హై, సర్దార్ సన్ 2, తుమ్ హై తో , డకోయిట్: ఎ లవ్ స్టోరీ వంటి చిత్రాల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఆమె 'డగోయిట్: ఎ లవ్ స్టోరీ' చిత్రంలో యాక్షన్ హీరోయిన్‌గా నటిస్తోంది. మొదట్లో ఈ సినిమాలో నటి శ్రుతి హాసన్ నటించాల్సి ఉంది. కానీ కొన్ని సమస్యల కారణంగా ఆమె ఆ ప్రాజెక్ట్ నుండి తప్పుకుంది. అడివి శేష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాను నూతన దర్శకుడు షానిల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు.

హీరోయిన్ సంధ్య ఇలా మారిపోయిందా..?

వాలెంటైన్స్ డే.. ఈ సందర్భంగా థియేటర్లలో ఒకప్పటి ప్రేమకథలు చిత్రాలు మరోసారి సందడి చేస్తున్నాయి. అలాగే సినీప్రియుల మదిలో నిలిచిన అద్భుతమైన లవ్ స్టోరీ చిత్రాల్లో ప్రేమిస్తే ఒకటి. 2004లో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం. నిజ జీవితం ఆధారంగా తెరకెక్కించిన ఈ ప్రేమకథ అప్పట్లో భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమా కథ ప్రతి ఒక్కరిని హత్తుకుంది. అలాగే ఈ చిత్రంలోని సాంగ్స్ ఇప్పటికీ ఎక్కడో ఒకచోట వినిపిస్తూనే ఉంటాయి. ముఖ్యంగా ఈ సినిమా లవ్ ఫెయిల్యూర్ కుర్రాళ్లకు ఎక్కువగా కనెక్ట్ అయ్యింది. ఈ చిత్రంలో కోలీవుడ్ హీరో భరత్, సంధ్య హీరోహీరోయిన్లుగా నటించి మెప్పించారు. వీరిద్దరి యాక్టింగ్ ప్రేక్షకులను కన్నీళ్లు పెట్టించింది. ఇక ఈ సినిమాతోనే వెండితెరకు కథానాయికగా పరిచయమయ్యింది సంధ్య. మొదటి సినిమాతోనే తెలుగులో ఆమెకు మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఆ తర్వాత సౌత్ ఇండస్ట్రీలో ఆమెకు వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. ప్రేమిస్తే సినిమాతో వచ్చిన స్టార్ డమ్ ఆ తర్వాత కాపాడుకోలేకపోయింది సంధ్య. హీరోయిన్ గానే కాకుండా సహాయ నటిగా కనిపించింది. తెలుగు, తమిళంలో పలు చిత్రాల్లో కీలకపాత్రలు పోషించింది. పవ్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన అన్నవరం సినిమాలో పవన్ చెల్లిగా కనిపించింది. అందం, అభినయంతో వెండితెరపై సందడి చేసిన సంధ్యకు అనుకున్నంతగా అవకాశాలు మాత్రం రాలేదు. ఆ తర్వాత కొన్నాళ్లకే ఆమె సినిమాలకు దూరమయ్యింది. 2015లో చెన్నైకు చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ అర్జున్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరిద్దరి వివాహం గురువాయూర్ ఆలయంలో జరిగింది. వీరికి ఒక పాప జన్మించింది. ప్రస్తుతం సంధ్య తన ఫ్యామిలీ తో లైఫ్ ఎంజాయ్ చేస్తుంది. ప్రస్తుతం సంధ్య లేటెస్ట్ ఫోటోస్ నెట్టింట వైరలవుతుండగా.. అందులో సంధ్య లుక్ చూసి ఆశ్చర్యపోతున్నారు నెటిజన్స్.

ఆకట్టుకుంటున్న హరిహరవిరమల్లు పోస్టర్

హరి హర వీరమల్లు నుంచి వాలెంటైన్స్ డే సందర్భంగా ఓ కూల్ పోస్టర్‌ను వదిలారు. పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్ ఈ పోస్టర్‌లో ఎంతో చూడముచ్చటగా కనిపిస్తున్నారు. ఈ ఇద్దరికి మంచి రొమాంటిక్ సాంగ్ కూడా ఉన్నట్టుగా కనిపిస్తోంది. కొల్లగొట్టినాదిరో అంటూ సాగే రెండో పాటను ఫిబ్రవరి 24న రిలీజ్ చేస్తున్నట్టుగా ప్రకటించారు. ఈ రెండో పాటకు సంబంధించిన అప్డేట్ ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది. మాట వినాలి అంటూ వదిలిన ఫస్ట్ సింగిల్‌కు మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. పవన్ కళ్యాణ్ హరి హర వీరమల్లు ఆలస్యం అవుతూనే వస్తోంది. మార్చి 28న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తారని యూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మధ్యలో ఈ మూవీని వాయిదా వేస్తారని అన్నారు. రెండు పార్టులుగా సినిమాను విడగొట్టిన సంగతి తెలిసిందే. మొదటి పార్టుని చాలా వరకు క్రిష్ కంప్లీట్ చేశాడు. కానీ ఇప్పుడు ఈ ప్యాచ్ వర్క్‌లు మిగతా పనుల్ని ఏఎం రత్నం కొడుకు జ్యోతి కృష్ణ కంప్లీట్ చేస్తున్నాడు. హరి హర వీరమల్లు రెండో పార్ట్ మొత్తాన్ని కూడా జ్యోతి కృష్ణ తెరకెక్కిస్తాడు. అసలు ఈ మొదటి పార్ట్ షూటింగ్ ఎప్పుడు ఫినిష్ అవుతుందా? అని అంతా ఎదురుచూస్తున్నారు. చెప్పిన టైంకి సినిమాను డెలివరీ చేస్తారా? అనే అనుమానం అందరిలోనూ ఉంది.

యూత్ ఆడియెన్స్‌కు కిక్కిచ్చేలా బ్యూటీ పోస్టర్

ఆయ్, మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం వంటి హిట్ చిత్రాల్లో తనదైన మార్క్ క్రియేట్ చేసుకున్న అంకిత్ కొయ్య ఇందులో హీరోగా నటిస్తున్న చిత్రం 'బ్యూటీ'. 'త్రిబాణదారి బార్బరిక్' అంటూ ఓ మైథలాజికల్ థ్రిల్లర్ మూవీతో వానరా సెల్యూలాయిడ్ ఆడియెన్స్‌ను మెప్పించేందుకు ఈ చిత్రంతో రెడీ అవుతోంది. వానరా సెల్యూలాయిడ్, మారుతీ టీం ప్రొడక్ట్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'బ్యూటీ' చిత్రానికి సంబంధించిన అప్డేట్ ఇచ్చారు. 'గీతా సుబ్రమణ్యం', 'హలో వరల్డ్', 'భలే ఉన్నాడే' ఫేమ్ వర్ధన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కె ఆర్ బన్సాల్ నిర్మించారు. నీలఖి హీరోయిన్ గా నటించారు. తాజాగా 'బ్యూటీ' అనే టైటిల్‌ను ప్రకటించడంతోపాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. మోషన్ పోస్టర్‌లో చూపించిన బీచ్, రోడ్డు, ఇళ్లు..ఆ తరువాత చివర్లో హీరో హీరోయిన్లను రొమాంటిక్‌గా చూపిస్తూ టైటిల్‌ను చూపించిన తీరు అద్భుతంగా ఉంది. యూత్ ఆడియెన్స్‌కు కిక్కిచ్చేలా ఉంది పోస్టర్. నరేష్, వాసుకి, నంద గోపాల్, సోనియా చౌదరి, నితిన్ ప్రసన్న, మురళీ గౌడ్, ప్రసాద్ బెహరా కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్‌గా శ్రీ సాయి కుమార్ దారా పని చేస్తున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు.

ప్రేమికుల రోజు సందర్భంగా ఇన్‌స్టాలో ఫొటోలు షేర్ చేసిన ఆ ముగ్గురు హీరోయిన్లు

ఫొటో అందాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న నెటిజన్లు

హీరోయిన్, ఒక్కో భామ ఒక్కో స్టైల్లో అందాలను ప్రదర్శిస్తుంటుంది. కొందరు బుల్లి బట్టలు వేసుకుని అందాలను ప్రదర్శిస్తుంటారు.. మరి కొందరు ట్రెడిషనల్ వేర్‌లో మైండ్ బ్లాక్ చేస్తుంటారు. ఒంపు సొంపులు కనిపించేలా మరి కొంత మంది ఎక్స్ పోజింగ్ చేస్తుంటారు. ఇక ఇన్ స్టాలో ప్రస్తుతం భామలు వదిలిన ఫోటోలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. వాలెంటైన్స్ డే స్పెషల్ అన్నట్టుగా ఒక్కొక్కరు ఒక్కోలా కనువిందు చేస్తున్నారు. ప్రభాస్ ఫౌజీతో పాన్ వరల్డ్‌గా ఫేమస్ కాబోతోంది ఇమాన్వీ. ఇప్పటికే ఈ మూవీ సెట్‌లో ఈ భామ సందడి చేసింది. ప్రభాస్ పెట్టిన ఫుడ్‌ను కూడా టేస్ట్ చేసింది. అన్ని రకాల వంటల్ని చూసి ఇమాన్వీ మైండ్ తిరిగిపోయి ఉంటుంది. ఇక ఈ భామ ఇప్పుడు క్యూట్‌గా పోజులు పెట్టి అందరినీ ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ఇక వితిక అయితే పదేళ్లు వెనక్కి వెళ్లింది. పడ్డానండి ప్రేమలో సినిమా టైంలోని ఫోటోలను షేర్ చేసింది. వరుణ్ సందేశ్‌తో చేసిన ఈ సినిమాతోనే వీరి ప్రయాణం మొదలైందన్న సంగతి తెలిసిందే. ఇక తమ పరిచయానికి పదేళ్లు అన్నట్టుగా వితిక ఇలా పాత ఫోటోల్ని వదిలింది. ఈ పదేళ్లలో వీరిద్దరూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. తాజాగా స్రవంతి చొక్కారపు.. కుర్రాళ్లు చొక్కాలు చించుకునేట్టుగా చేసింది. తన ఎద అందాలను చూపించీ చూపించుకుండా.. వదిలిన ఫోటోలతో ఇన్ స్టాలో అగ్గి రాజేసినట్టు అయింది. స్రవంతి దెబ్బకు నెటిజన్లు అంతా నోరెళ్లబెట్టేస్తున్నారు. అమ్మో.. అంటూ ఆ అందాల ఆరబోతని చూసి కామెంట్లు పెడుతున్నారు. సోషల్ మీడియాలో బ్యూటీలు ఇలా అందాలను ప్రదర్శిస్తూనే ఫాలోయింగ్‌ను పెంచుకుంటారు. ఇక వాలెంటైన్స్ డే అంటూ కొందరు భామలు మరింతగా కుర్రాళ్లను కవ్విస్తున్నారు. అషూ, ఆండ్రియా వంటి వారు కూడా రకరకాల ఫోటోలను వదులుతూ నెట్టింట్లో నానా హంగామా చేస్తున్నారు. నిరుపమ్ పరిటాల అయితే ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌లో ఎంజాయ్ చేస్తున్నాడు.

వాలెంటైన్స్ డే మీకోసం కాదు... కేవలం వాళ్లకోసమే...

వాలెంటెన్స్‌డేకు సరికొత్త అర్థం చెప్పిన ఉపాసన

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరంలేదు. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఏదోక పోస్ట్ చేస్తుంటారు. అలాగే అప్పుడప్పుడు చరణ్, క్లింకారకు సంబంధించిన ఫోటోస్, మూవీ అప్డేట్స్ పై షేర్ చేస్తూ ఫాలోవర్లను ఆక్టట్టుకుంటారు. తాజాగా ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మెగా కోడలు ఉపాసన ఆసక్తికర పోస్ట్ చేసింది. వాలెంటైన్స్ డేకు సరికొత్త అర్థం చెబుతూ ఉపాసన షేర్ చేసిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట తెగ వైరలవుతుంది. ఫిబ్రవరి 14న కేవలం కొందరి కోసమే అంటూ ఫన్నీగా పోస్ట్ చేసింది. ఇది చూసిన నెటిజన్స్ ఫన్నీగా రియాక్ట్ అవుతున్నారు. ఇంతకీ ఉపాసన ఏం పోస్ట్ చేసిందో తెలుసా.. ? ప్రస్తుతం ఉపాసన కొణిదెల చేసిన పోస్ట్ నవ్వులు పూయిస్తుంది. "వాలెంటైన్స్ డే అనేది 22 ఏళ్లు. అంతకంటే తక్కువ వయసు ఉన్న అమ్మాయిలకు సంబంధించినది. మీరు అంతకంటే ఎక్కువ వయసు ఉన్నవారు అయితే.. ఆంటీ దయచేసి ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే కోసం ఎదురుచూడండి" అంటూ పోస్ట్ చేశారు ఉపాసన. ఆమె పోస్టుకు స్మైలీ ఎమోజీలను సైతం జత చేయడంతో నెట్టింట వైరలవుతుంది. ఉపాసన పోస్ట్ పై నెటిజన్స్ క్రేజీగా రియాక్ట్ అవుతున్నారు. ఇక చరణ్ సినిమాల విషయానికి వస్తే.. ఇటీవలే సంక్రాంతి కానుకగా గేమ్ ఛేంజర్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చాడు. డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ పొలిటికల్ యాక్షన్ చిత్రంలో కియారా అద్వానీ, అంజలి, ప్రకాష్ రాజ్, శ్రీకాంత్ కీలకపాత్రలు పోషించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా మిక్స్ టాక్ అందుకుంది. ప్రస్తుతం చరణ్ డైరెక్టర్ బుచ్చిబాబు సరన దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056